అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

బుధవారం 18-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రధానోత్సవం

- ఇది గొప్ప ఆనందం : వహీదా రెహమాన్
- డబుల్ ఎచీవ్‌మెంట్ : అల్లు అర్జున్

12లో..

సంపుటి : 9 సంచిక : 238 Published from Khammam, Rangareddy,Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

## ప్రతిపక్షాలతో ప్రమాదం

ప్రజలు జాగ్రత్తగుండాలే...

- అబద్ధాలతో, ఆపద మొక్కులతో వచ్చే వాళ్లను నమ్మకండి..
- చేనేత కార్మికులను ఆదుకునే బతుకమ్మ చీరెల పంపిణీని రాజకీయం చేయొద్దు..
- నేను ఎమ్మెల్యేగా ఉన్నా ఇంత మంచిగా చేసే వాడిని కాదేమో
- కండ్ల ముందు కనబడుతున్న అభివృద్ధిని చూసి మమ్మల్ని ఆశీర్వదించండి : సిరిసిల్ల, సిద్దిపేట ప్రజా ఆశీర్వాదసభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్




నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి / సిరిసిల్ల రూరల్ / సిద్దిపేట

"అబద్ధాలు, ఆపద మొక్కులతో ప్రతిపక్షాలు దుర్మార్గపు హామీలిచ్చి మనల్ని మోసం చేస్తాయి. వారి మోసాన్ని పసిగట్టి, ఆ పార్టీల ప్రమాదం నుంచి తప్పించుకోవాలి. కండ్ల ముందు ఉన్న అభివృద్ధిని చూసి మమ్మల్ని ఆశీర్వదించండి. విపక్షాల మోసపూరిత మాటలకు లొంగకండి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. సోమవారం సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

సిరిసిల్లతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకుంటూ తన 70 ఏండ్ల జీవితంలో సిరిసిల్లలో వందసార్లు పర్యటించానన్నారు. ఆనాడు సిరిసిల్ల ప్రాంతాన్ని చూస్తే కన్నీళ్లు వచ్చేవని, అప్పట్లో ఏడుగురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవడంతో ఎంతో చలించిపోయానన్నారు. అప్పుడు పార్టీ నిధులు, చందాలు సేకరించి చేనేత కార్మికులకు సాయం చేశామని గుర్తు చేశారు. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా మారిందని, చేనేత శాఖ మంత్రిగా కేటీఆర్ వచ్చాక రూపురేఖలు మారిపోయిన సిరిసిల్ల కండ్ల ఎదుటే ఉందని వివరించారు. చేనేత కార్మికులను ఆదుకొని ఉపాధి కల్పించేందుకే బతుకమ్మ చీరల పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. చివరికి ఈ పథకాన్ని కూడా రాజకీయం చేశారని, చీరలు నచ్చకపోతే తీసుకోవద్దని, అంతేగానీ చీరల పంపిణీని రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. షోలాపూర్ ఎలా ఉంటుందో.. సిరిసిల్లనూ అలా చేయాలనేదే తమ ...11లో

# టార్గెట్ ఉత్తర తెలంగాణ!




### ఈ వ్యూహంలో భాగంగానే బస్సుయాత్ర

- బీఆర్ఎస్ కీలక నేతలపై రేవంత్ దృష్టి
- ఇప్పటికే మండవ, రేవూరితో చర్చలు
- కవిత ముఖ్య అనుచరులతోనూ రహస్య మంతనాలు
- రానున్న రాహుల్, ప్రియాంక

**దక్షిణ తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్...తాజాగా ఉత్తర తెలంగాణే లక్ష్యంగా ముందుకెళుతున్నది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కారు పార్టీకి బ్రేకులేసి, కమలం పువ్వు రెక్కలు రాలగొట్టేందుకు ఆయా పార్టీల్లోని నేతల ముఖ్య అనుచరులు, మండలస్థాయి నాయకులపై రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. కవిత ముఖ్య అనుచరులతోనూ రహస్యమంతనాలు జరుపుతున్నారనే ప్రచారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నది.**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాలపై ప్రభావం చూపే సత్తా ఉన్న బీఆర్ఎస్ నేత మండవ వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ నేత రేవూరి ప్రకాశ్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. వారు కూడా పార్టీ మారేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వారిద్దరూ కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే మిగిలి ఉంది. ఉత్తర తెలంగాణపై పట్టు సాధించడమే టార్గెట్‌గా పెట్టుకుని మరీ మూడు రోజులపాటు బస్సుయాత్రకు కాంగ్రెస్ పూనుకున్నది. ఆ యాత్రలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పాల్గొనడం ఆ పార్టీకి మరింత ఊపు తేనుంది.

రాష్ట్రంలో 2018 ముందస్తు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ 21 స్థానాలు సాధించింది. దక్షిణ తెలంగాణ నుంచి 19 మంది విజయం సాధించారు. ఉత్తర తెలంగాణలో మాత్రం దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి మాత్రమే గెలుపొందారు. ఎప్పటిలాగే దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఆ పార్టీ రెండు, మూడు నెలల వ్యవధిలోనే తిరుగులేని శక్తిగా పుంజుకున్నది. ఆ రెండు జిల్లాల్లోని 22 స్థానాలకు 16 నుంచి 18 సీట్లు సులభంగా గెలిచే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఆశించిన స్థాయిలో సీట్లు లభిస్తాయనే అంచనా ఆ పార్టీకి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ ఆ పార్టీ పుంజుకున్నది. దక్షిణాదిపై పట్టుదొరకడంతో ఉత్తరాదిపై ప్రధానంగా ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రచారాన్ని ఉత్తర తెలంగాణ నుంచి ప్రారంభిస్తున్నది. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని రంగంలోకి దించింది. బస్సుయాత్రలో భాగంగా అనేక వర్గాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో మూడు రోజులపాటు వారు ...11లో



## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉద్యోగాల భర్తీ ఏది?

- కాంగ్రెస్ హామీలనే పెంచి చెప్పిన కేసీఆర్
- మేము రెండులక్షల ఉద్యోగాలు భర్తీ అన్నాం... దాన్ని ఎందుకు పెంచలేదు?
- కేసీఆర్ డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్ పోటీ పడి ఉపఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు చేశాయి
- ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే
- ఫోరెన్సిక్ నివేదిక రాక ముందే...డీసీపీ ప్రెస్ మీట్ ఎలా పెడతారు?
- డీసీపీపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తాం
- 30 లక్షల మంది నిరుద్యోగులు తలుచుకుంటే 90 సీట్లతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం : రేవంత్ రెడ్డి

వివరాలు 11లో..

## ఆ బాధ్యత పార్లమెంటుదే

స్వలింగ సంబంధాలను చట్టబద్ధం చేయలేం : సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ప్రస్తుత రూపంలోని ప్రత్యేక వివాహ చట్టం రాజ్యాంగ స్వభావాన్ని సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. అయితే, స్వలింగ సంపర్కుల సంబంధాలకు చట్టబద్ధమైన ప్రతిపత్తి కల్పించడంపై చర్చించి, నిర్ణయించాల్సిన బాధ్యతను పార్లమెంట్‌కు విడిచిపెట్టింది.

స్వలింగ సంపర్కమనేది కేవలం పట్టణ ప్రాంతాలకు లేదా కులీన వర్గాలకు మాత్రమే పరిమితమైన భావన కాదని ఐదుగురు న్యాయమూర్తులు అంగీకరించారు. అయితే స్వలింగ సంపర్కుల మధ్య సంబంధాలను లాంఛన ప్రాయంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించగలదా లేదా అనే అంశంపై న్యాయమూర్తులు పరస్పరం విభేదించుకున్నారు. స్వలింగ సంపర్కులైన జంటలను గుర్తించేందుకు ఒక క్రమబద్ధీకరణ యంత్రాంగాన్ని రాజ్యాంగ అధికారులు రూపొందించాలని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, మరో ...2లో

## మంత్రులది అవకాశవాదం

దేశంలో కులగణన చేపట్టాలి

- కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయి
- రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటమి తప్పదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-సూర్యాపేట


రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రకటనలు అవకాశవాద రాజకీయాలకు నిదర్శనంగా ఉన్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విఘ్నేశ్వర ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ కూటమి వైపు ఉంటారో చెప్పకుండా గోడ మీద పిల్లి లాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీజేపీతో కలిసి పని చేయడానికి బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతుందన్నారు. దేశంలో కులగణన ...11లో

## న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడులు పెట్టలేదు !

- చైనా నుంచి నిధులు రాలేదు
- నా విరాళాలు అన్నీ నా స్వంత సంపాదనే
- భారత్ ప్రాదేశిక సమగ్రతను దెబ్బ తీయాల్సిన అవసరమే లేదు
- నాలుగు పేజీల లేఖను విడుదల చేసిన నెవిల్లె రాయ్ సింగమ్




షాంఘై : న్యూస్‌క్లిక్‌పై దాడి కేసులో నిందితుడుగా ఢిల్లీ పోలీసులు చేర్చిన అమెరికన్ కోటీశ్వరుడు నెవిల్లె రాయ్ సింగమ్ తనపై ఎఫ్‌ఐఆర్‌లో చేసిన ఆరోపణలను తోసిపుచ్చుతూ నాలుగు పేజీల లేఖను మంగళవారం విడుదల చేశారు. పోలీసులు చేసిన ప్రతి ఆరోపణను ఖండిస్తూ ఆయన వివరణ ఇచ్చారు. న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన వ్యాసం తప్పుదారి పట్టించేదని, పరోక్ష దాడికి ఉద్దేశించిందని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను షాంఘైలో నివసిస్తున్నానని, తాను పుట్టినప్పటి నుండి కేవలం అమెరికన్ జాతీయుడిగా మాత్రమే వున్నానని పేర్కొన్నారు.



న్యూయార్క్ టైమ్స్‌లో వ్యాసం ప్రచురితమైన 12 రోజుల తర్వాత, ఢిల్లీ పోలీసులు రహస్యంగా ఎఫ్‌ఐఆర్‌ను రూపొందించారని ఆ లేఖ పేర్కొంది. అప్రతిష్టపాల్జేసే ఆరోపణలు, అభియోగాలు, తప్పుడు అంశాలతో నిండిన ఆ ఎఫ్‌ఐఆర్‌తో దాదాపు వందమంది జర్నలిస్టులను ఇంటరాగేట్ చేశారు. డజన్ల సంఖ్యలో అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఆ అరెస్టుల ప్రహసనం పూర్తయిన తర్వాత, ఎఫ్‌ఐఆర్‌ను వెల్లడించారు. అందులో తనతో పాటూ చాలామందికి పరువు నష్టం కలిగించేలా ఆరోపణలు చేశారని ఆ లేఖలో నెవిల్లె రాయ్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు గల సన్నిహిత సంబంధాలను ఆయన ఆ లేఖలో వివరించారు. 2000 దశకం ప్రారంభంలో భారత్‌లో తన ఐటి కంపెనీ థాట్ వర్క్స్ కార్యాలయాలను ప్రారంభించానని చెప్పారు. అనేకమంది భారతీయ సహచరులతో కలిసి పనిచేశానని గుర్తు చేసుకున్నారు.

ఈ ఏడాది జులై 22న అంటే న్యూయార్క్ టైమ్స్ వ్యాసం ప్రచురణ తేదీకంటే ముందుగానే వాస్తవ ఖండనలన్నింటినీ అందచేశానని, కానీ ఆ పత్రిక వాటినేవీ ప్రచురించలేదన్నారు. పత్రికా స్వేచ్ఛ ప్రయోజనాలను న్యూయార్క్ టైమ్స్ ...2లో

## అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే !



- ఇజ్రాయిల్ చర్యలపై ఐక్యరాజ్య సమితి హెచ్చరిక
- పదాతి దాడులకు సిద్ధమైతే ముందస్తు చర్యలు తప్పవన్న ఇరాన్
- నెతన్యాహూతో భేటీ కానున్న బైడెన్
- గాజాపై కొనసాగుతున్న దాడులు
- సరిహద్దు క్రాసింగ్స్ తెరిచేది లేదన్న ఇజ్రాయిల్

వివరాలు 2లో..

## క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

- చంద్రబాబు కేసులో శుక్రవారం తీర్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. శుక్రవారం తీర్పు ఇవ్వనుంది. అలాగే ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను కూడా శుక్రవారానికి ...2లో



## సహకరించండి...

- రాజకీయపార్టీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విజ్ఞప్తి
- పార్టీల ప్రతినిధులతో భేటీ

వివరాలు 2లో..

# వన్నె తగ్గిన కాగ్

## స్వతంత్ర సంస్థపై పట్టు బిగించిన మోడీ ప్రభుత్వం

- అక్రమాల నిగ్గు తేలిస్తే బదిలీ వేటు
- విధేయులకు పదవుల పందారం





**ప్రభుత్వ సంస్థల పనితీరులోని లోపాలను ఎండగట్టడం కాగ్ పని. తద్వారా తాను ఆడిట్ చేసిన సంస్థల వ్యవహారాలలో ఆర్థిక జవాబుదారీతనం, పారదర్శకత పెంచేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తుంది. అయితే కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి స్వతంత్ర సంస్థలపై తనదైన శైలిలో పట్టు బిగించారు. దీంతో వాటి పనితీరు మందగిస్తోంది. ఇలాంటి సంస్థల్లో కాగ్ కూడా ఉండడం ఆందోళన కలిగించే విషయమే. కాగ్ సమర్థవంతంగా పనిచేయకుండా అధికారంలో ఉన్న వారే అడ్డుకుంటున్నారని అనేకరుజువులు కన్పిస్తున్నాయి**



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సంబంధించి 2015లో కాగ్ 55 నివేదికలు అందజేయగా 2020లో ఆ సంఖ్య 14కు తగ్గిపోయింది. అంటే నివేదికలు 75% తగ్గాయన్న మాట. 2015లో కాగ్ నుండి 55 నివేదికలు వస్తే ఆ తర్వాత సంవత్సరాలలో వాటి సంఖ్య 42, 45, 23, 21, 14కు తగ్గుతూ వచ్చింది. రక్షణ ఆడిట్ నివేదికలు 2017లో ఏడు అందగా 2020లో ఒక్కటీ రాలేదు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు కాగ్ తన నివేదికల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టింది. 2జీ వేలం, బొగ్గు గనుల వేలం, కామన్వెల్త్ క్రీడలు ...2లో

### అస్మదీయులకు అందలం

కాగ్‌లో మోడీ విధేయుడిగా పేరున్న గుజరాత్ కేడర్ అధికారి గిరీష్ ముర్ము తన బాస్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు చూపవద్దంటూ సీనియర్ అధికారులను బెదిరించారు. దీనికి సంబంధించిన టేపు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. గిరీష్ బెదిరింపులను అనేక మంది సీనియర్ అధికారులు బాహాటంగా బయటపెట్టినా ఆయనపై ఎలాంటి చర్యలు లేవు. గుజరాత్ అల్లర్లపై విచారణ జరిపిన నానావతి కమిషన్ ఎదుట సాక్ష్యమిచ్చిన అధికారులను




కూడా ఆయన బెదిరించారు. దీనికి ప్రతిఫలంగా మోడీ ఆయన్ని జమ్మూకాశ్మీర్‌కు గవర్నరును చేశారు. ఆ తర్వాత కాగ్‌లో నియమించారు.

# అసత్య వార్తలపై చర్యలు తీసుకోండి

## సామాజిక మాధ్యమాలకు కేంద్రం ఆదేశం

- అయితే వాటిని నిర్వచించని ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** అసత్య వార్తలను నిరాకరించాలని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఎక్స్, మేటా, డెయిలీహంట్, షేర్‌ఛాట్, టెలిగ్రామ్ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే అసత్య వార్తలు లేదా తప్పుడు సమాచారం అంటే ఏమిటో మాత్రం నిర్వచించలేదు. తప్పుడు వార్తలకు అడ్డుకట్ట వేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ఆదేశాలు జారీ అయ్యాయని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'బిజినెస్ స్టాండర్డ్' పత్రిక తెలిపింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనల్లో కేంద్రం సవరణలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తప్పుడు లేదా అసత్య లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని తొలగించే అధికారం ఈ సవరణ ద్వారా ప్రభుత్వం నియమించిన నిజ నిర్ధారణ కమిటీకి లభిస్తుంది. అయితే ఈ చర్య అణచివేతకు, నిషేధానికి దారితీస్తుందని మీడియా సంస్థలు, ప్రజాస్వామిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేసింది.

నవంబర్‌లో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరం ఏప్రిల్-మేలో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అడ్డుకునేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ డిజిటల్ వేదికలకు మెమొరాండం పంపిందని బిజినెస్ స్టాండర్డ్ పత్రిక వివరించింది. తాను పంపిన మెమొరాండం మేరకు అసత్య వార్తలు, చట్టవిరుద్ధ సమాచారంపై తీసుకున్న చర్యలను వివరిస్తూ పది రోజులలో నివేదికలు పంపాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది.

యూట్యూబ్ వెబ్‌సైట్‌కు మంత్రిత్వ శాఖ ప్రత్యేకించి ఓ సూచన చేసింది. ధృవీకరించుకోని వార్తకు 'టిక్కర్'ను జోడించాలని చెప్పింది. అసత్య వార్తలను చూపించే ఛానల్స్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ఓ విధానాన్ని రూపొందిస్తానని కూడా ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. మన దేశంలో 46.7 కోట్ల మంది ప్రజలు యూట్యూబ్‌ను చూస్తుంటారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. సామాజిక మాధ్యమాలకు మార్గదర్శ కాలు జారీ చేయాలని గత వారం జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (కమ్యూ నికేషన్, ఐటీ) సమావేశంలో నిర్ణయించారు. తప్పుడు వార్తలకు కళ్లెం వేసేందుకు మరింత బలమైన చట్టం అవసర మని కూడా కమిటీ అభిప్రాయ పడింది. పార్లమెంట్ తదుపరి సమావేశాలలో కమిటీ తన చర్యలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్లు | 59,950 | ▼ | 160 |
| 22 క్యారెట్లు | 54,950 | ▼ | 150 |
| కిలో వెండి | 77,000 | ▼ | 500 |



## చికెన్ ధరలు
### హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

| | |
|---|---|
| ఫారం రేటు | రూ. 119 |
| రిటైల్ (లైవ్) | రూ. 141 |
| స్కిన్‌తో | రూ. 204 |
| స్కిన్‌లెస్ | రూ. 233 |

## బిజినెస్

### దిగ్గజ ప్రయివేటు బ్యాంక్‌లపై ఆర్‌బీఐ కొరడా

- ఐసీఐసీఐ బ్యాంక్, కొటాక్ మహీంద్రాకు జరిమానా
- నిబంధనల అమల్లో విఫలం
- బ్యాంక్ డైరెక్టర్లకు సులభంగా రుణాలు..!




**ముంబయి :** ప్రయివేటు రంగంలోని విత్త సంస్థలు నిబంధ నల అమల్లో విఫలమవుతున్నా యి. ఇటీవల పేటియం పేమెంట్ బ్యాంక్‌కు జరిమానా విధించిన రిజర్వ్ బ్యాంక్..తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్ లపై కొరడా ఝులిపించింది. ఈ రెండు దిగ్గజ ప్రయివేటు విత్త సంస్థలు రెగ్యులేటరీ నిబంధనలు పాటిం చడంలో విఫలం అయినందుకు మంగళవారం భారీ జరిమనా విధించింది. ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.12.19 కోట్లు, కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ.3.95 కోట్లు చొప్పున జరిమానా వేసింది. "బ్యాంకింగ్ నియంత్రణ చట్టం-1949లోని సెక్షన్ 20, సబ్ సెక్షన్ (1), సెక్షన్ 6లోని సబ్ సెక్షన్ (2), సెక్షన్ 8 ప్రకారం రుణాల అడ్వాన్స్‌లు, ఇతర చట్టబద్ధమైన నిబంధనల అమలులో ఐసీఐసీఐ బ్యాంకు విఫలమైంది. బ్యాంకు డైరెక్టర్లలో ఇద్దరికి గల కంపెనీలకు రుణాలు మంజూరు చేయడంలో నిబంధనలను ఉల్లంఘిం చింది." అని ఆర్‌బిఐ వెల్లడించింది. "బ్యాంకులకు ఔట్ సోర్సింగ్ సర్వీసులు అందిస్తున్న సంస్థల ప్రవర్తనా నియామవళి, మార్గదర్శకాలను కోటక్ మహీంద్రా బ్యాంక్ విస్మరించింది.. తమ సర్వీస్ ప్రొవైడర్ పనితీరుపై వార్షిక సమీక్ష నిర్వహించడంలోనూ కోటక్ మహీంద్రా బ్యాంక్ విఫలమైంది. రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకూ కోటక్ మహీంద్రా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సర్వీసులు అందించడంలో విఫలమైంది." అని ఆర్‌బీఐ తెలిపింది. రెగ్యులేటరీ నిబంధనలు పాటించనందుకు మాత్రమే రెండు బ్యాంకులకు జరిమానా విధించామని పేర్కొంది. ఖాతాదారుల లావాదేవీలకు ఈ జరిమానాలతో సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇటీవల పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కేవైసీ నిబంధనలు ఉల్లంఘించడంతో ఆ సంస్థకు రూ.5.39 కోట్ల జరిమానా విధించిన విషయం తెలిసిందే.

### బీఓఎం లాభాల్లో 72 శాతం వృద్ధి




**పూణె :** ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 72 శాతం వృద్ధితో రూ.920 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ నిర్వహణ లాభాలు 31 శాతం పెరిగి రూ.1,920 కోట్లుగా నమోదయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 33 శాతం ఎగిసి రూ.668 కోట్లకు చేరగా.. నికర వడ్డీ ఆదాయం 3.89 శాతం పెరిగింది. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.5,796 కోట్లుగా చోటు చేసుకుంది. స్థూల నిరర్థక ఆస్తులు 2.19 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏలు 0.23 శాతానికి పరిమితమయ్యాయి.

### టీసీఎస్ ఉద్యోగులకు డ్రెస్‌కోడ్..!

**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తమ ఉద్యోగులు ధరించే దుస్తుల విషయంలో పలు సూచనలు చేసిందని సమాచారం. వర్క్ ఫ్రం హోం, హైబ్రిడ్ పని విధానాన్ని రద్దు చేసి.. నవంబర్ 1 నుంచి పూర్తిగా ఆఫీసులకు రావాల్సిందేనని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సిబ్బంది ధరించే దుస్తుల విషయంలో ఆదేశాలు జారీ చేసింది. వేషధారణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఆర్ హెడ్ మిలింద్ లక్కడ్ ఉద్యోగులకు మెయిల్స్ చేశారు. పురుషులు తప్పని సరిగా ఫుల్ షర్టులతో టక్ చేసుకోవాలి. మహిళా ఉద్యోగులు బిజినెస్ ఫార్మల్స్, హాఫ్ స్లీవ్ షర్టులు, టర్టిల్‌నెక్, ఖాకీ చొక్కాలు, చినోలు, కుర్తీ, సల్వార్‌లను ధరించాలని సూచించింది.

### 1000 హార్లే డేవిడ్సన్ ఎక్స్440 విక్రయాల లక్ష్యం

- హీరో మోటో కార్ప్ వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రస్తుత పండగ సీజన్‌లో 1000 హార్లే డెవిడ్సన్ ఎక్స్440 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హీరో మోటో కార్ప్ తెలిపింది. తమ 100 డీలర్‌షిప్‌లలో ఈ వాహన డెలివరీలను అక్టోబర్ 15 నుంచి ప్రారంభించినట్లు తెలిపింది. డెనిమ్, వివిడ్, ఎస్ లాంటి మూడు వేరియంట్లలో లభించే ఈ మోడల్ ధరలను వరుసగా రూ.2,39,500, రూ.2,59,500, రూ.2,79,500గా నిర్ణయించింది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.78,406 కోట్ల ఆదాయం

**న్యూఢిల్లీ :** ప్రయివేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో రూ.16,811 కోట్ల నికర లాభాలు ఆర్జించింది. 2022-23 ఇదే సమయంలో రూ.11,162 కోట్ల లాభాలను నమోదు చేసింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో విలీనమైన తర్వాత విడుదల తొలి ఆర్థిక ఫలితాలు ఇవే. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ ఆదాయం రూ.78,406 కోట్లకు చేరింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.46,181 కోట్ల ఆదాయం చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.23 శాతం నుంచి 1.34 శాతానికి పెరిగాయి.

### ద్విచక్ర ఈవీ రంగంలోకి ఎసర్

**హైదరాబాద్ :** ప్రముఖ ల్యాప్‌ట్యాప్‌ల తయారీదారు ఎసర్ కొత్తగా ద్విచక్ర విద్యుత్ వాహన రంగంలోకి ప్రవేశించింది. భారత్ మార్కెట్లోకి ఈబైక్‌గో స్టార్టప్‌తో కలిసి ఎంయువిఐ125 4జి ఇ-స్కూటర్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.99,999గా నిర్ణయించింది. త్వరలోనే ప్రీబుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు ఎసర్ ఐఎన్‌సి గ్లోబల్ స్ట్రాటజిక్ అలయన్స్ వైస్ ప్రెసిడెంట్ జాడె జో తెలిపారు. పట్టణ వాసులకు తమ ఈ వాహనం చాలా సౌలభ్యంగా ఉంటుందని థింక్ ఇబైక్ గో సిఇఒ ఇర్ఫాన్ ఖాన్ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే!



**జెరూసలేం, గాజా:** ఇజ్రాయిల్ గాజాను దిగ్బంధించడం, పైగా గాజా ప్రాంతం నుండి ప్రజలందరినీ బలవంతంగా ఖాళీ చేయించడం అంతర్జాతీయ చట్ట నిబంధనలకు విరుద్ధమని ఐక్యరాజ్య సమితి మంగళవారం పేర్కొంది. ఇదిలావుండగా, అమెరికా అధ్యక్షుడు బైడెన్ బుధవారం ఇజ్రాయిల్‌లో పర్యటించనున్నారు. ఆత్మ రక్షణ కోసం ఇజ్రాయిల్ చర్యలు తీసుకునే హక్కు వుందని స్పష్టం చేసేందుకు ఆయన ఈ పర్యటన జరపనున్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఆయన చర్చలు జరుపుతారు. ఆ తర్వాత జోర్డాన్ వెళ్లి అరబ్ నేతలతో చర్చలు జరుపుతారు. గాజాకు మానవతా సాయం వేగంగా అందడంపై చర్చిస్తారు. పాలస్తీనియన్ల ఊచకోతను తక్షణమే ఆపాలని ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని డిమాండ్ చేశారు.

గాజాలో పాలస్తీనియన్లపై జరుపుతున్న నేరాలకు ఇజ్రాయిల్ అధికారులు విచారణను ఎదుర్కొనాలన్నారు. గాజాలో అత్యాచారాలను ఇజ్రాయిల్ ఆపకపోతే మరో షాక్‌వేవ్ రావడానికి సిద్ధంగా వుందని ఇరాన్ గార్డ్స్ కమాండర్లు హెచ్చరించారు. గాజాపై పదాతి దాడులకు ఇజ్రాయిల్ సిద్ధమైనట్లైతే ముందస్తు చర్యలు తీసుకోక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దానిపై ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, ఇరాన్, హిజ్బుల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు. "ఉత్తర ప్రాంతంలో మమ్మల్ని పరీక్షించవద్దు, గతంలో చేసిన తప్పునే చేయొద్దు, ఈనాడు మీరు చెల్లించే మూల్యం ఇంకా భారీగా వుంటుంది" అని హెచ్చరించారు.

**2,800కు పెరిగిన పాలస్తీనా మృతులు..**

**మొత్తం మరణాలు 4 వేలు**

గత రాత్రంతా గాజాపై బాంబుల వర్షం కురిపించినట్లు ఇజ్రాయిల్ రక్షణ బలగాలు (ఐడిఎఫ్) తెలిపాయి. 200కి పైగా హమస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ లక్ష్యాలపై దాడి జరిగిందని స్థానిక మీడియా తెలిపింది. 71మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. మంగళవారం కూడా ఈ పరిస్థితి కొనసాగింది. దక్షిణ గాజాలో భారీగా దాడులు జరిగాయని పాలస్తీనియన్లు తెలిపారు. రఫా, ఖాన్ యూనిస్ నగరాల్లో ముమ్మరంగా దాడులు జరిగాయని, మృతుల వివరాలు వెంటనే అందలేదని చెప్పారు. తమవద్ద బందీలుగా వున్న 200మందినీ పరిస్థితులు అనుకూలించినప్పుడు విడుదల చేస్తామని హమస్ సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. గత వారం రోజుల్లో ఇరువైపులా నాలుగు వేల మందికి పైగా మరణిం చారు. వీరిలో పాలస్తీనా వైపు 2800మంది చనిపోయారు. ఇజ్రాయిల్ దూకుడు చర్యలను పలు దేశా లు, ప్రభుత్వాలు, ఎన్‌జిఓలు, ఐక్యరాజ్య సమితి సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. గాజాపై విచక్షణారహిత బాంబు దాడులను తక్షణమే ఆపాలని కోరుతున్నాయి.

గాజాలోకి ప్రవేశించాలన్నా, బయటకు రావాలన్నా మొత్తంగా ఏడు సరిహద్దు క్రాసింగ్‌లు వున్నాయి. 1993లో ఓస్లో ఒప్పందం నేపథ్యంలో ఈ క్రాసింగ్‌లను నిర్మించారు. 2000 నుండి వీటిని ఇజ్రాయిల్ అడపాదడపా మూసేస్తూ వుంది. తాజాగా ఘర్షణలు నెలకొన్న తరుణంలో మొత్తంగా అన్నింటినీ మూసివేసే వుంచింది. అన్నింటినీ తెరిచేది లేదని స్పష్టం చేసింది. రాఫా క్రాసింగ్స్ వద్ద పెద్ద సంఖ్యలో జనాలు వేచివున్నారు. ఎప్పుడు తెరిస్తే అప్పుడు ఈజిప్ట్‌లోకి వెళ్లడానికి సిద్ధంగా వున్నారు. గాజా ప్రజలకు సాయమందించేందుకు ఇజ్రాయిల్ అనుమతిస్తేనే తాము విదేశీయులకు సరిహద్దులు తెరుస్తామని ఈజిప్ట్ షరతు పెట్టింది.

# వన్నె తగ్గిన కాగ్

(మొదటిపేజీ తరువాయి)

వంటి ఎన్నో ఉదంతాలపై కాగ్ మన్మోహన్ ప్రభుత్వ వైఖరిని తూర్పార పట్టింది.

**'బదిలీ' బహుమతి**

అయితే ఇటీవలి కాలంలో కాగ్‌లో ఆ వాడి కన్పించడం లేదు. కాగ్‌ను స్వతంత్ర సంస్థగా పనిచేయించేందుకు కొందరు ఉద్యోగులు ప్రయత్నించగా వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. కొద్ది వారాల క్రితం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రజా ప్రతినిధులకు 12 కాగ్ నివేదికలు అందజేశారు. ఆయా ప్రభుత్వ సంస్థల్లో అవినీతి జరిగిందంటూ వెల్లడించిన ఆడిట్ అధికారులు కొద్ది రోజులకే బదిలీ అయ్యారు.

**అవకతవకలు బయటపెడితే...**

బదిలీ అయిన అధికారుల్లో దత్తప్రసాద్ సూర్యకాంత్ షిర్‌సాత్ ఒకరు. ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పనితీరుపై ఆడిట్ జరిపిన విభాగానికి ఆయన ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 28 రాష్ట్రాల్లోని 161 జిల్లాల్లో ఉన్న 964 ఆస్పత్రుల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. 2.25 లక్షల కేసుల్లో ఆపరేషన్ చేసిన తేదీ కంటే ముందే డిశ్చార్జ్ చేసిన తేదీని నమోదు చేయడాన్ని ఆయన గమనించారు. వీటిలో 1.79 లక్షల కేసులు ఒక్క మహారాష్ట్రలోనే వెలుగు చూశాయి. ఆ రాష్ట్రంలో రూ.300 కోట్లకు పైగా దుర్వినియోగం జరిగింది.

ఈ వ్యవహారాన్ని ఓ వెబ్ పోర్టల్ బయటపెట్టింది. చనిపోయిన వారి పేరిట కూడా లక్షలాది క్లెయిములు వచ్చాయని తెలిపింది. లక్షన్నరకు పైగా నకిలీ లబ్దిదారులు నమోదయ్యారని తనిఖీల్లో కూడా తేలింది. జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆడిట్ చేసిన అతూర్వా సిన్హాకు కూడా బదిలీ బహుమతి లభించింది. ద్వారక ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టులో వ్యయాన్ని ఎక్కువ చేసి చూపారని తనిఖీలో తేలింది. ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కిలోమీటరుకు రూ.18 కోట్లకు అనుమతి ఇవ్వగా దానిని పెంచి రూ.250 ఖర్చయిందని చూపారు. ఈ అంశాలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నించాయి కానీ ప్రభుత్వం తన వైఫల్యాలను అంగీకరించలేదు. ప్రభుత్వాన్ని దోషిగా నిలిపేందుకు మీడియా కూడా ఆసక్తి చూపలేదు.

# ఆ బాధ్యత పార్లమెంటుదే : సుప్రీం


(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అభిప్రాయపడ్డారు. వివాహ బంధంలోకి ప్రవేశించేందుకు లైంగికత ప్రాతిపదికగా ఒక జంటకు గల హక్కును నియంత్రించలేమని ఇరువురు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. లైంగికత ప్రాతిపదికన వివక్ష చూపడమనేది రాజ్యాంగంలోని 15వ అధికరణను ఉల్లంఘించడమే అవుతుందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కాగా, మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు ఎస్.ఆర్.భట్, హిమా కోహ్లి, పి.ఎస్.నరసింహలు ఈ పాయింట్‌తో విభేదించారు. క్రమబద్దీకరణ యంత్రాంగాన్ని రూపొందించాల్సిన బాధ్యత పార్లమెంట్‌దని, న్యాయస్థానానిది కాదని స్పష్టం చేశారు. అయితే1954నాటి ప్రత్యేక వివాహ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనది కాదని ఐదుగురు న్యాయమూర్తులు అంగీకరించారు.

స్వలింగ వివాహాలను మినహాయించ నక్కరలేదని పేర్కొన్నారు. అయి తే, స్వలింగ వివాహాలను ఆ చట్ట పరిధిలోకి తీసుకు రావడానికి ప్రత్యేక వివాహ చట్టాన్ని సవరించాల న్నది సూచించదగ్గ అంశం కాదని స్పష్టం చేశారు.

# గాజాలో మానవతా సంక్షోభం

ప్రపంచ సమకాలీనం



గాజాను ఇజ్రాయిల్ దిగ్బంధించటంతో నేటితో నీరు, విద్యుచ్ఛక్తి అడుగంటుతాయని ఐక్యరాజ్య సమితి అధికారులు హెచ్చరించారు. గత 16 ఏండ్లుగా గాజాను ఇజ్రాయిల్ దిగ్బంధిస్తూనే ఉంది. 23 లక్షల మంది నివసిస్తున్న ఆ చిన్న ప్రాంతంలో జనాభా సాంద్రత చాలా ఎక్కువ. వీరిలో సగంమంది 18 ఏండ్ల లోపువారే. మానవ హననమే లక్ష్యంగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి అమెరికా నాయకత్వంలోని నాటో తదితర సామ్రాజ్యవాద దేశాలు మద్దతిస్తున్నాయి. విద్యుచ్ఛక్తి, నీటికే కాక.. అన్నింటికీ సంక్షోభం ఉందని దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఇయాద్ అబు ముత్లక్ రాయిటర్స్‌కు చెప్పారు. నగరంలోని నాలుగు బేకరీల్లో బ్రెడ్ దొరకలేదని ఆయన అన్నాడు. గాజా నగర ప్రాంతంలో నివసిస్తున్న 11లక్షల మంది పాలస్తీనా వాసులను తక్షణమే తమ ఆవాసాలను విడిచి వెళ్ళాలని ఇజ్రాయిల్ ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో గాజా దక్షిణ ప్రాంతానికి ప్రజలు వేలాదిగా పారిపోతున్నారు.

అమెరికా దాని మిత్ర దేశాల మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇప్పటికే గాజాలోని సగం జనాభా తమతమ ఆవాసాలను విడిచి పారిపోయారు. ఇజ్రాయిలీ బాంబు దాడుల్లో 2800మంది చనిపో యారు. 10000మంది గాయపడ్డారు. గాజా నగ రాన్ని వీడిన వారిలో దాదాపు 6లక్షల మంది మధ్య, దక్షిణ ప్రాంతాలకు చేరుకున్నారు. ఉత్తర గాజాలోని 350 బెడ్స్ గల 23 హాస్పిటల్స్ ను ప్రజలు వదిలి రావలసి వచ్చింది. యుద్ధానికి ముందు గాజా గత 16 సంవత్సరాల నుంచి ఇజ్రాయిలీ దిగ్బంధంలో ఉంది. గాజా ప్రజల్లో 60శాతం అంతర్జాతీయ ఆహార సహాయంతో బ్రతుకుతున్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఇజ్రాయిలీ సైన్యం నిరంతరాయంగా గాజా హాస్పిటల్స్ పైన బాంబుల వర్షం కురిపిస్తోంది. గాజా ఆరోగ్య సిబ్బందిని హత్యలు చేస్తోంది. ఇప్పటివరకు 111 ఆరోగ్య కేంద్రాలు దాడులకు గురయ్యాయి. 60అంబులెన్స్ లు ధ్వంసం అయ్యాయి. 12మంది ఆరోగ్య సంరక్షక సింబంధి హతులయ్యారు.

అమెరికా దాని మిత్ర దేశాలు పైకి ఎన్ని కబుర్లు చెప్పినప్పటికీ ఇజ్రాయిల్ చేస్తున్న నరమేధానికి ఆచరణలో సంపూర్ణ మద్దతునిస్తున్నాయి. పాలస్తీనా ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలో వారి రాజ్యాన్ని ఏర్పాటు చేయటమనే వారి కనీస హక్కును అంతర్జాతీయ సమాజం గుర్తించటమే కాదు వారి రాజ్యాన్ని సృష్టించనంత కాలం పాలస్తీనా కాష్టం ఆరదు.

## జరుగుతున్న యుద్ధాలకు అమెరికా మద్దతు : ఆర్థిక కార్యదర్శి



అమెరికా ప్రయోజనాలను విదేశాలలో కాపాడు కునే కార్యక్రమంలో భాగంగా పాలస్తీనా-ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లలో చెలరేగుతున్న యుద్ధాలకు మద్దతు ఇవ్వగలిగిన ఆర్థిక సామర్థ్యం తమకుందని అమెరికా ఆర్థిక కార్యదర్శి జానెట్ యెల్లెన్ చెప్పారు. ఇజ్రాయిల్ సైనిక అవసరాలను తీర్చి మద్దతునివ్వటం, రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు అన్నిరకాల సహాయ సహ కారాలను అమెరికా అందించగలదని ఆమె బ్రిటీష్ స్కై న్యూస్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. లక్జెం బర్గ్‌లో యూరో గ్రూపు ఫైనాన్స్ మినిస్టర్ల సమావేశం జరగటానికి ముందు ఈ ఇంటర్వ్యూ జరిగింది. విదేశాలలోని మిత్రులకు సహాయం చేయగల ఆర్థిక స్థితి అమెరికాకు ఉంది. అయితే మధ్యప్రాచ్యం లో జరుగుతున్న యుద్ధం విస్తృతమైతే ఇప్పటికే అస్థిరమైన ప్రపంచ చమురు, గ్యాస్ మార్కెట్ వల్ల గత సంవత్సర కాలంగా అనేక పశ్చిమ దేశాలలో ఏర్పడిన జీవన వ్యయ సంక్షోభం మరింతగా తీవ్రతరం అవుతుందని ఆమె అన్నారు. విదేశాలకు అమెరికా సహాయం అందాలంటే రిపబ్లికన్లు ప్రతినిధుల సభకు స్పీకర్‌ను నియమించేందుకు ప్రయత్నించాలని కూడా చెప్పారు.

ఈ నెల మొదట్లో అమెరికా ప్రతినిధుల సభకు స్పీకర్ గావున్న క్యాలిఫోర్నియా రిపబ్లికన్ కెవిన్ మెకార్థీ ని పదవి నుంచి తొలగించారు. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రతినిధుల సభ స్పీకర్ మెకార్థీ కుమ్మక్కై, ఉక్రెయిన్‌కు అతి వ్యయంతో కూడిన సహాయాన్ని కొనసాగించేందుకు తోడ్పడ్డాడని రిపబ్లికన్ పార్టీకే చెందిన ఫ్లోరిడా ప్రతినిధి మట్ గెయిట్జ్ ప్రతిపాదిం చిన అవిశ్వాస ఓటుతో మెకార్థీ పదవీచ్యుతుడయ్యారు. దాంతో అమెరికా రాజధాని వాసింగ్టన్ డీసీలో చట్టపరమైన ప్రతిష్ఠంభన ఏర్పడింది.

## న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడులు పెట్టలేదు !

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతీసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ పత్రికకు అందచేసినవి, వారు పట్టించుకోని అంశాలను ఈ లేఖలో వెల్లడించానన్నారు. న్యూస్‌క్లిక్‌లో తాను పెట్టుబడులు పెట్టలేదని ఆయన స్పష్టం చేశారు. అలాగే చైనా నుండి, చైనా కమ్యూనిస్టు పార్టీ నుండి సహా ఏ దేశం లేదా రాజకీయ పార్టీల నుండి తనకెలాంటి నిధులు రాలేదని చెప్పారు. ఆ మేరకు వచ్చిన ఆరోపణలను ఖండించారు. తన కంపెనీని విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాలు, తన వ్యక్తిగత పొదుపు మొత్తాలు, తాను సంపాదించింది తప్ప అదనంగా బయట నుండి వచ్చిన నిధులేవీ లేవన్నారు. ప్రతి ఏటా పన్నులు కూడా సక్రమంగా కడతానని కాబట్టి తన డబ్బుపై సందేహాలు అనవస రమని స్పష్టం చేశారు. చైనా టెలికం కంపెనీలతో తనను ముడిపెట్టడాన్ని ఆయన తీవ్రంగా పరిగణిం చారు. ఎఫ్‌ఐఆర్‌లో అదిచూసి తాను దిగ్భ్రాంతి చెందానన్నారు. పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా వాటితో తనకెలాంటి సంబంధం లేదన్నారు. చైనా ప్రభుత్వం లోని, చైనా కమ్యూనిస్టు పార్టీలోని ఏ విభాగంతో ఎలాంటి సంబంధాలు లేవన్నారు. వారి నుండి నిధులు గానీ, ఆదేశాలు గానీ తనకు రాలేదని, వారి కోసం ఎప్పుడూ పనిచేయలేదన్నారు. అక్రమ రీతుల్లో నిధులను పంపించడం గాదనీ, ఏ చట్టాలను అతి క్రమించడం గానీ జరగలేదన్నారు. తన వద్ద వున్న డబ్బును జయప్రదంగా అవసరమైన వారందరికీ విరాళాలుగా ఇవ్వాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఆ లక్ష్య సాధనలో తాను ఏ నియమ నిబంధనలనూ అతిక్రమించలేదన్నారు. ప్రపంచంలో దారిద్ర్యాన్ని సమూలంగా శాశ్వతంగా నిర్మూలించేందుకు అంకితమైన ప్రాజెక్టులకు సాయపడాడలన్నది తన కీలక లక్ష్యమన్నారు. భారత్ సమగ్రతను దెబ్బతీసేలా ఓపెన్స్ సోర్స్ మ్యాప్ ప్రాజెక్టును రూపొందించారని ఎఫ్‌ఐఆర్‌లో ఆరోపించారని, కానీ భారతదేశ ప్రాదేశిక సమగ్రతకు విఘాతం కలిగించాల్సిన అవసరం కూడా తనకు లేదన్నారు.

## క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేసింది. చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం. త్రివేదీలతో కూడిన ధర్మాసనం ఎదుట మంగళవారం వాదనలు ముగిశాయి. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. "ఈ కేసులో 17ఏ సెక్షన్ వర్తించదు. పాత నేరాలకు సంబంధించి ఈ సెక్షన్ వర్తించదు. 17ఏ సెక్షన్ అధికారిక నిర్ణయాల సిఫారసులకు మాత్ర మే వర్తిస్తుంది. ఈ సెక్షన్ అవినీతిపరులకు రక్షణ ఛత్రం కాకూడదు. ప్రజా ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునేవాళ్ల ఇబ్బందిపడకూడదనే ఈ చట్టం తీసుకొచ్చారు. ఈ కేసులో ఆరోపణలన్నీ ప్రత్యేక కోర్టు ద్వారా విచారించదగినవే" అని రోహత్గీ వాదించారు. 17ఏ వర్తించదని చంద్రబాబు తరఫు న్యాయవాది హరీష్ సాల్వే వాదించారు. చంద్రబాబు తరఫు మరో న్యాయవాది సిద్ధార్థ లూత్రా జోక్యం చేసుకుని మధ్యంతర బెయిల్ కోరారు. దీనికి జస్టిస్ అనిరుద్ధబోస్ జోక్యం చేసుకుని తాము ప్రధాన విషయం విన్నామని, తాము తీర్పునే వెలువరిస్తామని అన్నారు. మధ్యంతర బెయిల్ ఇవ్వలేదు.

ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. కోర్టు విచారణ జరిగే వరకు అరెస్టు చేయవద్దన్న అభ్యర్థనను పొడిగించాలని చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా కోరారు. దీంతో అప్పటి వరకు అరెస్టు చేయవద్దన్న అభ్యర్థనను అంగీకరించాలని సుప్రీంకోర్టు సూచించింది.

## సహకరించండి: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విజ్ఞప్తి



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

శాసనసభ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయపార్టీలు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయపార్టీలు సోషల్ మీడియా సహా ఏ రూపంలో సాక్ష్యాలతో ఫిర్యాదు చేసినా, సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా న్యాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంగళవారంనాడిక్కడి ఎన్నికల కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. సీపీఎం ప్రతినిధులుగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జే బాబురావు హాజరయ్యారు. సీపీఐ, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఆప్ సహా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సీఈసీ అదనపు ఈసీఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సిఈఓ సత్యవాణి రాజకీయపార్టీల ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. అక్టోబర్ 30 వరకు కొత్త ఓటర్ల నమోదు కొనసాగుతుందనీ, ఈ ఏడాది జనవరి 5 నుంచి ఇప్పటి వరకు 27.5 లక్షల ఓటరు కార్డులు ముద్రించి ఓటర్లకు అందించామని అధికారులు తెలిపారు. ఈ-ఎపిక్ కార్డులను ఓటర్ల సేవా పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా రాజకీయపార్టీలు అనుసరించాల్సిన విధివిధానాలు, నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, స్టార్ క్యాంపెయినర్లు, మ్యానిఫెస్టోలు, నామినేషన్లు, అఫిడవిట్లు, ప్రకటనల ముందస్తు ధృవీకరణ నియమ నిబంధనలు, సోషల్ మీడియా వినియోగం వంటి పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రతినిధులు పలు అంశాలను ఎన్నికల కమిషన్ ఎదుట ప్రస్తావించారు. రానున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటర్లే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడం చూసామనీ, అలాటి చర్యల్ని ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల రోజు తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో తెలుసుకోవడం ఓటర్లకు ఇబ్బందిగా మారుతున్నదనీ, పోలింగ్‌కు ముందే ఎన్నికల సిబ్బంది ఓటర్ స్లిప్పుల్ని అందచేస్తే బాగుంటుందని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లపై ఎఫ్‌ఐఆర్‌లు ఉంటే అనుమతించట్లేదనీ, ఇది సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అలాంటి నిబంధనలు ఏవీ ఎన్నికల కమిషన్ విధించలేదని అధికారులు తెలిపారు. పోలింగ్‌కు ముందురోజు లోపు ఇంటింటికీ పోల్ స్లిప్పులు పంచుతారని చెప్పారు. ఎస్‌ఎమ్‌ఎస్ రూపంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలు పంపితే బాగుంటుందని బీజేపీ ప్రతినిధులు సూచించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని అధికారులు అన్నారు. నామినేషన్ల సమయం నుంచే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును లెక్కిస్తామనీ, అంతకు ముందు పెట్టే ఖర్చును పార్టీల ఖర్చుగా పరిగణిస్తామని వివరణ ఇచ్చారు. బోగస్ ఓట్లపై ఇప్పుడేం చేయలేమనీ, అలాంటి వివరాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులను సీ-విజిట్ వెబ్‌సైట్ ద్వారా, 1050 ఫోన్ నెంబర్ ద్వారా చేయవచ్చని తెలిపారు.

**71 కోట్లు స్వాధీనం**


అక్టోబర్ 9 నుంచి 17వ తేదీ వరకు మొత్తం రూ.71 కోట్ల 55 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే 52.091 లీటర్ల మద్యం, 1,280 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. 560 కిలోల గంజాయి, రూ.40.08 కోట్ల విలువైన బంగారం, వెండి, వజ్రాలు స్వాధీనం చేసుకున్నారు.

## సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణా సచివాలయంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణా సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ పండగకు సచివాలయంలోని ఉన్నతాధి కారుల నుంచి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులతో ఒక చోట ఉంచి ఆటపాటలతో సంబరాలు చేసారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





గాంధీ భవన్‌లో బతుకమ్మ వేడుకలు...

## రెగ్యులర్ బిల్లులతో పాటు వేతన బిల్లులు తీసుకోవాలి

- డీటీఏకు తపస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖలో ఈనెలలో జరిగిన బదిలీలతో స్థానచలనం పొందిన ఉపాధ్యాయుల వేతన బిల్లులు రెగ్యులర్ బిల్లులతోపాటు సమర్పించేందుకు ఈనెలాఖరు వరకు అనుమతించాలని తపస్ కోరింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ రామచంద్రమూర్తిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. వేతన బిల్లులు రెగ్యులర్ బిల్లులతోపాటు ఈనెలాఖరు వరకు తీసుకునేందుకు అంగీకరిస్తామంటూ ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. 317 జీవో మాదిరిగా పూర్వ, ప్రస్తుత పాఠశాలల వేతన బిల్లులు కూడా రెండు ఒకేసారి అనుమతించేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చాలని కోరితే పరిశీలిస్తామన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని బల్లేపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున లేలాండ్ ట్రక్కు బోల్తా పడిన సంఘటనలో అన్నదమ్ములు మృతి చెందారు. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజు గంజి జిల్లా కర్మహా గ్రామం నుంచి ఆరేండ్ల కిందట ఖమ్మంకు వలస వచ్చిన అన్నదమ్ములు హిరాలాల్, జయరావు.. నగరంలో గ్లాస్ ఫిట్టింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, పనుల నిమిత్తం భద్రాద్రి జిల్లా మణుగూరు వెళ్లి సోమవారం రాత్రి లేలాండ్ వాహనం ఎక్కి ఖమ్మం తిరిగి వస్తుండగా.. బల్లేపల్లి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్ర మత్తుతో డ్రైవింగ్ చేయడంతో వాహనం బోల్తా పడింది. దాంతో ట్రక్కులో ఉన్న ఇద్దరు అన్నదమ్ములు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను అన్నం సేవా ఫౌండేషన్ సహకారంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## నవంబరు 15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

**అమరావతి :** నవంబరు 15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ విజయవాడలో జరగనుందని, ఈ సభకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబరు 7న జరగాల్సిన బహిరంగ సభ అనివార్య కారణాల వల్ల నవంబరు 15కు వాయిదా పడిందని పేర్కొన్నారు. అక్టోబరు 3వ వారంలో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన మూడు జాతాలు షెడ్యూలు మారిందనీ, అక్టోబరు 30న గిరిజన ప్రాంతాలను కలుపుతూ బయలుదేరే జాతా సీతంపేటలో ప్రారంభమవుతుందని తెలిపారు.

## భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

- నాగోల్‌లో ఘటన

నవతెలంగాణ-నాగోల్

ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా కత్తి పొడిచి హత్య చేసి అనంతరం తానూ భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని నాగోల్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రాజు(40)కు కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన సంతోషి(36)తో 15 ఏండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇంటర్ మొదటి సంవత్సరం చదివే కూతురు, 9వ తరగతి చదివే కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం నాగోల్ డివిజన్‌లోని సాయి నగర్‌లో నివాసముంటున్నారు. కాగా, రాజు, సంతోషి మధ్య మనస్పర్ధలు చోటుచేసుకోవడంతో తరచు గొడవలు జరుగుతుండేవి. ఇదిలా ఉండగా సోమవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని తపోవన్ కాలనీలో రాజు చెల్లెలు మంజుల ఇంటికి రాజు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అనంతరం రాజు, సంతోషి వారి పిల్లలను అక్కడే ఉంచి ఇంటికి తిరిగి వచ్చారు. ఈక్రమంలో వారి మధ్య మళ్లీ గొడవ జరిగింది. దాంతో ఆవేశానికి గురైన రాజు తన భార్య మెడను కత్తితో కోసి ఆపై రోకలి బండను తీసుకొని కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం అదే రోజూ రాత్రి రాజు తన చెల్లెలు ఇంటికి చేరుకోగా అక్కడ అందరూ నిద్రలో ఉన్నారు. దాంతో అతను భవనం పై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న రాజు చెల్లెలు తన వదిన సంతోషికి ఫోన్ చేయగా ఎవరూ లిఫ్ట్ చేయలేదు. దాంతో రాజు బంధువులు సాయినగర్‌కు వెళ్లి తాళం పగలగొట్టి చూడగా సంతోషి రక్తం మడుగులో శవమై కనిపించింది. దాంతో వారు నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించిన పోలీసులు.. అనంతరం శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే రాజు ఆత్మ హత్యకు సంబంధించి సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు

- నలుగురు నిందితుల అరెస్టు
- రూ.3.5కోట్ల విలువగల 1000కిలో గంజాయి పట్టివేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల కండ్లుగప్పి గంజాయిని సరఫరా చేస్తున్న ముఠా గుట్టును యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, బొల్లారం పోలీసులు మంగళవారం రట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ.3.5కోట్ల విలువగల 1000కిలోల గంజాయి, డీసీఎం, కార్‌తోపాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో వెస్ట్‌జోన్ ఎస్పీ డీ.సునితారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నాటకలోని బీదర్‌కు చెందిన సకారం రాథోడ్, హమీద్‌ఖాన్, దిగంబర్ రాము పవార్, మహారాష్ట్రకు చెందిన అజయ్ రామావతార్ చౌరాసియా.. ఒక ముఠాగా ఏర్పాడ్డారు. ఐదో తరగతి వరకు చదువుకున్న సకారం రాథోడ్ ఉపాధి కోసమని 2002లో హైదరాబాద్‌కు వచ్చి షేక్‌పేట్‌లో పానీపూరీ బండీ నడిపించాడు. అందులో నష్టాలు రావడంతో తిరిగి సొంతూరికి వెళ్లిన నిందితుడు స్థానికంగా ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి లేబర్‌ను పంపించడం ప్రారంభించాడు. అయితే వారు గంజాయికి బానిసలయ్యారని గుర్తించిన నిందితుడు తానుకూడా గంజాయి సఫరా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఒడిశా నుంచి గంజాయి సేకరించి అధిక ధరకు బీదర్, మహారాష్ట్ర, ముంబాయ్‌లో విక్రయించడం ప్రారంభించాడు. తన స్నేహితులైన కాశీరాం, లక్ష్మణ్, రవి సహాయంతో పెద్దఎత్తున గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో సకారం రాథోడ్ పలుసార్లు పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. నిందితుడిపై సంగారెడ్డి, హైదరాబాద్, పటాన్‌చెరు, వరంగల్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి. అయితే ఎన్నిసార్లు జైలుకెళ్లొచ్చినా నిందితుడిలో మార్పురాలేదు. జైల్లో పరిచయమైన హమీద్‌ఖాన్, దిగంబర్ రాము పవార్, అజయ్ రామావతార్ చౌరాసియాలతో ఒక ముఠాగా ఏర్పడ్డాడు. జైలు నుంచి బయటకు రాగానే తిరిగి గంజాయిని సరఫరా చేస్తున్నాడు. తాజాగా బొల్లారం మీదుగా ఓ డీసీఎంలో గంజాయిని తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న యాంటీ నార్కోటెక్ బ్యూరో అప్రమత్తమైంది. బొల్లారం పోలీసులతో కలిసి ముఠాను అరెస్టు చేశారు. సమావేశంలో డీఎస్పీ కే.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్లు పీ.రాజేష్, జీ.గోపాల్, బీ.విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు సీ.వెంకటేష్‌తోపాటు బొల్లారం పోలీసులు పాల్గొన్నారు.

## ఈటలది దుర్మార్గాపు ఆలోచన

- ఎనిమిదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించావ్..
- సీఎం కేసీఆర్ బొమ్మతోనే ఇన్నాళ్లూ గెలిచావ్..
- ఇప్పుడు ఏ బొమ్మ పెట్టుకుని గెలుస్తావో చూస్తా : హుజూరాబాద్ ఎమ్మెల్యేపై మంత్రి గంగుల కమలాకర్ ఫైర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'2018 ఎన్నికల్లో తనను ఓడించేందుకు కుట్రలు పన్నారని ఈటల రాజేందర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఆయన ఎనిమిదేండ్లు కేసీఆర్ పక్కనే మంత్రి పదవులు అనుభవించారు. కేసీఆర్ బొమ్మతోనే ఇన్నాళ్లూ 50-60వేల ఓట్ల తేడాతో గెలుస్తూ వచ్చారు.

మొన్న కాంగ్రెస్‌తో కుమ్మక్కై స్వల్ప ఓట్లతోనే గట్టెక్కారు. ఈ ఎన్నికల్లో ఎవరి బొమ్మ పెట్టుకుని ఎలా గెలుస్తారో చూద్దాం' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై మంత్రి గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చే బీఫామ్‌లు తమకు భగవద్గీతతో సమానమని, ఆయన బీ ఫామ్ ఇచ్చి ఎందుకు ఓడగొట్టాలని చూస్తారని ప్రశ్నించారు. ఈటల మంత్రిగా ఉన్నప్పుడే రైతుబంధును హుజూరాబాద్‌లోనే ప్రారంభిం చారని గుర్తు చేశారు. దళితబంధు కూడా ఆ నియోజకవర్గం నుంచే ప్రారంభించారని చెప్పారు. ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం ప్రభుత్వం సంక్షేమం రూపంలో అందిస్తూ వస్తోందన్నారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి ఇలా అనేక సంక్షేమాలు ఎన్నికలతో సంబంధం లేకుండా అందిస్తున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోలేరా అని ప్రశ్నించారు. హుజూరాబాద్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌ను తీసుకొచ్చి నిర్వహించిన సభలో ఎవరూ లేరని ఆరోపించారు. ఇన్నాళ్లూ కేసీఆర్ బొమ్మ పెట్టుకుని గెలిచిన ఈటల రాజేందర్ ఇప్పుడు ఎలా గెలుస్తారో చూద్దామని అన్నారు. కేసీఆర్‌ను తిడితే ప్రజలు ఓట్లు వేయరని, ఆయన ప్రజల ఆస్తి అని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు.

## తనకు వందలాది మంది గజ్వేల్ నేతల సహకారం

- వారిని హరీశ్‌రావు బెదిరిస్తున్నాడు : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గజ్వేల్‌లో తాను పోటీచేయబోతున్నాననీ, ఆ నియోజకవర్గంలోని వందలాది మంది నేతలు తనకు సహకరించేందుకు నిర్ణయం తీసుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చెప్పారు. అక్కడ కేసీఆర్ ఓడిపోతాడేమోన్న భయం బీఆర్ఎస్‌లో మొదలైందన్నారు. తనకు సహకరిస్తారన్న అనుమానంతో గజ్వేల్ నేతలను హరీశ్‌రావు ఫోన్లు చేసి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. గజ్వేల్లో పేదల భూములు గుంజుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇస్తున్న దుర్మార్గపు వ్యవస్థ నడుస్తున్నదని ఆరోపించారు. గజ్వేల్‌లో పెద్దగా అభివృద్ధి జరగలేదన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాయంలో నల్లగొండ నాగార్జున సాగర్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు, తెలంగాణ వాదులు రంజిత్ యాదవ్, పాశం గోపాల్‌రెడ్డి, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మెన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చల్లా శ్రీలతారెడ్డి, యడవల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఓరుగంటి కిట్టు ఆపార్టీలో చేరారు. ఈటలతో కలిసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ..బీజేపీలో చాలామంది చేరుతున్నా మీడియా సరిగా చూపించడం లేదన్నారు. ప్రజాక్షేత్రమే తమకు సరైన వేదిక అని చెప్పారు. పోలీసుల పహారామధ్య ఎమ్మెల్యే అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు.

## పీఈసెట్ తుదివిడతలో 527 మందికి సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుత విద్యాసంవత్సరం (2023-24)లో రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) తుది విడత కౌన్సెలింగ్‌లో 527 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు పీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీపీఈడీ, బీపీఈడీలో మొత్తం 1,331 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటివిడతలో డీపీఈడీలో 155 మంది, బీపీఈడీలో 630 మంది కలిపి మొత్తం 785 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. వారిలో 488 మంది అభ్యర్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారని వివరించారు. తుదివిడతలో బీపీఈడీలో 334 మంది, డీపీఈడీలో 193 మంది కలిపి మొత్తం 527 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు కేటాయించిన వారు ఈనెల 21 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.




## ఏఐపీఎన్‌బీఓఏ రక్తదాన శిబిరం

**హైదరాబాద్ :** ఆల్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐపీఎన్‌బీఓఏ) డైమాండ్ జూబ్లీ హియర్ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని జోనల్ ఆఫీసులో హైదరాబాద్, సికింద్రాబాద్ సర్కిళ్లలోని ఏఐపీఎన్‌బీఓఏ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవా, ఓజీఎస్ ఎం శివ మోహన్, ఎజీఎస్ జి వెంకన్న తదితరులు పాల్గొని రక్తదాతలను ప్రశంసించారు.

# ఉద్యోగాల భర్తీపై బహిరంగ చర్చకు సిద్ధమా?

### 21న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు రండి : మంత్రి కేటీఆర్‌కు కోదండరామ్ సవాల్

- ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
- కేటీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారహితం
- ఆమె కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- టీఎస్‌పీఎస్సీ పాలకమండలిని రద్దు చేశాకే నియామకాలు చేపట్టాలి : నిరుద్యోగ జేఏసీ సమావేశంలో వక్తల డిమాండ్
- ప్రెస్‌క్లబ్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**కేటీఆర్ క్షమాపణ చెప్పాలి**

ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి డాలీశర్మ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షలను వాయిదా వేయడం వల్లే ప్రవళిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. దానిపై బీఆర్ఎస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నదని అన్నారు. ఆమె వ్యక్తిగత జీవితం గురించి కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిజాలు తెలుసుకోకుండా గ్రూప్స్‌కు దరఖాస్తు చేయలేదంటూ ఎలా మాట్లాడతారని ప్రశ్నిం చారు. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డాలీ శర్మ, ఏఐసీసీ అధికార ప్రతినిధి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రాష్ట్రంలో 2.24 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని మంత్రి కేటీఆర్ అంటున్నారు. నిజంగానే అన్ని ఉద్యోగాలు భర్తీ చేశారా?. మహా అయితే లక్ష ఉద్యోగాలు ఇచ్చి ఉండొచ్చు. 2.24 లక్షల ఉద్యోగాలను ఏ శాఖలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో పూర్తి వివరాలను ప్రకటించాలి. ఈనెల 21న సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌కు వచ్చి రుజువు చేయాలి. ఉద్యోగాల భర్తీపై బహిరంగ చర్చకు సిద్ధమా?. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డిని పిలవాలి. మేం మేధావులు, ప్రజాసంఘాల నాయకులను పిలుస్తాం. అన్నింటిపై చర్చిద్దాం'అంటూ మంత్రి కేటీఆర్‌కు టీజేఎస్ అధినేత కోదండరామ్ సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం, టీఎస్‌పీఎస్సీ వైఫల్యం వల్ల ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక మృతి పట్ల ప్రభుత్వం, పోలీసుల అసత్య ఆరోపణలను ఖండిస్తూ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అక్కడ పోలీసులు భారీగా మోహరించడం గమనార్హం. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రవళిక మీద పోలీసులు, మంత్రి కేటీఆర్ ప్రకటనలతో ఆమెను రెండోసారి హత్య చేశారని విమర్శించారు. ఆమె వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. తల్లిదండ్రులు కష్టం చేసి, అప్పులు చేసి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో చదివిస్తారని చెప్పారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్‌లో కోచింగ్‌కు పంపిస్తారని అన్నారు. ఎన్నో కలలు, ఆశలతో నిరుద్యోగ యువకులు హైదరాబాద్‌కు వస్తారని వివరించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ప్రశ్నాపత్రం లీకేజీతో మొదటిసారి, బయోమెట్రిక్ హాజరు చేపట్టకపోవడం, ఓఎంఆర్‌లో అభ్యర్థుల వివరాల్లేకపోవడంతో హైకోర్టు రెండోసారి గ్రూప్-1ను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికల నేపథ్యంలో గ్రూప్-2, డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడ్డాయని వివరించారు. దీంతో ఉద్యోగాలు రావనే నైరాశ్యంలో నిరుద్యోగులున్నారని చెప్పారు. ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ప్రవళిక నష్టజాతకురాలినంటూ అనుకుంద న్నారు. ఉద్యోగాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. ప్రభుత్వ ంపై ఒత్తిడి పెంచి ఉద్యోగాలు సాధించుకోవాల్సిన బాధ్యత నిరుద్యో గులపై ఉందన్నారు. అంతేకానీ ఆత్మహత్యలు చేసుకో వద్దనీ, ధైర్యంగా పోరాడి ఉద్యోగాలు సాధించు కోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రెస్‌మీట్ పెడితే ఇంత మంది పోలీసులు మోహరించడం సరైంది కాదన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రగతి భవన్ కాదనీ, ప్రెస్‌క్లబ్ అని చెప్పారు. ఉద్యోగాల భర్తీపై మంత్రి కేటీఆర్ చెప్పిన లెక్కలన్నీ అబద్ధాలేనని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పాలకమండలిని రద్దు చేసి కొత్త బోర్డు ఏర్పాటు చేయాలన్న దానిపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెన్షన్, రైతుబంధు, గ్యాస్ ధర తగ్గింపు తప్ప ఎక్కడా ఉద్యోగాలపై ప్రస్తావన లేదని విమర్శించారు. ఈనెల 21న మేధావులు, వర్సిటీల ప్రొఫెసర్లు కలిసి ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల లెక్క తేల్చుతామన్నారు.

### ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : వక్తలు

టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్, సీనియర్ జర్నలిస్ట్ విఠల్, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ఓయూ విద్యార్థి నేత బాలలక్ష్మి, మహిళా జేఏసీ నేతలు సజయ, కృష్ణకుమారి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ధనలక్ష్మి, వ్యవస్థాపకులు భూమన్న, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్ మాట్లాడుతూ ప్రవళిక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలనీ, రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని కోరారు. మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ పాలక మండలిని రద్దు చేసి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బోర్డు వచ్చాకే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలనీ, రాతపరీక్షలను నిర్వహించాలని కోరారు. మద్యం కుంభకోణంలో కల్వకుంట్ల కవితను కాపాడ్డంలో ఉన్న శ్రద్ధ ఉద్యోగాల కల్పన, ప్రవళికను కాపాడ్డంలో ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తిరిగి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నదని చెప్పారు.

# బీఆర్ఎస్‌కు షాక్

### కాంగ్రెస్ గూటికి గ్రేటర్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు,

- నల్లగొండలో కౌన్సిలర్లు, నాయకులు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి / విలేకరులు

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఫ్లోర్ లీడర్లు మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేశారు. జీహెచ్‌ఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన సతీమణి హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ వారి అనుచరులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే జగదీశ్వర్‌గౌడ్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. కానీ బీఆర్ఎస్ అధినేత సిట్టింగ్‌లకే టికెట్ కేటాయించడంతో శేరిలింగంపల్లి టికెట్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీకే దక్కింది. బీ ఫాం కూడా ఇవ్వడంతో తనకు టికెట్ రాదని భావించిన జగదీశ్వర్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి శేరిలింగంపల్లి టికెట్ జగదీశ్వర్‌గౌడ్‌కు ఇవ్వనున్నట్టు సమాచారం. తాజాగా జగదీశ్వర్‌గౌడ్ దంపతులు కాంగ్రెస్‌లో చేరడంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం చేకూరిందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నల్లగొండ పట్టణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కంచర్లభూపాల్‌రెడ్డి తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని అసహనంతో కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, ప్రదీప్‌నాయక్, జేరిపోతుల అశ్విని భాస్కర్‌గౌడ్, పబ్బు సాయిశ్రీ సందీప్, రాష్ట్ర హౌస్ కమిటీ సభ్యులు అజీజుద్దీన్ బషీర్, అలాగే మరో ఎంపీటీసీ, సర్పంచ్ హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు.

# బహుజనుల బతుకులకు భరోసా..

### ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్

- బీఎస్పీ మ్యానిఫెస్టో-2023 విడుదల
- ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్
- ప్రజా ఆరోగ్యానికి రూ.25వేల కోట్ల పడ్జెట్
- రైతు ఇంటివద్దకే ఉచిత విత్తనాలు, ఎరువులు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బహుజన బతుకులకు భరోసా కల్పిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఎస్పీ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ప్రణాళికలో పొందుపరిచిన పది ప్రధాన హామీలను వెల్లడించారు. శ్రీకాంతాచారి ఉద్యోగహామీ ద్వారా ప్రతి ఏడాది టీఎస్‌పీఎస్సీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పేపర్ లీకేజీ లేకుండా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. లిక్కర్ అమ్మకాలను నియంత్రిస్తామనీ, ఏటా రూ.25వేలకోట్లతో ప్రజా ఆరోగ్య బడ్జెట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డ్రగ్స్ అమ్మకాలను అరికడుతామనీ, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 60 శాతం బీసీ,ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తామని తెలిపారు. మెదక్ జిల్లాకు ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరు పెట్టి, ఆయన స్మారకార్థం గద్దర్ ఫ్రీడమ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ప్రతి జిల్లాలో అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ బిజినెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. యువ వ్యాపారస్తులకు వడ్డీ లేని రుణాలు, రాయితీలు కల్పిస్తామన్నారు. పూర్ణ-ఆనంద్ క్రీడా స్పూర్తితో ప్రతి జిల్లాలో అంతర్జాతీయ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రతి నెల రూ.15వేల ఉపకార వేతనం, క్రీడా పరికరాలు పోషకాహారాన్ని అందజేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కట్టిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయని విమర్శించారు. కాంట్రాక్టు ఆశా, అంగన్ వాడీ, పారిశుద్ధ్య కార్మికులను, ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్నారు. సీనియర్ సిటీజన్స్ కోసం ప్రత్యేక విధానాలు రూపొందిస్తామని చెప్పారు. చాకలి ఐలమ్మ డిగ్నిటీ పథకంతో శ్రామిక మహిళల ప్రజా రవాణాపై 50శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. ప్రతి రైతుకు గ్రీన్ కార్డు అందజేస్తామన్నారు. రైతుకు ఎకరానికి రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. రైతు ఇంటి వద్దకు ఉచిత విత్తనాలు, ఎరువులు అందజేస్తామన్నారు. ప్రతి మండలానికి కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జనాభాలో 99 శాతం ఉన్న పేద వర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్నదే బీఎస్పీ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక చిత్రపటానికి నివాళులర్పించారు.

సంపాదకీయం

# కాక పుట్టించిన కాగ్

నా ఖావుంగా... నా ఖానేదూంగా! అధికారంలోకి రాక ముందు మన మోడీ డైలాగిది. ఇప్పుడు మచ్చలు, మరకలు కాదు, తారు డబ్బాలో ముంచి లేపినట్లుంది మోడీ సర్కారు పద్ధతి. తమది అవినీతి మచ్చ అంటని ప్రభుత్వమని ప్రచారం చేసుకోవడంలో మోడీకి మించిన వారు లేరు. అందుకే ఇప్పుడు కాగ్ అధికారులు తన పాలనలోని అవినీతి బతుకులను బయటపెట్టారనే కడుపుమంట ఆపుకోలేకపోతున్నాడు. స్వచ్ఛత ముసుగులో వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల భాగోతాన్ని కాగ్ అధికారులు వెలికితీశారు. ఆ లెక్కలను ప్రజల ముందు పెట్టారు. అది భరించలేక అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారు. వారిపై బదిలీ వేటు వేశారు.

ద్వారక ఎక్స్‌ప్రెస్ వే, భారత్ మాల, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల్లో దాదాపు రూ.3,600 కోట్ల అవినీతి జరిగింది. వీటిని లెక్కలతో సహా తేల్చిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విభాగంలోని

ప్రస్తుతం కాగ్ అధిపతి గిరిశ్ చంద్ర ముర్ము గుజరాత్‌కు చెందిన ఉన్నతాధికారి. ఆయన మోడీకి, అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు. అందుకే ఆయన్ని మాత్రం భద్రంగా కాపాడుకుంటున్నారు. ఆయన కింద పనిచేసి లోసుగులు ఎత్తి చూపిన అధికారులను మాత్రం బదిలీ చేశారు. ఎందుకంటే తమది మచ్చలేని పాలన అనే భ్రమలో ప్రజలు ఉంటేనే తన కూర్చీని కాపాడుకోవడం సాధ్యమని మన ప్రధానికి బాగా తెలుసు. దీని కోసం మరో పూల్వామాను సృష్టించినా ఆశ్చర్య పోవాల్సిన పని లేదు.

అధికారులపై మోడీ సర్కారు పగ బట్టింది. ఈ మూడు పథకాలతోపాటు కేంద్రం చేపట్టిన అనేక మౌలిక వసతుల పథకాల్లో అంచనాలను అమాంతం పెంచి ఎలా దోచుకొన్నారో కాగ్ నివేదికను రూపొందించింది. దాన్ని గత పార్లమెంటు సమావేశాల్లో సమర్పించింది. దీంతో మోడీ సర్కారు బండారం దేశానికి తెలిసిపోయింది. దాంతో ఈ రిపోర్టును తయారుచేసిన అపూర్వ సిన్హా, దత్తప్రసాద్ సూర్యకాంత్ శిర్సత్, అశోక్ సిన్హా అనే సీనియర్ అధికారులను గుట్టు చప్పుడు కాకుండా బదిలీ చేసేశారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిజాలు బయటపెట్టిన అధికారులపై కేంద్రం బెదిరింపులకు దిగుతుందని మండిపడ్డాయి. బదిలీ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అక్రమాలపై దర్యాప్తు జరిపిం చాలని కోరాయి. ఇవేవీ పట్టని కేంద్రం చిత్తశుద్ధితో పనిచేసే అధికారులను బదిలీ పేరుతో తలోమూల విసిరేసి తన కడుపు మంట చల్లార్చుకుంది.




ద్వారక ఎక్స్‌ప్రెస్ వే టెండర్లలో అధిక ధరలకు కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని కాగ్ తేల్చింది. వారి లెక్కల ప్రకారం అసలు ధర కంటే 1,400 శాతం అధికంగా కోట్ చేసిన కంపెనీకి టెండర్ కట్టబెట్టారు. కేంద్రం చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల్లో రూ.3,600 కోట్ల అవినీతి జరిగిన విషయాన్ని నివేదిక కుండబద్దలు కొట్టింది. భారత్ మాల పథకంలో కూడా అరవై శాతం అధిక ధరలకు కోట్ చేసిన కంపెనీకి టెండర్ కట్టబెట్టారని తేల్చింది. ఇక పేదలకు వైద్యం కోసం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకమైతే మరీ దారుణం. ఈ పథకంలో లబ్ధిదారులని చెప్తున్నవారిలో ఏకంగా ఏడున్నర లక్షల మంది ఒకే ఫోన్‌నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేసుకొ న్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంటే ఈ సొమ్మంతా అవినీతి పరుల ఖాతాల్లో చేరిపోయిందనే కదా!

ఆరోగ్య బీమా విషయంలోనూ ఇదే తంతు. 2.25 లక్షల మందికి శస్త్ర చికిత్స చేశామని చెప్పారు. అయితే చికిత్స చేసిన తేదీనీ రోగులను ఆసుపత్రి నుంచి పంపించిన తేదీ తర్వాత చూపించారు. అంటే దొంగతనానికి కూడా కొన్ని నియమాలు ఉంటాయన్న ఇంగితం కూడా మన పాలకులకు లేకుండా పోయింది. రైల్వే మంత్రిత్వ శాఖకు కేటాయించిన ధనాన్ని దర్జాగా ఖర్చు పెట్టేశారు. ఈ విషయాలు కూడా కాగ్ నివేదికలో బయటపడ్డాయి. ఈ లెక్కలన్నీ చూస్తే మోడీ సర్కారు అవినీతి ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా వరకు కాగ్ నివేదికలు పార్ల మెంటు గడప తొక్కకుండా అడ్డుకుంటున్నారు. అలాంటిది తమ అవినీతిని బయటపెట్టిన అధికారులను మోడీ ప్రభుత్వం ఎలా సహిస్తుంది?

ప్రస్తుతం కాగ్ అధిపతి గిరిశ్ చంద్ర ముర్ము గుజరాత్‌కు చెందిన ఉన్నతాధికారి. ఆయన మోడీకి, అమిత్ షాకు అత్యంత సన్నిహితుడు. అందుకే ఆయన్ని మాత్రం భద్రంగా కాపాడుకుంటున్నారు. ఆయన కింద పనిచేసి లొసుగులు ఎత్తి చూపిన అధికారులను మాత్రం బదిలీ చేశారు. ఎందుకంటే తమది మచ్చలేని పాలన అనే భ్రమలో ప్రజలు ఉంటేనే తన కూర్చీని కాపాడుకోవడం సాధ్యమని మన ప్రధానికి బాగా తెలుసు. దీని కోసం మరో పూల్వామాను సృష్టించినా ఆశ్చర్య పోవాల్సిన పని లేదు.

యూపీఏ హయాంలో వినోద్ రాయ్ కాగ్ అధిపతిగా ఉన్న సమయంలో 2జి, కామన్వెల్త్ క్రీడల కుంభకోణాల్లాంటివి రోజుకొకటి వెలికి వచ్చేవి. ఆ కాలంలో జరిగిన మరో ఘోరమైన అవినీతి కోల్‌గేట్ కుంభకోణం. వీటన్నింటినీ అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన మోడీ మరింత అవినీతికి పాల్పడుతున్నాడు. ఇటీవల పంజాబ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ దిగుమతి చేసుకునే బొగ్గు అదానీ పోర్టుల నుండే రావాణా జరగాలనే నిబంధన పెట్టారు. అలాగే అదానీకే బొగ్గు కాంట్రాక్ట్ ఇవ్వాలంటూ భారత సీఎంఓ శ్రీలంక ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అధికారిపై ఒత్తిడి తెచ్చింది. అంతే కాదు మోడీ మొదటిసారి ఆస్ట్రేలియా వెళ్ళినపుడు ఆయనతో పాటు అదానీని కూడా వెంటబెట్టుకెళ్ళి అక్కడి బొగ్గు గనుల కాంట్రాక్ట్ ఇప్పించి వచ్చాడు. ఇలా జనం కడుపులు కొట్టి తన ప్రియ మిత్రునికి దేశాన్ని దోచిపెడుతున్నాడు మోడీ. తమ సొమ్మును ఇంతలా లూటీ చేస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకుంటారో? లేదా రాబోయే ఎన్నికల్లో తమ ఓటుతో బుద్ధి చెప్తారో వేచి చూడాలి.

# ఓటే వజ్రాయుధం..!

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించింది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, పేద, ధనిక అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా ఓటు హక్కును కల్పించింది. ఓటు కలిగి ఉండటం ప్రతీ పౌరుడి అస్తిత్వానికి ప్రతీక లాంటింది. ఈ ఓటు ద్వారా ప్రస్తుత సమాజ స్థితిగతులను మార్చేందుకు వీలవుతుంది. ఒక మంచి సమాజం అభివృద్ధి కావాలంటే ఆ సామాజిక వ్యవస్థకు మంచి ప్రజాప్రతినిధి ఎంత అవసరమో, ఆ ప్రజాప్రతినిధిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకునేందుకు ఓటు అంతే అవసరం. కానీ సమాజంలో చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, ఓ రాజకీయతంతుగా, అమ్ముకునే వస్తువుగానే భావిస్తున్నారా అనే సందేహం నేడు ఉత్పన్నమవుతున్నది. ఇది ఎంత మాత్రం సరికాదు. మద్యం, ధనం ప్రలోభాలకు లోనైతే గనుక మన జీవి తాలనే కాదు మన పిల్లల భవిష్యత్తును మనమే చేజేతులా నాశనం చేసినట్లవుతుంది.

నేడు కొందరు ఓటర్లు తమ ఓటును నోటుకు, మందుకు, తాత్కాలిక తాయిలాలకు, స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారే తప్ప దేశం, రాష్ట్రం, గ్రామం అభివృద్ధి చెందాలనీ, సమాజం పురోగతి సాధించాలనీ ఆలోచించడం లేదు. మనం బాగుపడాలనే తాపత్రయం ఏ ఒక్కరిలో కనిపించటం లేదు. ఇది బాధాకరం. అభివృద్ధి కావాలన్నా, సరైన మార్గంలో పురోగతి సాధించాలన్నా ఓటు సక్రమ వినియోగం చాలా ముఖ్యం. సరైన నాయకుడిని ఎన్నుకోవడం అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో అతి ముఖ్యమైనది. అందుకే భారత ప్రజాస్వామ్య పరిరక్షణకోసం సరైన నాయకుడిని ఎన్నుకోవడం కోసం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని గుర్తించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు వేయాలి. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలి.




సమాజం గురించి అన్నీ తెలిసినవాళ్ళు, విద్యావంతులు కూడా ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఆసక్తి చూపటం లేదు. అధిక శాతం ప్రజాప్రతినిధులు ప్రజాసేవ కోసం కాకుండా కేవలం సంపాదన, స్వార్థ ప్రయోజనాల కోసం కోసం రాజకీయాలను ఆశ్రయించడం వల్ల ప్రజాస్వామ్యం పట్ల గౌరవం తగ్గిపోతున్నదా అన్న సందేహం కలుగుతోంది. కానీ ఓటు హక్కును విధిగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉంది. దీనిని ప్రజాస్వామ్య సంస్కారంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్యం వర్థిల్లాలంటే, ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే ప్రతి పౌరుడు తను స్వతహాగా ప్రజాస్వామిక సంస్కారాన్ని అలవర్చుకోవలసి ఉంటుంది. మొట్టమొదటిసారి రాజ్యాంగ నియమాల ప్రకారం 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు భారతదేశంలో ప్రతిచోటా పండుగలా జరుపుకున్నారు. అయితే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదు. కానీ ఎన్నికలు లేకుండా ప్రజాస్వామ్య ప్రక్రియ పూర్తి కాదు. అందరికీ ఓటు హక్కు కల్పించడం, వారు సక్రమంగా, ప్రశాంతంగా ఓటు వేయడానికి అనుకూల పరిస్థితులు అందుబాటులోకి తేవడం కూడా కీలకమే. ఓటింగు ద్వారా మన అభిప్రాయాలను వ్యక్తం చేయగలం. మనం మన చేతిలోని ఓటు అనే ఆయుధం ద్వారా మన దేశం భవిష్యత్తును నిర్ణయించగలం. ఈ వాస్తవాన్ని అందరూ తెలుసుకోవాలి. ఓటు హక్కుని సక్రమంగా వినియోగించుకోవాలి.

- వై.చంద్రకాంత్ గౌడ్, 9441762105

# బైడెన్ ఇజ్రాయెల్ పర్యటన- గాజాపై ముప్పేట దాడి!



ఎం కోటేశ్వరరావు
8331013288

"హంతకుల మీద ఈ రోజు మనం నెపం నెట్ట కూడదు. మన పట్ల వారి తీవ్ర ద్వేషాన్ని ఎందుకు గర్హించాలి? ఎనిమిది సంవత్సరాలుగా గాజాలోని శరణార్థి శిబిరాలలో వారు కూర్చున్నారు. వారు, వారి తండ్రులు నివసించిన చోట వారి భూములు, గ్రామాలను వారి కళ్ళ ముందే మన ఎస్టేట్లుగా మార్చి వేయటాన్ని వారు చూస్తున్నారు" ఈ మాటలు చెప్పింది జనరల్ మోషే డయాన్. నూటికి నూరుపాళ్లు యూదు దురహంకారే. 1948లో ఇజ్రాయెల్ మిలిటరీ పాలస్తీనా అరబ్బు ప్రాంతాల మీద జరిపిన దురాక్రమణ, హత్యాకాండకు నాయకత్వం వహించిన అధికారులలో ఒకడు. తరువాత మిలిటరీ ప్రధాన అధికారిగా పనిచేశాడు. 1956లో పాలస్తీనా గెరిల్లాలు జరిపిన దాడుల తరువాత డయాన్ చేసిన వ్యాఖ్యలివి. తరువాత కాలంలో పాలస్తీనియన్లతో శాంతి పరిష్కారం కోరుకున్న కారణంగా అదే యూదు దురహంకారులు అతన్ని పక్కన పెట్టారు. ఈ రోజు హమస్ చేసిన దాడులతో మొత్తం పాలస్తీనా వాసులను నిందిస్తున్న వారు అర్థం చేసుకోవాల్సిన కీలక అంశం ఏమిటో డయాన్ చెప్పాడు.

పాలస్తీనా - ఇజ్రాయెల్ వివాదంలో ఒక యూదు దురహంకారికి తెలిసిన మేరకు కూడా మధ్యవర్తిగా ఉన్న అమెరికా అర్థం కానంత అమాయకంగా ఉందా? 1948 నుంచి పాలస్తీనియన్ల ప్రాంతాలను ఆక్రమించి వారిని తరమేయటంతో విదేశాల్లో శరణార్థులుగా, ఇజ్రాయెలీ పాలకులు బహిరంగ జైలుగా మార్చిన పాలస్తీనా ప్రాంతాలలో బందీల మాదిరి క్షణం క్షణం ఏం జరుగుతుందో తెలియని భయం, అనిశ్చితిలో బతుకుతున్నారు. మంగళవారం నాడు అల్‌జజీరా వెల్లడించిన సమాచారం మేరకు హమస్ దాడుల్లో 1,400 మందికి పైగా మరణించగా దానికి ప్రతిగా ఇప్పటివరకు గత పదకొండు రోజుల్లో ఇజ్రాయెల్ మిలిటరీ దాడుల్లో గాజాలోని పాలస్తీనియన్లు 2,808 మంది మరణించారు. వారిలో మూడోవంతు మంది పిల్లలు. అయినా రక్తదాహం తీరలేదు. ఈ స్థితిలో హమస్ దాడుల నుంచి ఆత్మరక్షణకు పూను కోవటం ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కు, దాని బాధ్యత అని నొక్కివక్కాణించేందుకు అమెరికా అధినేత జో బైడెన్ బుధవారం నాడు ఇజ్రాయెల్ వచ్చి కొన్ని గంటల పాటు అక్కడ గడపుతాడని తాజా వార్తలు. నిరంతరం మానవ హక్కుల గురించి ప్రపంచానికి బోధ చేస్తున్న అమెరికా నేత ఇజ్రాయెల్ గడ్డ మీద కూర్చొని ఇంకా కొట్టండి, చంపండి అని గాక ఇంకా ఏం చెబుతాడో చూద్దాం. త్రివిధ దళాలతో గాజాలోని సామాన్య పౌరుల మీద దాడులకు ఇప్పటికే సన్నాహాలు పూర్తయ్యాయి. బైడెన్ తిరిగి అమెరికా వెళ్లిన తరువాత విరుచుకు పడవచ్చు. ఈ పూర్వరంగంలో మరో వైపున లెబనాన్- ఇజ్రాయెల్ సరిహద్దులో పరస్పరం దాడులకు దిగినట్లు, కొందరు మరణించినట్లు వార్తలు. రానున్న కొద్ది గంటల్లో ఇజ్రాయెల్ మీద ఆ ప్రాంతంలోని కొన్ని బృందాలు దాడులకు దిగవచ్చని ఇరాన్ విదేశాంగ మంత్రి చెప్పాడు. వివాదం మరింతగా ముదరకూడదని తాము కోరుకుంటున్నామని ఇరాన్ ఒక సందేశాన్ని పంపింది. అయితే గాజాలో పరిస్థితి దిగజారితే తాను జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు కూడా వార్తలు. ప్రాంతీయ యుద్ధానికి దారి తీస్తే పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా ఇరాన్ భాగస్వామి అవుతుందని కొందరు చెబుతున్నారు.

పాలస్తీనా విముక్తి కోసం పలు పద్ధతులలో పోరాడుతున్నవారు ఉన్నారు. హమస్ సాయుధపోరాట మార్గాన్ని ఎంచుకుంది. అదీ ఎప్పుడు? ఇజ్రాయిల్ ఆక్రమణలకు పాల్పడి అరబ్బుల తరిమివేత, హత్యాకాండను ప్రారంభించిన ఐదు దశాబ్దాల తరువాత. పాలస్తీనా ప్రాంతాలను అక్కడి జనాలకు అప్పగించి ఇజ్రాయెల్ తప్పుకుంటే సమస్య ఒక్క రోజులో పరిష్కారం అవుతుంది. అంతా అమెరికా చేతిలో ఉంది. ఐక్యరాజ్య సమితి తాను చేసిన తీర్మానాన్ని ఉల్లం ఘించిన వారి మీద చర్యకు ఎందుకు ఉపక్రమించటం లేదు? భద్రతా మండలి చేసే తీర్మానాన్ని ఇజ్రాయెల్‌కు అను కూలమైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వీటో చేస్తాయి. సాధా రణ అసెంబ్లీ చేసే తీర్మానాలకు విలువ ఉండదు. నాలుగు న్నర దశాబ్దాల తరువాత అమెరికా మధ్యవర్తిత్వంలో ఓస్లో ఒప్పందం కుదిరింది. ఆ మేరకు పాలస్తీనాలో పరిమిత అధికా రాలున్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి, ఇజ్రాయెల్ తాను ఆక్రమించిన ప్రాంతాలను క్రమంగా ఖాళీ చేసి వెళ్లిపోవాలి. ఈ ఒప్పందాన్ని పాలస్తీనా విమోచనా సంస్థ(పిఎల్ఓ) చేసుకుంది. దాన్ని ఇతర పార్టీలు, సంస్థలు ఆమోదించలేదు. లొంగుబాటుగా వర్ణించాయి. వాటిలో హమస్ ఒకటి. ఎందుకంటే దానిలో అసలు పాలస్తీనా దేశం అనే పదాలే లేవు. ఆ ఒప్పందాలు జరిగి మూడు దశాబ్దాలు గడచింది. మొత్తం మీద చూసినపుడు ఒక్క నిబంధనను కూడా అమలు జరపలేదు. ఆక్రమణల నుంచి ఇజ్రాయెల్ వైదొలగలేదు, పాలస్తీనాకు అప్పగించలేదు. ఆక్రమణలు ఇంకా పెరిగాయి. జెరూసలెం పట్టణాన్ని కూడా ఆక్రమించేందుకు పూనుకుంది. మధ్యవర్తిగా ఉన్న అమెరికా అమలు జరిపేందుకు ఒత్తిడి తేవటం మాని యూదుల పక్షాన నిలబడింది. ఓస్లో ఒప్పందంపై సంతకాలు చేసి దాన్ని అమలు జరిపేందుకు పూనుకోవాలి అని చెప్పిన ఇజ్రాయెల్ ప్రధాని యత్జిక్ రబిన్‌పై తీవ్ర వాదులైన యూదు దురహం కారులు కుట్ర చేసి 1995లో హత్య చేశారు. ఎవరైనా అమలుకు పూనుకుంటే వారికి ఇదే గతి అన్న హెచ్చరికే అది.

పాలస్తీనా విముక్తి కోసం పలు పద్ధతులలో పోరాడుతున్నవారు ఉన్నారు. హమస్ సాయుధపోరాట మార్గాన్ని ఎంచుకుంది. అదీ ఎప్పుడు ? ఇజ్రాయిల్ ఆక్రమణలకు పాల్పడి అరబ్బుల తరిమివేత, హత్యాకాండను ప్రారంభించిన ఐదు దశాబ్దాల తరువాత. పాలస్తీనా ప్రాంతాలను అక్కడి జనాలకు అప్పగించి ఇజ్రాయెల్ తప్పుకుంటే సమస్య ఒక్క రోజులో పరిష్కారం అవుతుంది. అంతా అమెరికా చేతిలో ఉంది. ఐక్యరాజ్య సమితి తాను చేసిన తీర్మానాన్ని ఉల్లంఘించిన వారి మీద చర్యకు ఎందుకు ఉపక్రమించటం లేదు?

ఇక హమస్ తాజా దాడులకు ఎందుకు పాల్పడింది అన్న అంశం మీద ప్రచారంలో ఉన్న కుట్ర సిద్ధాంతాలలో ఒకటేమిటంటే ఇజ్రాయెల్-సౌదీ అరేబియా మధ్య సయోధ్య కుదిర్చేందుకు అమెరికా చేస్తున్న యత్నాలను దెబ్బతీసేందుకు అన్నది ఒకటి. పాలస్తీనా అరబ్బులకు మద్దతు ఇస్తున్న దేశాలలో సౌదీ ఒకటి. అది ఇజ్రాయెల్‌తో కుదుర్చుకొనే ఒప్పందాలకు ప్రాతిపదికలు ఏమిటో బహిర్గతం కాలేదు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం జెరూసలెంతో సహ పశ్చిమ గట్టు, గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న ప్రాంతాలను పాలస్తీనాకు బదలాయిస్తేనే రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలను నెలకొల్పుకొనేందుకు అవకాశం ఉందని సౌదీ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఇది ఉగ్రవాదులైన ఇజ్రాయెల్ మంత్రులు, యంత్రాంగానికి ఏమాత్రం ఆమోద యోగ్యం కాదు. ఈ కారణంగానే హమస్ సాయుధులు క్షిపణులతో సహా గాజా కంచెను దాటి ఇజ్రాయెల్ ప్రాంతంలోకి ప్రవేశించి దాడులు చేసేందుకు కావాలనే అవకాశం ఇచ్చారని, దాడులను సాకుగా చూపి ఉద్రిక్తతలను రెచ్చగొట్టి ఒప్పందాన్ని అడ్డుకోవాలన్నది ఒక కుట్ర కోణం. దాడి జరిగిన ఐదు గంటల తరువాత మాత్రమే ఇజ్రాయెల్ భద్రతాదళాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ కుట్రను అర్థం చేసుకోలేని హమస్ వచ్చిన అవకాశాన్ని దాడికి ఉపయోగించుకున్నట్లు కొందరు చెబుతున్నారు.

గాజాపై దాడికి ఇజ్రాయెల్ పూనుకున్న పూర్వరంగంలో పశ్చిమాసియాలో పర్యవసానాలు, చైనా పాత్ర గురించి కూడా విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. ఇజ్రాయెల్‌తో ఒప్పందాన్ని సౌదీ పక్కన పెట్టినట్లు, ఇరాన్‌తో సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. తాజా పరిస్థితికి బాధ్యత ఇజ్రాయెల్‌దే అన్న సౌదీ, పరిణామాలను దగ్గరగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నది, హమస్ చర్యను ఖండించలేదు. గతంలో ఇజ్రాయెల్‌ను హెచ్చరించినట్లు కూడా పేర్కొన్నది. ఈ స్పందన మీద అమెరికా మండిపడింది. తమతో సాధారణ సంబంధాలను కోరుకోవాలనుకొనే వారి నుంచి రావాల్సిన



సాధారణ ప్రకటన ఇలా ఉండకూడదని వ్యాఖ్యానించింది. ఉప్పు-నిప్పుగా ఉన్న సౌదీ-ఇరాన్‌లను ఒక దగ్గరకు చేర్చి సంబంధాల ఏర్పాటుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో చైనా మధ్యవర్తిత్వం వహించింది. బ్రిక్స్ కూటమిలోకి ఈజిప్టు, సౌదీ, యుఏఇ, ఇరాన్‌లను తెచ్చేందుకు కూడా చూస్తున్నది. ఈ పూర్వరంగంలో చైనా నుంచి దూరంగా జరిగితే పౌర అణు కార్యక్రమంలో భాగంగా ఒక విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తామని అమెరికా ఇటీవల సౌదీకి ఒక బిస్కెట్ వేసింది. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా మిత్ర దేశంగా ఉన్నప్పటికీ గతంలో అలాంటి ప్రతిపాదన చేయలేదు. ఇరాన్‌తో కుదిరిన మైత్రిని దెబ్బతీసేందుకు పావులు కదుపుతోంది. మరోవైపున మధ్య ప్రాచ్యంలో తన పట్టుతగ్గలేదని, తనను ఎదిరిస్తే అంతు చూస్తానని బెదిరించేందుకు రెండు విమానవాహక యుద్ధ నౌకలను, యుద్ధ ఓడలను ఆ ప్రాంతానికి పంపింది. ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్న మన దేశం ఇప్పుడు ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించింది.

చైనా వైఖరిని ఇజ్రాయెల్, అమెరికా, ఐరోపా పశ్చిమ దేశాలు జీర్ణించుకోకపోగా మండిపడుతున్నాయి. తటస్థం అంటే ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరిని తీసుకోవటంగా చిత్రిస్తున్నాయి. అరబ్ దేశాల్లో తనకు అనుకూలమైన స్థితిని సృష్టించుకొనేందుకు చూస్తున్నదని, తన ప్రపంచ అజెండాను ముందుకు తీసుకుపోవటంలో ఇది భాగమని ఉక్రోషం వెల్లడిస్తున్నాయి. ఒకవైపున జనాలను వీధుల్లో హతమారుస్తున్నప్పుడు దాని గురించి మాట్లాడకుండా పాలస్తీనా ఏర్పాటు గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో పాలస్తీనా పాలనా మండలి అధ్యక్షుడు అబ్బాస్‌ను ఒక దేశాధినేత హెూదాలో చైనా ఆహ్వానించింది. పాలస్తీనా పౌరుల న్యాయమైన జాతీయ హక్కులకు మద్దతు ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధానిని కూడా చైనా ఆహ్వానించింది. పాలస్తీనా పౌరుల హక్కులను హరించినందుకు గాను గతంలో దౌత్య సంబంధాలు పెట్టుకొనేందుకు నిరాకరించిన చైనా ఇటీవలి కాలంలో వైఖరిని మార్చుకొని అటు పాలస్తీనా ప్రతినిధులతో పాటు ఇటు ఇజ్రాయెల్‌తో కూడా సంబంధాలను నిర్వహిస్తున్నది. మరోవైపున చైనా మీడియాలో అమెరికా పాత్రను ఎండగడుతూ విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఒక వైపున అరబ్ దేశాలను ఇజ్రాయెల్‌కు దగ్గర చేసేందుకు, మరోవైపున యూదు దురహంకారులకు మద్దతు ఇస్తూ పాలస్తీనియన్ల మీద భరించరాని ఒత్తిడిని అమెరికా పెంచుతున్నదని, ఒకవైపు కొమ్ముకాస్తున్నదని పేర్కొంటున్నారు. చైనా పశ్చిమాసియా తాజా వివాదంలో తటస్థంగా ఉంది. ఉభయ పక్షాలు శాంతం వహించాలని కోరింది తప్ప హమస్‌ను ఖండించలేదు. మావో కాలం నుంచీ పాలస్తీనా పక్షమే వహిస్తున్నది. ఆత్మరక్షణ పేరుతో తన దాడులను ఇజ్రాయెల్ సమర్థించుకుంటున్నది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌తో మాట్లాడుతూ ఆత్మ రక్షణ పరిధికి మించి ఇజ్రాయెల్ చర్యలు ఉన్నాయి. అది అంతర్జాతీయ పిలుపులను వినాలి, గాజా పౌరులందరినీ శిక్షించాలని చూస్తున్న చర్యలను ఐరాస ప్రధాన కార్యదర్శి నిలిపి వేయించాలని, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాలని కూడా చైనా మంత్రి స్పష్టం చేశాడు. చైనా ఇస్తున్న గట్టి మద్దతు అరబ్ ప్రపం చంలో పాలస్తీనీయన్లకు మరింత బలాన్ని ఇస్తుందని, అరబ్ దేశాలు వారి వైపున నిలిచే అవకాశం ఉందని, చైనా కోరుకుంటోంది కూడా అదేనని పరిశీలకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభంలో కూడా తటస్థత అంటూ రష్యా దాడులను ఖండించలేదని మరోవైపున దానితో సంబంధాలను మరింతగా మెరుగుపరుచుకుందని పశ్చిమదేశాల విశ్లేషకులు చైనా మీద మండిపడుతున్నారు.

చైనా పశ్చిమాసియా తాజా వివాదంలో తటస్థంగా ఉంది. ఉభయ పక్షాలు శాంతం వహించాలని కోరింది తప్ప హమస్‌ను ఖండించలేదు. మావో కాలం నుంచీ పాలస్తీనా పక్షమే వహిస్తున్నది. ఆత్మరక్షణ పేరుతో తన దాడులను ఇజ్రాయెల్ సమర్థించుకుంటున్నది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌తో మాట్లాడుతూ ఆత్మ రక్షణ పరిధికి మించి ఇజ్రాయెల్ చర్యలు ఉన్నాయి. అది అంతర్జాతీయ పిలుపులను వినాలి, గాజా పౌరులందరినీ శిక్షించాలని చూస్తున్న చర్యలను ఐరాస ప్రధాన కార్యదర్శి నిలిపివేయించాలని, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాలని కూడా చైనా మంత్రి స్పష్టం చేశాడు.

# రాష్ట్ర బడ్జెట్‌కు మద్యమే ఆదాయ మార్గమా?



మల్లు లక్ష్మి
9848481099

2023-24 రాష్ట్ర బడ్జెట్ రూ.2,89,672 కోట్లతో రూపొందించారు. ఇందులో రాష్ట్ర పన్నులు రూ.1,31, 028 కోట్లుగా చూపారు. ఇదే బడ్జెట్లో ఎక్సైజ్ (మద్యం) ఆదాయం అడ్డా పన్ను రూ.19,885 కోట్లు కాగా, మద్యం అమ్మకాలపై రూ.8,000 కోట్ల ఆదాయం వస్తున్నట్లు ప్రకటించారు. ఏటా ప్రభుత్వం రూ.4000 కోట్ల మద్యం అమ్మకాలు చేస్తున్నది. ఇదికాక విదేశీ మద్యాన్ని కూడా దిగుమతి చేసుకుంటున్నది. రాష్ట్రంలో 17 బేవరీస్ కార్పొరేషన్స్, 6 ఫారిన్ లిక్కర్ కార్పొరేషన్స్ అమ్మకాలు సాగిస్తున్నాయి. మద్యం రీటైల్ అమ్మకాల లైసెన్సులకు దరఖాస్తులు తీసుకొని వాటిలో నుండి లక్కీడ్రా ద్వారా వచ్చిన వారికి లైసెన్సులిస్తారు. 2023 సంవత్సరం లైసెన్సుల కోసం 11,31,954 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు 2 లక్షల రూపాయలు డిపాజిట్ చేయాలి. వీటి ద్వారా రూ.2,639 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. లక్కీడ్రా ద్వారా 2,620 రిటైల్ షాపులను ఎంపిక చేస్తున్నారు. ఎంపిక చేసిన షాపులు అడ్డా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 5 వేల జనాభాలోపు షాపుకు యేటా రూ.50 లక్షలు, 5వేల నుంచి 50 వేల లోపు జనాభాకు రూ.55 లక్షలు, 50 వేల నుండి లక్ష జనాభాకు 60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల జనాభాకు రూ. 65 లక్షలు, 5లక్షల నుంచి 20 లక్షల జనాభాకు రూ. 85 లక్షలు, 20 లక్షల పైన షాపుకు కోటి పది లక్షలు అడ్డా పన్ను చెల్లించాలి. తర్వాత ప్రభుత్వం నుండి కొనుగోలు చేసిన మద్యంకు, మద్యం ధరతో పాటు అమ్మకం పన్ను కూడా చెల్లించాలి. ఈ మధ్య ప్రభుత్వం మద్యం ధరలను 30 శాతం పెంచింది. తద్వారా ఆదాయం పెంచుకుంది.

2620 షాపులలో 786 షాపులకు రిజర్వేషన్ ప్రకటించారు. 15 శాతం గీత కార్మికులకు, 10 శాతం దళితులకు, 5 శాతం గిరిజనులకు కేటాయించారు. రిటైల్ షాపులకు లైసెన్స్ పొందిన వ్యక్తి తన ఏరియాలో బెల్టు షాపులు పెట్టే అవకాశం ఉన్నది. తద్వారా ప్రతి ఇంటికి మద్యాన్ని అందించే ఏర్పాటు చేయడం వల్ల పేదలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని మద్యానికి వ్యయం చేస్తున్నారు. వారి ఆరోగ్యాలు కూడా దెబ్బతింటున్నాయి. విద్య వైద్యం కన్నా మద్యం పై ప్రజలు ఎక్కువ మమకారం చూపుతున్నారు. ఎక్సైజ్ డిపార్టుమెంట్ లైసెన్సులోని చట్టాలను అమలు చేయకుండా విచ్చలవిడిగా బెల్టు షాపులకు అవకాశం కల్పించి, మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నది. మద్యం అమ్మకాలు ప్రతి ఏటా పెరుగుతూ ప్రస్తుతం రూ.40 వేల కోట్లకు చేరుకున్నాయి. మద్యం అమ్మకాలు పెరుగడంతో రాష్ట్రంలో నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. 2020లో ఆర్థిక నేరాలు 12,985 జరుగగా, 2021లో 20,759కి పెరిగింది. ఒక్క హైదరా బాద్‌లోనే 2022లో 22,060 కేసులు పెరిగినట్టు నేర రికార్డులు చెప్తున్నాయి. ఆర్థిక నేరాలే కాక సాంఘిక నేరాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా మద్యం అమ్మకాలను పెంచుకోవడానికి దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ఇండ్ల వద్ద ఎక్కువ బెల్టు షాపులు పెడుతున్నారు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, హాస్పిటల్స్, దేవాలయాలు, కార్యాలయాలు, కిరాణా దుకాణాలలో మద్యం అమ్మకాలు చేస్తున్నారు. వీరు పెట్టే బెల్టు షాపులకు ఎలాంటి లైసెన్సులు ఉండవు. కానీ, ఎక్సైజ్ శాఖ వీలైనంత మద్యం అమ్మకాలు పెంచడానికి బెల్టు షాపులను ప్రోత్సహిస్తుండటం విచారకరం.

మొత్తం బడ్జెట్‌లోని రాష్ట్ర పన్నుల ఆదాయంలో 30 శాతం మద్యం పైనే వస్తున్నది. దీనికితోడు ప్రజలపై భారాలు వేయడానికి భూ రిజిస్ట్రేషన్ ఛార్జీలను విపరీతంగా పెంచారు. 2020-21లో రూ. 5,243,28 కోట్ల ఆదాయం ఉండగా, 2023-24 బడ్జెట్లో రూ.18,500 కోట్లకు పెంచారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడమే కాక ఆస్తుల విలువను పెంచడం ద్వారా పేదలపై భారం పడుతున్నది. పేదలు స్థిరాస్తులను వారసుల పేరుమీద మార్చినప్పటికీ గతంలో లేని విధంగా రిజిస్ట్రే షన్ ఛార్జీలను నిర్ణయించారు. మహిళలకు ఇచ్చే "స్త్రీ ధనం" పై కూడా రిజిస్ట్రేషన్ ఛార్జీలు నిర్ణయించారు. ప్రస్తుతం ప్రభుత్వానికి వస్తున్న రిజిస్ట్రేషన్ ఆదాయంలో 50 శాతం పైగా పేద ప్రజల నుండే వస్తున్నది. రూ.1.31 లక్షల కోట్ల రాష్ట్ర పన్నుల్లో రూ.55 కోట్ల పన్నులు మద్యం, రిజిస్ట్రేషన్ ద్వారానే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నది. ఈ ఆదాయాన్ని ప్రభుత్వం ఉత్పత్తి రంగం కాకుండా, అనుత్పాదక రంగం పై వ్యయం చేయడం ద్వారా సాంఘీకంగా తెలంగాణ అభివృద్ధి కావడం లేదు. 2014లో ఉన్న అక్షరాస్యత 64 శాతం కొద్దిగా పెరిగి 65 శాతం వద్ద నిలిచిపోయింది. అక్షరాస్యత అనగా 10వ తరగతి ఉత్తీర్ణుడైతేనే అతన్ని గుర్తించాలి. కానీ, పాఠశాలలో పేరు నమోదు చేసు కుంటే గుర్తించడం అక్షరాస్యత కాదు. ఇప్పటికీ బాల కార్మికులు 6-14 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారున్నారు. హైదరాబాద్ పట్టణంలోనే ప్రమాదకర పనుల్లో 25 వేల మంది పిల్లలు పనిచేస్తున్నట్లు సర్వేలు చెప్తున్నాయి.




మద్యం ద్వారా ప్రభుత్వం ఆదాయ రాబడి చూస్తున్నదే తప్ప పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, ఆవాసం గురించి పట్టించుకోవడం లేదు. ఒకవైపున తలసరి వార్షికాదాయం రూ.3 లక్షలకు పైగా పెరిగిందని, దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని చెబుతూనే, మరోవైపున ఇండ్లు లేనివారు మద్యానికి బానిసై ఆస్తులు కోల్పోతున్నవారు, శారీరక ఆరోగ్యం దెబ్బతిని అర్థాంతరంగా మరణిస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నది. మద్యం వల్ల బుద్ధిమాంద్యం పెరిగి చైతన్యం కోల్పోతున్నారు. ప్రతిరోజూ మద్యం దుకాణాల ముందు వందల సంఖ్యలో లైన్ కడుతున్నారు. వీరి ఒత్తిడికి తట్టుకోలేక దుకాణాలకు ఇనుప గ్రిల్స్ పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలను చైతన్య పర్చాల్సిన ప్రభుత్వం బుద్ధి మాంద్యం గల సమాజాన్ని తయారు చేస్తున్నది. ఇది అత్యంత ప్రమాదకరం. ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్లను పరిశీలిస్తే 5,73,050 మంది భర్తను కోల్పోయినవారు, 1,43,456 మంది ఒంటరి మహిళ లున్నట్లు తెలుస్తున్నది. పెన్షన్లు పొందకుండా ఉన్న వారి సంఖ్య సర్వే చేస్తే ఇంతకన్నా రెట్టింపు అవుతుంది. తొమ్మిదేండ్ల పాలనలో కనీసం అక్షరాస్యత 94 శాతానికి పెరగాలి. వయోజన విద్య పాఠశాలలు ఏర్పాటు చేస్తే పాఠశాలకు వెళ్ళనివారికి కూడా విద్య గరపాలి. అలాగే ప్రస్తుతమున్న ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లతోపాటు మందులను అందుబాటులో పెట్టాలి. ఖర్చు భరించలేనప్పటికీ ప్రభుత్వ హాస్పిటళ్ళకన్నా ప్రజలు ప్రయివేటు హాస్పిటళ్లకే వెళుతున్నారు. ప్రాణాలు రక్షించుకోవడం ముఖ్యంగా భావిస్తున్నారు. మురికి వాడలను బాగు చేయడానికి ఏటా పథకాలను ప్రకటించటమే తప్ప, అమలు చేయడం లేదు. కానీ, మురికివాడలలో మద్యం బెల్టు షాపులు మాత్రం తప్పనిసరిగా ఉంటాయి. వారికొచ్చే ఆదాయంలో 75 శాతం మద్యం దుకాణాలకే వెళ్లిపోతాయి. మద్యం వల్ల కుటుంబంలో తగాదాలేర్పడి, కుటుంబ విచ్ఛిన్నం జరుగుతున్నది. అయినా ప్రభుత్వం తన పథకాల ద్వారా రాష్ట్రం అభివృద్ధిలోకి వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నది. రాష్ట్ర సమగ్ర సర్వేలో ఆస్తులు కోల్పోతున్నవారు, అనారోగ్యానికి గురౌతున్న వారి వివరాలు కూడా సేకరించారు. కానీ, వాటిని సరి చేయడానికి మాత్రం ఎలాంటి ప్రయత్నం జరగడం లేదు.

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మద్య నిషేధం చేయాలని నెల్లూరు జిల్లా, దూబగుంటలో రోషమ్మ నాయకత్వాన పెద్ద పోరాటం జరిగింది. రాష్ట్రంలోని మహిళలందరూ పాల్గొన్నారు. చివరికి ప్రభుత్వం దిగొచ్చి మద్యనిషేధాన్ని అమలు చేసింది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మద్య నిషేధాన్ని అమలు చేస్తే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మద్య నిషేధాన్ని సడలించింది. నేటి ప్రభుత్వం మద్యంపైనే 30 శాతం బడ్జెట్ ఆదాయాన్ని రాబడుతున్నది. దీనిని గొప్పగా చెప్పుకుంటున్నది. ప్రయివేటు మద్యాన్ని, గుడుంబాను నియంత్రించామని, ఆరోగ్యకరమైన మద్యాన్ని అందిస్తున్నామని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉన్నది. ప్రపంచంలో గానీ, దేశంలో గానీ ఇంత ప్రోత్సాహకరంగా మద్యాన్ని విక్రయిస్తున్న ప్రభుత్వం మరొకటి లేదు. ఇది ప్రభుత్వ ఆదాయానికి ఒక మార్గంగా ఉపయోగించుకుంటున్నది. ఇప్పటికైనా ప్రజల ఆర్థిక, సాంఘిక పరిస్థితులను, మెరుగుపర్చడానికి మద్యంపై నియంత్రణ పెట్టాలి. ప్రభుత్వం బడ్జెట్ పెంపునకు ఆస్తి పన్నును పెంచడం ద్వారా ఆదాయాన్ని రాబట్టాలి. అప్పుడే ప్రజల బతుకులు కొంతైనా బాగుపడే అవకాశం ఉంటుంది.

మద్యం ద్వారా ప్రభుత్వం ఆదాయ రాబడి చూస్తున్నదే తప్ప పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, ఆవాసం గురించి పట్టించుకోవడం లేదు. ఒకవైపున తలసరి వార్షికాదాయం రూ.3 లక్షలకు పైగా పెరిగిందని, దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని చెబుతూనే, మరోవైపున ఇండ్లు లేనివారు మద్యానికి బానిసై ఆస్తులు కోల్పోతున్నవారు, శారీరక ఆరోగ్యం దెబ్బతిని అర్థాంతరంగా మరణిస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నది. మద్యం వల్ల బుద్ధిమాంద్యం పెరిగి చైతన్యం కోల్పోతున్నారు. ప్రతిరోజూ మద్యం దుకాణాల ముందు వందల సంఖ్యలో లైన్ కడుతున్నారు. వీరి ఒత్తిడికి తట్టుకోలేక దుకాణాలకు ఇనుప గ్రిల్స్ పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలను చైతన్యపర్చాల్సిన ప్రభుత్వం బుద్ధిమాంద్యం గల సమాజాన్ని తయారు చేస్తున్నది. ఇది అత్యంత ప్రమాదకరం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
బుధవారం | అక్టోబర్ 18, 2023 | www.navatelangana.com



## విధి వంచిత కుటుంబానికి చేయూత

### షేక్ ఉద్దండు రూ.10వేల ఆర్థికసాయం

**నవతెలంగాణ-కారేపల్లి**

కుటుంబమంతా అనారోగ్యంతో బాధపడుతూ విధి వైపరీత్యానికి ఎదురీతున్న ఆ కుటుంబానికి దాతల అండ కొండంత అండగా నిలవాల్సిన తరుణంలో మేమున్నామంటూ దాతలు ముందుకు వస్తున్నారు. నవతెలంగాణలో "విధివంచిత కుటుంబం...బాబును కాపాడుకోవటానికి తీవ్రయత్నం".. శీర్షికన కథనం వెలువడటంతో ఓ ఫార్మా కంపెనీలో డివిజన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ ఉద్దండు స్పందించారు. మంగళవారం కారేపల్లి మండలం గాదెపాడులోని బాధితులు భూక్యా సంతు-ప్రమీల కుటుంబాన్ని పరామర్శించారు. బాధితుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని చలించారు. బాలుడి భూక్యా హర్షిత్ బ్రెయిన్ సర్జరీకి తన వంతు సాయంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రతి ఒక్క దాత స్పందించి భూక్యా సంతు కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలని, బాబు హర్షిత్ బ్రెయిన్ సర్జరీ తోడ్పడాలని కోరారు. సాయం అందించిన షేక్ ఉద్దండుకు బాధిత సంతు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టులు గుమ్మడి నర్సయ్య, షేక్ నాగుల్‌మీర, దాత కుటుంబ సభ్యులు సైఫ్, బుష్రారెహమాన్‌లు పాల్గొన్నారు.




## కలెక్టరేట్‌లో వినూత్నంగా బతుకమ్మ వేడుకలు

**నవతెలంగాణ- ఖమ్మం**

ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు వినూత్నంగా జరుపుకున్నారు. రాబోయే శాసనసభ సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బతుకమ్మ సంబరాల్లో స్వీప్ కార్యక్రమం ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు హక్కు వినియోగంపై నినాదాలు, ప్ల కార్డులు బతుకమ్మల వద్ద ప్రదర్శిస్తూ, ఓటుకు సంబంధించి పాటలు పాడుతూ కలెక్టరేట్ మహిళా అధికారులు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సీడీపీవోలు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశమంతా పండుగలా వస్తున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. డబ్బు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నైతికతతో ఓటు వేయాలన్నారు. సి విజిల్ యాప్‌పై పెద్దఎత్తున ప్రచారం చేపట్టి, యువత, విద్యావంతుల్లో అవగాహన కల్పించాలని, సి విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా చైతన్యం కల్గించాలని కలెక్టర్ తెలిపారు. డబ్బు ప్రభావం లేకుండా ఎన్నికల నిర్వహణ చేపట్టే సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసి రాజేశ్వరి, డిడబ్ల్యూఓ సుమ, డిఆర్డీఓ విద్యాచందన, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మనోహర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డు

### వేలాదిమందికి రక్తదానం చేయించిన గుర్తింపుగా పురస్కారం

**నవతెలంగాణ-వైరా**

వైరా పట్టణానికి చెందిన 'నీ తోడు వెల్ఫేర్ సొసైటీ' అధ్యక్షులు నందిగామ మనోహర్ కొన్నేళ్లుగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు, ప్రమాద బాధితులకు, తలసేమియా బాధితులకు రక్తదానం చేస్తూ, చేయిస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. మరికొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఈ సంస్థను గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డుకి ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇన్కమ్ ట్యాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్, శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా అమరేష్, మేడా మోహన్ రావు, మేడా నరసింహరావు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ సంస్థ కోఆర్డినేటర్ దాసరి రమేష్, మోహన్‌రావు, సయ్యద్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొని "నీ తోడు సంస్థ" సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా నందిగామ మనోహర్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేసిన ఎస్ఆర్ఎఫ్ అధినేతకు టీం సభ్యులందరికీ మనోహర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు 'నీ తోడు సంస్థ' సేవలను విస్తరింపజేసి వేలాది మందికి సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గుత్తా మురళి, కీసర సీతారాంరెడ్డి, మాచర్ల ఉదయ్, మేడా ఉపగ్న, అడపా వర్షిత, మేడా నూతన, ఎనగంటి నరేంద్ర కుమార్, షేక్ హైమద్ పాషా, కొండా ఉపేందర్, తాటిపల్లి రణధీర్, మేడా మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌బీఐటీలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

**నవతెలంగాణ- ఖమ్మం**

ఖమ్మంలో ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 5 రోజుల ఎ.డబ్ల్యు.యస్. క్లౌడ్ కంప్యూటింగ్‌పై శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు .ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీలో క్లౌడ్ కంప్యూటింగ్ ఎక్కువ ట్రెండ్ అవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ ఐదు రోజుల పాటు విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడుతూ విద్యార్థుల కోసం కావలసిన అత్యాధునిక సాంకేతిక శిక్షణలు యాజమాన్యం నుండి నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. టాస్క్ ట్రైనర్ యస్. హేమంత్ కృష్ణ మాట్లాడుతూ టాస్క్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్టిఫీషియల్, రోబొటిక్స్ పాటు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు టాస్క్ సిద్దంగా ఉందని తెలిపారు. శిక్షణలో విద్యార్థులందరికి ఎ.డబ్ల్యు.యస్. నుండి డిజిటల్ సర్టిఫికెట్లు అందచేస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణలు నిర్వహిస్తున్న టాస్క్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాజమాన్యం శిక్షణ ఇచ్చిన ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ హేమంత్ కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎవివి.శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, టిపిఒలు. ఎన్.సవిత, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం అభివృద్ధే నా లక్ష్యం

### ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ అజయ్‌కుమార్

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో త్రీ టౌన్ ప్రాంతంలోని స్థానిక 46వ డివిజన్ జహీర్‌పురలోని వేములపల్లి వేంకటేశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 10 సంవత్సరాల పాటు తాను ఖమ్మం నగర ప్రజలతో మమేకమయ్యాను అన్నారు. వర్తక, వాణిజ్య సంఘాల వారి పట్ల తాను నిబద్ధతతో పని చేశాను అని అన్నారు. తాను ఉన్నంత వరకు మార్కెట్ ఇక్కడి నుండి తరలించడం జరగదన్నారు. ఖమ్మం అభివృద్ధే తన లక్ష్యమన్నారు. రాజ్యసభ సభ్యులు రవిచంద్ర మాట్లాడుతూ



ఇక్కడ జరిగిన అభివృద్ధి ఎక్కడైనా జరిగిందా.. మీ కళ్ళ ముందు ఉన్న ప్రతి అభివృద్ధి మంత్రి పువ్వాడ కృషికి నిదర్శనం. అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, పసుమర్తి రాంమోహన్‌రావు, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, గుర్రం ఉమా మహేశ్వర రావు, బొమ్మ రాజేశ్వరరావు, విజయ గణపతి దేవస్థానం చైర్మన్ రాయపూడి వెంకట రామారావు, పెనుగొండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు కట్టుదిట్టంగా నమోదు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి విపి. గౌతమ్

**నవతెలంగాణ- ఖమ్మం**

శాసనసభ సాధారణ ఎన్నికలలో ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాలను భారత ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శాసనసభ సాధారణ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల నమోదుపై అకౌంటింగ్ బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న శాసనసభ సాధారణ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని, పారదర్శకంగా ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు కల్పిస్తూ ఎన్నికలను నిర్వహించాలని అన్నారు. భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గానికి అభ్యర్థి ఎన్నికల ఖర్చును గరిష్ట పరిమితి రూ.40 లక్షలుగా నిర్ధారించిందని కలెక్టర్ తెలిపారు. రాబోయే రోజులలో జిల్లాలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలు సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ, ప్రచార ప్రకటనలు, వీఐపీలు పాల్గొనే బహిరంగ సభలు వాటికి అయ్యే వివరాలను నిషితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఖర్చుకు ఆధారాలు నిర్వహించాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చులకు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాల్సి ఉంటుందని, అందులో నుంచి మాత్రమే ఎన్నికల ఖర్చులు చేయాలని, వీటిని పరిశీలించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియో సర్వేలైన్సు బృందాలు వీడియో



వీవింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, మానిటరింగ్ సెల్ కాల్ సెంటర్, స్టాటిటిక్ సర్వేలైన్స్ బృందాలు, వ్యయ మానిటరింగ్ సెల్ మొదలకు బృందాలు వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఇకపై ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల కరపత్రాలు ఫ్లెక్సీలు బ్యానర్లు ముద్రించే సమయంలో తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల ఫ్లెక్సీల పై ఎవరు ముద్రిస్తున్నారో వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ప్రింట్ చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు మద్యం ప్రభావం ఉండకుండా నిరంతరం నిఘా ఉండాలని, అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై అధికారులు డేగ కన్నుతో పరిశీలించాలని అన్నారు. ప్రజా ప్రాతినిధ్య 1951 ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం వ్యయ పరిశీలన, స్వీప్ నోడల్ అధికారులు బృందాలకు తమ విధులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏఇఓ లు, ఆడిట్ అధికారులు, అకౌంట్, విఎస్టి, వివిటి బృందం సభ్యులు పాల్గొన్నారు.

**ఎన్నికల కంట్రోల్ రూమ్ తనిఖీ చేసిన కలెక్టర్**

నూతన కలెక్టరేట్‌లో నిర్వహించబడుచున్న ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ విపి.గౌతమ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్‌కి వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో ప్రదర్శించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి, ఎఫ్ఎస్టి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల వివరాలు, సంప్రదించాల్సిన నెంబర్లతో సహా ఉన్న ఫ్లెక్సీలను పరిశీలించారు. సి విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సి విజిల్ యాప్ ద్వారా 72 ఫిర్యాదులు రాగా, పరిష్కరించినట్లు, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 343 కాల్స్ వచ్చినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 21 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, సిసి కెమెరాలు అమర్చినట్లు, అ సిసి కెమెరాలను కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950, 9063211298 లకు కాల్ చేసి ఫిర్యాదులు, సందేహాలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సిపిఓ ఎ. శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్, రంజిత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలంతా బందిపోట్లే

- పార్టీ మార్పులపై పువ్వాడకు మాట్లాడే అర్హత లేదు
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

**నవతెలంగాణ-ఖమ్మం**

బీఆర్ఎస్ నాయకులంతా బందిపోట్లే అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక అర్హత బిఆర్ఎస్ పార్టీకి, పువ్వాడ అజయ్ కుమార్‌కు లేదని అన్నారు. అధికార పార్టీలో ఉండి కూడా ప్రతిపక్ష పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారంటే రాష్ట్రంలో ఉన్న రాచరిక పాలన కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందని తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు భారీగా పెరిగాయని, రానున్న 20 రోజుల్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్పొరేటర్లతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రమాణాలు చేపిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అయినా కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నగర కార్పొరేటర్ కమర్తపు మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని, ఎంతోమంది ప్రజా నాయకులను తయారుచేసిన పార్టీ కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ పువ్వాడ అజయ్‌కు ఒక గజదొంగ అని, ప్రభుత్వ యంత్రాంగాన్ని




చేతిలో పెట్టుకొని ఆయన చేయని అక్రమాలు లేవని ఆరోపించారు. జిల్లా నుండి పువ్వాడ అజయ్‌ను, తెలంగాణ రాష్ట్రం నుండి బీఆర్ఎస్‌ను తరిమికొడతామని ప్రతిజ్ఞ చేస్తున్నట్టు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఫీదా బేగం తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### 5రోజుల్లో 3 వేల మందికి ఉచిత వైద్యం

**నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్**

ప్రజా నాయకుడు పల్లా జాన్ రాములు 85వ జయంతి సందర్భంగా 5 రోజుల పాటు ఖమ్మం నగరంలోని మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో వారి తనయుడు, ప్రజా సేవకుడు పల్లా కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో భాగంగా 5వ రోజు మంగళవారం పేషెంట్‌లతో ఉచిత వైద్య శిబిరం రద్దీగా మారింది. జ్వరం, విరోచనాలు, దగ్గు, జలుబు, బిపి, షుగర్ లాంటి సమస్యలతో స్థానిక పరిసర ప్రాంత నుంచి పేద ప్రజలు దాదాపు 1200 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 3 వేల మంది నిరుపేదలకు వైద్యం అందించారు. మందులను ఉచితంగా పల్లా కిరణ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పల్లా కిరణ్ మిత్ర బృందం, తదితరులు పాల్గొన్నారు.




## యుటిఎఫ్ ఆధ్వర్యంలో గెజిటెడ్ అధికారులకు సన్మానం

**నవతెలంగాణ-చింతకాని**

యుటిఎఫ్ ఆధ్వర్యంలో చింతకాని మండలం నుంచి గెజిటెడ్ అధికారులుగా ప్రమోషన్ పొంది వివిధ ప్రాంతాలకు, వివిధ జిల్లాలకు వెళ్లిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులైన అంబటి శాంతయ్య, జవాజి ఝాన్సీ, పుసులూరి శ్రీలత, గౌసుద్దీన్‌లను మంగళవారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. వారిని మెమెంటోలు మరియు గ్రీన్ పెన్నులతో సత్కరించారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు నర్సిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, చావా రవి, రాష్ట్ర బాధ్యులు దుర్గ భవాని, వెంకట్, మహబూబ్ అలీ, డీసీబీ జిల్లా కార్యదర్శి నారాయణ, జిల్లా బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, జీవీ నాగమల్లేశ్వరరావు, రాజశేఖర్, వీరబాబు, వీరపనేని శ్రీనివాసరావు, గీతా, మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు, రాయల శ్రీనివాస్ రావు, చిరంజీవి నాయుడు, సురేష్, మోదుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో త్రీ టౌన్ ప్రాంతంలోని స్థానిక సుందరయ్య నగర్ 29, 30వ డివిజన్లలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మహిళలు అనేక రకాలుగా పూలతో బతుకమ్మలను అలంకరించి మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆటపాటలతో ఉత్సాహంగా ఆడారు. అనంతరం మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మను ఎన్నుకొని బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ





సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో మహిళల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు భూక్య శ్రీనివాసరావు, ప్రజా నాట్యమండలి నాయకులు ఎస్‌కే.ఇమామ్, రంగు హనుమంత చారి, మద్ది శ్రీనివాసరావు, ఎర్ర నగేష్, బెజవాడ చంద్రశేఖర్, ఉపేంద్ర చారి, రాజు, మహిళా సంఘం నాయకులు రంగు పుష్ప, భూక్య సుభద్ర, ఊడుగుల పద్మ, మారగాని పద్మ, పురం కుమారి, ఎర్ర లింగమ్మ పాల్గొన్నారు.

# జొన్నలగడ్డ రామయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

**నవతెలంగాణ - బోనకల్**

అమరజీవి జొన్నలగడ్డ రామయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని, ఆ ఉద్యమాలలో సీపీఐ(ఎం) శ్రేణులు, ప్రజలు విరివిగా పాల్గొనాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో అమరజీవి జొన్నలగడ్డ రామయ్య వర్ధంతి వేడుకలను సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రామయ్య స్థూపము వద్ద పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ జొన్నలగడ్డ రామయ్యను కాంగ్రెస్ నాయకులు హత్య చేశారన్నారు. అతి కిరాతకంగా రామయ్యను హత్య చేశారన్నారు. రామయ్య




గోవిందాపురం గ్రామంలో సిపిఎం అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. ప్రధానంగా పేద ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారన్నారు. రామయ్య స్ఫూర్తితో యువతి, యువకులు ప్రజా ఉద్యమాలలో విరివిగా పాల్గొనాలని కోరారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం క్షేత్రస్థాయిలో అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ పోరాటాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం పేరుతో ఈ దేశాన్ని ముక్కలు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, ఆ ప్రయత్నాలను సిపిఎం తన శక్తి మేరకు అడ్డుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావాలని కలల కంటుందని ఆ కలలు కలలగానే మిగిలిపోతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా చేయటమే సిపిఎం లక్ష్యం అన్నారు. ఇందుకోసం కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికలలో పని చేస్తామని స్పష్టం చేశారు. బిజెపి మతతత్వాన్ని రెచ్చగొడుతూ ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పందుతుందన్నారు. అనేక రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నాయని, ఆ పార్టీలలో చీలికలు తెచ్చి ప్రభుత్వాన్ని కూలదోసి వారి సహాయంతో ప్రభుత్వాలను బిజెపి ఏర్పాటు చేస్తుందన్నారు. బిజెపి కుట్ర రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా తొలుత గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, లక్ష్మీపురం ఎంపిటిసి జొన్నలగడ్డ సునీత, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఏడునూతల లక్ష్మణరావు, నాయకులు కళ్యాణపు శ్రీనివాసరావు, కళ్యాణపు బుచ్చయ్య, జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ, నల్లమోతు నాగేశ్వరరావు, కారంగుల చంద్రయ్య, కోట కాటయ్య, వల్లంకొండ సురేష్, నల్లమోతు వాణి, పుచ్చకాయల వలరాజు, తమ్మారపు లక్ష్మణ్, పొన్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

**నవతెలంగాణ- ఖమ్మం**

తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మంగళవారం ఖమ్మంలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏన్కూరు మండలానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా సక్రు నాయక్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పూర్ణకంటి మైసారావు, చింతనబోయిన సీతారాములు, బిసి సెల్ మండల అధ్యక్షులు దేశిని గణేష్, ధరావత్ నరేష్, బూరుగడ్డ రామారావు, సాయికుమార్, కాకాటి యోహాన్, ఆడపా అవినాష్ తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి పొంగులేటి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయబాయి, గిద్దగిరి సత్యనారాయణ, ముక్తి వెంకటేశ్వర్లు, నల్లమల శివకుమార్, కర్ణం ప్రసాద్, ఇండ్ల కష్ణయ్య, శోభన్ నాయక్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని టేకులపల్లి కేసీఆర్ టవర్స్‌కు చెందిన పలువురు మహిళలు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.



## ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోవాలి

**కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర**

**నవతెలంగాణ- నేలకొండపల్లి**

ప్రతి రైతు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకంలో ఈ కేవైసీ చేయించుకోవాలని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పీఎం కిసాన్ పథకంలో ఎన్పిసిఐ మ్యాపింగ్ కొరకు పోస్ట్ ఆఫీస్ ఖాతా ఓపెన్ చేసి ఎన్పిసిఐ ఆధార్ లింక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి రైతు ఈ కేవైసీ చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో పీఎం కిసాన్ పథకంలో ఆధార్ సీడింగ్ కూడా చేయించి రైతులకు పిఎం కిసాన్ పథకంలో నగదు జమ చేసేందుకు ఈ కేవైసీ, ఎన్పిసిఐ ఆధార్ లింక్, ఆధార్ సీడింగ్ చేయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి అరుణకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి ఉదయ్ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిన నాయకుడు కర్నాటి కృష్ణయ్య

**సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**

**నవతెలంగాణ- నేలకొండపల్లి**

ప్రజల పక్షాన పోరాడి చరిత్రలో నిలిచిన నాయకుడు కర్నాటి కృష్ణయ్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు కర్నాటి కృష్ణయ్య 25వ వర్ధంతిని మంగళవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కర్నాటి కృష్ణయ్య స్మారక స్థూపానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పార్టీ జెండాను సిపిఐ సీనియర్ నాయకులు బైరవునిపల్లి మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, మండల నాయకులు మచ్చా రఘుపతిరావు, కర్నాటి రవీందర్, మచ్చా రేణుక, చావా గణపతి, కర్నాటి నలినిరాణి, సహాయ కార్యదర్శులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తియా శ్రీను, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కార్యవర్గ సభ్యులు మాలోతు అయోధ్య, రాయల మాధవరావు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి అధ్యక్షుడు పాలపాటి అశోక్ పాల్గొన్నారు.

## బీసీ సంఘం ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్

**నవతెలంగాణ-సత్తుపల్లి**

జాతీయ బీసీ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మానుకోట ప్రసాద్, యువజన విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కందుకూరు మారేశ్వరరావు నియమితులయ్యారు. మంగళవారం సత్తుపల్లిలోని ఆ సంఘ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ సంఘ ముఖ్య నాయకులతో జరిపిన సమావేశానంతరం వారికి ఈ నియామకపు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్, మారేశ్వరరావు మాట్లాడుతూ మాపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కు, సహకరించిన సంఘ నాయకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సంఘ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేయడంతో పాటు బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు దుస్స వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల్లి శ్రీనివాస్, నాయకులు చిల్లపల్లి మాధవ, గుడిద రామకృష్ణ, తిన్నవల్లి రంగారావు, చిల్లగుండ్ల వెంకటేశ్వరరావు, విరివాడ నాగభూషణం పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నవతెలంగాణ- వేంసూరు**

మండల పరిధిలోని లింగపాలెం వద్ద కారు, బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న కలపాల సతీష్ (32) మృతి చెందాడు. ఎస్ఐ సత్య ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా శివపురానికి చెందిన కలపాల సతీష్ సత్తుపల్లి నుండి లచ్చన్న గూడెం వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సు, కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న సతీష్ మృతి చెందాడు.

## అభివృద్ధికి పట్టం కట్టండి... సండ్రను గెలిపించండి

**- చైర్మెన్ మహేశ్, కౌన్సిలర్లు ఖాతూమ్‌గఫార్, రాఘవేంద్ర**

**నవతెలంగాణ-సత్తుపల్లి**



అభివృద్ధికి పట్టం కట్టాలంటే ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను మళ్లీ గెలిపించాలని మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు ఎండీ ఖాతూమ్‌గఫార్, గుండ్ర రాఘవేంద్ర, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ ప్రజలను కోరారు. మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు 12, 14 వార్డుల పరిధిలోని ద్వారకాపురి, గాంధీనగర్ కాలనీల్లో సండ్ర విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచారు. ఈ నాలుగున్నర యేండ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్ సహకారం, ఎమ్మెల్యే సండ్ర కృషితో సత్తుపల్లి పట్టణం అభివృద్ధిలో జిల్లాలోనే ముందుందన్నారు. సత్తుపల్లి మరింత అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుపై ఓట్లేసి సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు మల్లూరు అంకమరాజు, ఎండీ గఫార్, మేకల నరసింహారావు, ఎండీ అబ్దుల్లా, వేములపల్లి మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లులను ఆన్లైన్లో చెల్లించండి

**నవతెలంగాణ-ముదిగొండ**



విద్యుత్ వినియోగదారులు బిల్లులను ఆన్లైన్లో చెల్లించాలని విద్యుత్ శాఖ ఏఈలు మేకపోతుల శ్రీనివాసరావు, వడ్డ్యా నారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులు ఆన్లైన్లో చెల్లించే పోస్టర్స్‌ను సంస్థ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానమును వివరించారు. విద్యుత్ బిల్లులను ఎప్పుడైనా, ఎక్కడైనా వెబ్సైటు, మొబైల్ యాప్ల ద్వారా చెల్లించవచ్చున్నారు. ఫోన్, గూగుల్ పే, బిల్ డెస్క్, పేటియం, టీవాలెట్, అమెజాన్ మొబైల్ యాప్లను ఉపయోగించుకోవచ్చున్నారు. వెబ్సైటు మొబైల్ యాప్‌లలో బిల్లు చెల్లించుటకు యూనిక్ సర్వీస్ (యుఎస్సిఎన్ఓ) నెంబర్ను ఎంటర్ చేసి డిబేట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి, ఆన్లైన్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులను పూర్తి చేయవచ్చున్నారు. ఆన్లైన్లో బిల్లు చెల్లింపులు, పారదర్శకత, భద్రతతో పాటు వెంటనే మీయొక్క సర్వీస్కు జమ చేయబడుతుందన్నారు. గత విద్యుత్ చెల్లింపుల బిల్లులను చూసుకునే అవకాశం కలదన్నారు. ఆన్లైన్లో బిల్లులు చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవాలని ఏఈలు శ్రీనివాసరావు, నారాయణ విద్యుత్ వినియోగదారులను కోరారు.

# మాతృభూమి కోసం పోరాటం తీవ్రవాదం కాదు

- ఏఐపీఎస్ఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుబ్బారావు, గడల భాస్కరరావు
- ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధాన్ని తక్షణం నివారించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**నవతెలంగాణ- ఖమ్మం**

మాతృభూమి కోసం పోరాటం చేయడం తీవ్రవాదం కాదని, పాలస్తీనా పౌరులు చేస్తున్న యుద్ధాన్ని తీవ్రవాదంగా చేయడం సరైనది కాదని, ప్రపంచశాంతి సంఘీభావ సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుబ్బారావు, గడల భాస్కరరావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని జెడ్పీ సెంటర్లో పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే నివారించాలని సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధానికి సంబంధించి ఐక్య సమితి జోక్యం చేసుకొని శాంతి ద్వారా యుద్ధాన్ని నివారించాలని, ఇజ్రాయిల్ చేస్తున్న ఆగడాలను ఐక్యరాజ్యసమితి ఎందుకు చూస్తూ ఊరుకుం టుందని వారన్నారు. పౌర సమాజం మీద యుద్ధం చేయడం సరైనది కాదని, ఇజ్రాయిల్ సైన్యాలు వెనక్కి రావాలని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకొని యుద్ధాన్ని నివారించాలని అన్నారు. ఇప్పటికే పాలస్తీనా పూర్తి భూభాగాన్ని కోల్పోయిం దని, ఇంకా రెండు దేశాల వడంబడికి సరైనది కాదని అని అన్నారు. పాలస్తీనా పౌర సమాజంపై జరుగుతున్న దాడులను అందరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా నాయకులు శింగు నరసింహారావు మాట్లాడుతూ సామ్రాజ్య వాదుల కుట్రతోనే యుద్ధం జరుగుతున్నట్లు అన్నారు. యుద్ధాన్ని తక్షణం నివారించకపోతే ఇది పాలస్తీనాకే కాక ప్రపంచాన్ని కూడా నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై విక్రం, ఎర్ర శ్రీనివాసరావు, ఎంఎ జబ్బర్, షేక్ బషీరుద్దీన్, మెరుగు సత్యనారాయణ, ఎం ఎ ఖయ్యూం, అఫ్రోస్ సమీనా, ఎంఎ మీరా, నవీన్‌రెడ్డి, సిపిఐ నాయకులు పోటు కళావతి, సీతామాలక్ష్మి, మేకల శ్రీనివాస్, శివరామకృష్ణ, రాము, సుబ్బారావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## రాయల ఇంటికి పొంగులేటి

**కాంగ్రెస్ అధిష్టానానికి కట్టుబడి ఉంటా: రాయల**

**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:**



టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ఇంటికి కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యాహ్నం వెళ్లారు. సుమారు ఓ పావుగంట పాటు వారిద్దరూ ఏకాంతంగా చర్చలు జరిపారు. పాలేరు కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసిన టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు తనకు కాకుండా పొంగులేటి శ్రీనివాసరెడ్డికి టిక్కెట్ వస్తుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో కాస్త అసంతృప్తిగా ఉన్నట్లు తెలియడంతో పొంగులేటి ఆయన్ను కలిసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఎలా ముందుండి నడపాలి, ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ విజయానికి ఎలా కృషి చేయాలి, ఎలా సహకరించుకోవాలి తదితర అంశాలపై చర్చించినట్లు రాయల తెలిపారు. గతంలోనూ కాంగ్రెస్ ఏ కార్యక్రమం చేపట్టమన్నా దాని విజయవంతానికి కృషి చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని రాయల చెప్పారు.

**బందిపోటనే మాటకు బీఆర్ఎస్సే నిదర్శనం: పొంగులేటి**

బందిపోటనే మాటకు బీఆర్ఎస్సే నిదర్శనమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. పాత కాంగ్రెస్ నేతలకు అన్యాయం చేయమన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే తెలంగాణ ప్రజల కలలు సాకారం అవుతాయన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ములుగు నియోజకవర్గం నుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ చేపట్టే బస్సుయాత్రను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఎన్ని పూర్తయ్యాయని ప్రశ్నించారు. యువత జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడిందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టిందన్నారు. ఆరు గ్యారెంటీలు ఎలా సాధ్యమని ప్రశ్నించిన బీఆర్ఎస్ పెద్దమనుషులు ఇప్పుడు దానికన్నా ఎలా పెంచారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి కట్టుబడి రాయల నాగేశ్వరరావు పోటీ చేశారని తెలిపారు. పార్టీ కోసం గడిచిన నాలుగేళ్లుగా తీవ్రంగా కృషి చేశారన్నారు. అనేక గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను హైకోర్టు వరకు వెళ్లి అండగా నిలిచారని తెలిపారు. వందలాది మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు. పొంగులేటి వెంట రాయల ఇంటికి వెళ్లిన వారిలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయ్‌బాబు, బీరోలు సహకార సంఘం అధ్యక్షులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావ శివరామకృష్ణ, మద్దినేని స్వర్ణకుమారి, కిషన్‌రావు, ఉన్నారు.



## సీఎం బహిరంగ సభ స్థలం పరిశీలన

**నవతెలంగాణ- కల్లూరు**

నవంబర్ ఒకటో తేదీన కల్లూరులో సీఎం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పోలీసులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఎన్ఎస్పీ క్రాస్ రోడ్‌లో గల మారుతి నగర్‌లోని ఖాళీగా ఉన్న 50 ఎకరాల స్థలంలో నిర్వహించాలని సత్తుపల్లి సండ్ర వెంకట వీరయ్య నిర్ణయించారు. ఈ మేరకు ఆ స్థలంలో స్టేజి ఎక్కడ ఏర్పాటు చేయాలి, హెలీప్యాడ్‌కు ఎక్కడ స్థలం కేటాయించాలి..సభకు హాజరైన ప్రజలకు ఎటు స్థలం కేటాయించాలనే విషయాలపై స్థలాన్ని సీఐ హనుక్, ఎంపీపీ బీరవల్లి రఘు, బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పాలెపు రామారావు వివరించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, రాచమల్ల నాగేశ్వరరావు, అజ్మీర జమలయ్య, మూర్ధాల పిచ్చిరెడ్డి, మాంచల కృష్ణ, ఇనపనూరి మోహనరావు, మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## డాక్టర్ ప్రదీప్‌ను కలిసిన తుమ్మల

**నవతెలంగాణ- ఖమ్మం**



నగరంలోని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ నివాసానికి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళ వారం వెళ్లి డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మలను కూరపాటి శాలువతో సన్మానించారు.

## ప్రమాదాలు జరక్కుండా టార్గెట్స్‌ను అధిగమించాలి

**- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు**

**నవతెలంగాణ-సత్తుపల్లి**



ప్రమాదాలు జరక్కుండా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేంరాజు జేవీఆర్, కిష్టారం ఓసీ ప్రాజెక్టు అధికారులు ఎస్ వెంకటాచారి, ఎంవీ నరసింహారావులను కోరారు. మంగళవారం సత్తుపల్లి వచ్చిన జీఎం షాలేంరాజు ఆయా ఓసీల వ్యూ పాయింట్స్ నుంచి బొగ్గు గనులను పరిశీలించారు. అనంతరం జేవీఆర్ఓసీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ) సందర్శించారు. బంకర్ చుట్టూ దుమ్ము, దూళి, బొగ్గు పెళ్లలు లేకుండా చూసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులకు జీఎం సూచించారు. ప్రమాదాలు లేకుండా బొగ్గు రవాణా జరగాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీరు వీవీ దుర్గాప్రసాద్, సీహెచ్‌పీ ఇన్‌ఛార్జి సోమశేఖర్, ఇంజినీర్లు రాకేశ్, మోహన్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## నగదు సీజ్

**కల్లూరు:** స్థానిక షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లున్న రూ.1.50 లక్షలను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుండి వ్యాన్ వైరా వస్తుండగా చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేయగా 1.50 లక్షల రూపాయలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు ఎస్సై పీ.రఘు తెలిపారు.


శ్రీయుత గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి
వారి కోర్టు, ఖమ్మం నందు
ఇ.పి. నెం. 227/2015 ఇన్
ఒ.యస్. నెం. 622/2014

బిట్వీన్ :
పేరం వెంకటేశ్వర్లు
....వాది/డిహెచ్ఆర్
మరియు
అచ్చి సత్యనారాయణ
....ప్రతివాది/జెడీఆర్

నోటీసు

టు,
అచ్చి సత్యనారాయణ, తండ్రి : వెంకన్న, వయస్సు : 50 సం.లు, వృత్తి : వ్యాపారం, నివాసం : ఇ.నెం. 2-5-132, భక్తపోతన వీధి, ఖమ్మం టౌన్ & జిల్లా.

పై కేసు నందు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ముట్టని కారణమున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 17-11-2023 నాడు పై కోర్టు నందు మీరు గాని మీ లాయర్ గారి ద్వారా గాని ఉ.గం. 10.30 నిు.లకు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)

ఇట్లు
కె. కమలాకర్‌రావు
అడ్వకేట్, ఖమ్మం.
ఖమ్మం.
ది.18.10.2023 సెల్ : 9440227984



శ్రీయుత గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి
వారి కోర్టు, ఖమ్మం నందు
ఇ.ఎ. నెం. 36/2022 ఇన్
ఇ.పి. నెం. 227/2015 ఇన్
ఒ.యస్. నెం. 622/2014

బిట్వీన్ :
పేరం వెంకటేశ్వర్లు
....వాది/డిహెచ్ఆర్
మరియు
అచ్చి సత్యనారాయణ
....ప్రతివాది/జెడీఆర్

నోటీసు

టు,
అచ్చి సత్యనారాయణ, తండ్రి : వెంకన్న, వయస్సు : 50 సం.లు, వృత్తి : వ్యాపారం, నివాసం : ఇ.నెం. 2-5-132, భక్తపోతన వీధి, ఖమ్మం టౌన్ & జిల్లా.

పై కేసు నందు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను ముట్టని కారణమున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 17-11-2023 నాడు పై కోర్టు నందు మీరు గాని మీ లాయర్ గారి ద్వారా గాని ఉ.గం. 10.30 నిు.లకు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)

ఇట్లు
కె. కమలాకర్‌రావు
అడ్వకేట్, ఖమ్మం.
ఖమ్మం.
ది.18.10.2023 సెల్ : 9440227984



IN THE COURT OF THE 1 ADDL. DISTRICT JUDGE AT KHAMMAM
E.P. NO. 182/17 IN
ARBITRATION CASE NO. 111/2014

Between :
M/s. Shriram City Union Finance Limited Khammam -2 branch, rep. by its GPA Holder K. Srinivasulu ......DHR
AND
Srinivasa Rangarao Morampudi
And others ....Judgement Debtors

సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఖమ్మం-2 బ్రాంచి తనకు రావలసిన డబ్బులు రాబట్టుకొనుటకు ARB CASE NO. 111/2014 ద్వారా 2) ధనలక్ష్మి మోరంపుడి పై డిక్రీ పొంది యున్నారు. సదరు అవార్డు డిక్రీని అనుసరించి ఈ ఇద్దరు చెల్లించవలసిన రూపాయలు అసలు, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించని కారణంగా ఇ.పి.నెం.182/17 ద్వారా మొత్తం డబ్బులు రాబట్టుకొనుటకు 2) ధనలక్ష్మి మోరంపుడి గారి స్వాధీనానుభవ యాజమాన్య హక్కుభుక్తములలోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కోర్టు వారు అటాచ్‌మెంట్ చేసియున్నారు. మరియు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మవలసినదిగా పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టువారు ఆజ్ఞానుసారం తేది. 01-11-2023 ఉ.గం. 10.30 నిు.లకు పై కోర్టు వారి ముందు కోర్టు వారి షరతులకు లోబడి బహిరంగ వేలం వేయడం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు పైన తెలిపిన కోర్టు వారు నిర్వహించబడు వేలంలో పాల్గొని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చు. ఈ రోజు వరకు అవార్డు డిక్రీ బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు మొత్తం కలిపి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రావలసిన బకాయి రూ. 8,32,427/-లు

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY to Attached

Open land 968 sq. yards in 1487/A/F/A situated at Lachannagudem (Vi) Vemsoor (M), Khammam District. & Sub District sathupally is with the following boundaries
Bounded as Under :
East : M. Rama Narasimharao and Nageswara Rao
West: GP Road, South : R. Satyavani.
North : House of M Rukminama

E. RAMACHANDRA RAO
NVV. PADMAVATHI
Advocates, Khammam.



IN THE COURT OF THE 1 ADDL. DISTRICT JUDGE AT KHAMMAM
E.P. NO. 104/18 IN
ARBITRATION CASE NO. 60/2016

Between :
M/s. Shriram City Union Finance Limited Khammam -2 branch, rep. by its GPA Holder K. Srinivasulu ......DHR
AND
Narla Malsoor And another
....Judgement Debtors

సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఖమ్మం-2 బ్రాంచి తనకు రావలసిన డబ్బులు రాబట్టుకొనుటకు ARB CASE NO. 60/2016 ద్వారా 1) నార్ల మల్సూర్ పై డిక్రీ పొంది యున్నారు. సదరు అవార్డు డిక్రీని అనుసరించి ఈ ఇద్దరు చెల్లించవలసిన రూపాయలు అసలు, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించని కారణంగా ఇ.పి.నెం.104/18 ద్వారా మొత్తం డబ్బులు రాబట్టుకొనుటకు 1) నార్ల మల్సూర్ గారి స్వాధీనానుభవ యాజమాన్య హక్కుభుక్తములలోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కోర్టు వారు అటాచ్‌మెంట్ చేసియున్నారు. మరియు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మవలసినదిగా పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టువారు ఆజ్ఞానుసారం తేది. 01-11-2023 ఉ.గం. 10.30 నిు.లకు పై కోర్టు వారి ముందు కోర్టు వారి షరతులకు లోబడి బహిరంగ వేలం వేయడం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు పైన తెలిపిన కోర్టు వారు నిర్వహించబడు వేలంలో పాల్గొని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చు. ఈ రోజు వరకు అవార్డు డిక్రీ బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు మొత్తం కలిపి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రావలసిన బకాయి రూ.15,01,983/-లు

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY to JDRNo.1

The open site loan extent of 255 sq. yards vide plot no. 99 in and out Sy No. 321 minjumle situated at Khanapuram Haveli Village and Gram Panchayat Khammam Urban Mandal, with the following boundaries :
Bounded as Under :
East : Plot No. 100 West:Plot No. 98
North : Plot No. 95 South : Road

G. HARINDER REDDY
Advocate, Khammam.


## అన్నం పరబ్రహ్మ స్వరూపం

**నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్**

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం మేకల సంఘయ్య వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద మంగళవారం అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకులు, ఎస్బిఐటి చైర్మన్ ఆర్జేసి కృష్ణ పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిత ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ఎస్బిఐటి చైర్మన్ ఆర్జేసి కష్ణ కలిసి అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 22న వల్లభిలో బతుకమ్మ ముగింపు సభ

**నవతెలంగాణ-ముదిగొండ**

ఈనెల 22న వల్లభిలో నిర్వహించే బహుజన బతుకమ్మ ముగింపు సభ పోస్టర్స్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ముదిగొండలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా బతుకమ్మ ముగింపు సభ కన్వీనర్ బిచ్చాల అన్వేష్ మాట్లాడుతూ బతుకమ్మ ముగింపు సభకు రచయిత, గాయని, అరుణోదయ విమలక్క ముఖ్యఅతిథిగా హాజరవుతుందన్నారు. మండలంలోని బహుజనవాదులు, యువతీ యువకులు, మహిళలు బతుకమ్మ ముగింపు సభలో అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వల్లభి ఎంపీటీసీ సభ్యులు బిచ్చాల బిక్షం, ప్రజా సంఘాల నాయకులు మెట్టెల సతీష్, ఉసికల రమేష్, దేవపొంగు వెంకటేశ్వర్లు, చిలకల రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డులు వితరణ

**నవతెలంగాణ - ఎర్రుపాలెం**

సుదర్శన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డులను ఫౌండేషన్ బాధ్యులు జగదీష్ వితరణ చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు సుమారు 8 వేల రూపాయల విలువ కలిగిన రికార్డులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకొని భవిష్యత్తులో పేదలకు సహాయం చేసే మనసు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా దాతను కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, సిబ్బంది సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



## మండలంలో 'కొండూరు' పర్యటన

**నవతెలంగాణ- తల్లాడ**

అన్నారుగూడెం గ్రామంలో ఇరుముడి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు కొండూరు సుధాకర్ మంగళవారం హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోవిందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. కొండూరు సుధాకర్ ఆర్థిక సహాయం ఇటీవల అనారోగ్యానికి గురైన అన్నారుగూడెం గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యులు ఎమ్‌డి బాబును పరామర్శించి కొండూరు సుధాకర్ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు తుమ్మలపల్లి రమేష్, నరసింహారావు, గోవింద నరసింహారావు, మాగంటి శ్రీనివాస్‌రావు, బానోత్ నరసింహారావు, షేక్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి సంబరాలు

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**

ఖమ్మం నగరంలోత్రీ టౌన్ ప్రాంతంలోని గుట్టల బజార్‌లో వేచి ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవ్యాలయంలో దేవి నవరాత్రులు ఉత్సవంలో భాగంగా మంగళవారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉన్న ఉత్సవమూర్తి విగ్రహాన్ని మేళతాళాలతో డప్పు వాయిదాలతో రథంపై ఘనంగా మందిరం చుట్టు ఊరేగించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం వారాహి దేవి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవత అనిల్‌కుమార్, కోశాధికారి కొత్తమాసు హేమ సుందరరావు, ఉపాధ్యక్షులు గోళ్ళ భాస్కరరావు, బిజ్జల ఈశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరశెట్టి పూర్ణచంద్రరావు, మద్ది వెంకట వీరభద్రరావు, సహాయ కార్యదర్శి అనుమోలు రమేష్, చెరుకూరి శ్రీనివాసరావు, యర్రమళ్ళ సుదర్శన్ రావు, రాయపూడి రవికుమార్, చిన్ని కృష్ణారావు, దుగ్గి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలపై విస్తృత ప్రచారం

**నవతెలంగాణ-ముదిగొండ**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు వచ్చే నెల 30న జరగనున్నాయి. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు (గ్యారెంటీ) హామీ పథకాలపై మండలంలోని వివిధ గ్రామాల్లో కరపత్రాలతో,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. న్యూలక్ష్మీపురంలో గ్రామ సర్పంచ్ వాకదాని కన్నయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఆరు గ్యారెంటీ హామీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అగ్గర్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల మాజీ అధ్యక్షులు ఊరుకొండ రాజు, గ్రామ ఉపసర్పంచ్ వెల్లటూరు మైసయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లె పొంగు రమేష్, నాయకులు ఎస్డి రఫీ, మారుతి వీరయ్య, బట్టు బసవయ్య పోతురాజు పురుషోత్తం, కొట్టే శ్రీనివాస్, గండు సురేష్ పాల్గొన్నారు.

## ఖాతాదారులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-కామేపల్లి**



కామేపల్లి ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలోని ప్రతి ఖాతాదారులు వ్యక్తిగత బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి బ్రాంచ్ మేనేజర్ విజయ భవాని అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరు సంవత్సరానికి, రూ 436 చెల్లిస్తే సహజ మరణం పొందిన కుటుంబానికి రూ.2లక్షలు, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం ద్వారా రూ.20 సంవత్సరానికి చెల్లిస్తే ప్రమాద బీమా వర్తిస్తుందని, ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి రెండు లక్షల ఆర్థికసాయం అందించడం జరుగుతుందన్నారు. ఈసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


CHANGE OF NAME
I, KAPA CHANDRASAKARA RAO (Old Name), S/o. Kapa Suryanarayana R/o. H.No. 1-58/2, Gandhi Nagar, Singareni Mandal,Khammam Dist., Telangana State. Have changed my name as KAPA CHANDRASHEKAR RAO (New Name), here after my name known as KAPA CHANDRASHEKAR RAO (New Name), S/o. Kapa Suryanarayana
Date : 17-10-2023 Place : SINGARENI

## ముమ్మరంగా వాహన తనిఖీలు



**నవతెలంగాణ-టేకులపల్లి**

సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముమ్మరంగా వాహన తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు అప్రమత్తమై ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వాటిపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజల సహకరించాలని, 50వేలకు మించి నగదును తీసుకువెళ్తే ఆధారాలు చూపించాలన్నారు. పోలీసు సిబ్బంది చేసే తనిఖీల్లో ప్రజలు వాహనదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థిని ఉన్నత చదువులకు 'కేవీ' ఆర్థిక చేయూత

- రూ:10 వేలు అందజేత



**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఉన్నత చదువులను కొనసాగించలేని పేద గిరిజన విద్యార్థినికి ఆర్థిక చేయూతని ఇచ్చేందుకు కొత్తపల్లి గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ కుర్సా వెంకటేశ్వరరావు ముందుకొచ్చారు. మండలంలోని పెద్ద బండిరేవు గ్రామానికి చెందిన సోయం వీర్రాజు దంపతుల కుమార్తె సోయం చోప్రా దేవి నాగర్ కర్నూల్‌లో వ్యవసాయ విద్యా కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ మూడవ సంవత్సరం చదువుతున్నది. మూడో సంవత్సరంలో కట్టవలసిన ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్న ఈ నిరుపేద ఆదివాసి విద్యార్థినీ కళాశాలకు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటుంది. విద్యార్థినీ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న 'కేవీ' స్పందించి, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు చేతుల మీదుగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.10వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోయం ఏసుబాబు, ఏఎస్పీ మండల అధ్యక్షులు కుర్సం రవి, మిచ్చా దుర్గారావు సోయం రవి, సోయం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రచారంలో కోరం



**నవతెలంగాణ-ఇల్లందు**

మండలంలోని విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ గ్రామ పంచాయతీల్లో మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య హాజరై పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే ప్రవేశపెట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎట్టి హరికృష్ణ, ప్రచార కార్యదర్శి దనసరి పగిడిద్ద రాజు, సర్పంచులు పూనెం కవిత, దనసరి స్రవంతి, మాజీ మున్సిపల్ చైర్మెన్ అనసూర్య, ఎంపీటీసీలు పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 20న సీపీఐ జనరల్ బాడీ సమావేశం



**నవతెలంగాణ-మణుగూరు**

ఈ నెల 20న మణుగూరు సీపీఐ కార్యాలయంలో మండల, పట్టణ జనరల్ బాడీ సమావేశంను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, మున్న లక్ష్మీకుమారి, ఆర్.లక్ష్మీనారాయణ, జంగం మోహన్ రావు, దుర్గేల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## షోయబుల్లా ఖాన్ 103వ జయంతి

- సీఐటీయూ, ఆవాజ్ నివాళి



**నవతెలంగాణ-ఇల్లందు**

కలం పోటుతో నైజాం ప్రభుత్వాన్ని, భూస్వాములను, దేశ్ముఖ్‌లను గడగడ లాడించిన షోయబుల్లా ఖాన్ 103వ జయంతి మంగళవారం సందర్భంగా ఏలూరి భవన్లో సీఐటీయూ, ఆవాజ్ నివాళి అర్పించింది. చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో షోయబుల్లా ఖాన్ జర్నలిస్ట్‌గా ఉండి ప్రజల్ని చైతన్య పరుస్తుండనే ఉద్దేశంతో నైజాం సర్కారు దేశముక్కులు, జమీందారులు, జాగిర్దారులు కుట్రలు పన్ని ఖాసిం రజ్వీ అనే పోలీసు అధికారితో అత్యంత పాశవికంగా హత్య చేయించారన్నారు. 28 ఏండ్ల వయసులో సోయబుల్లా ఖాన్ తన రచనల ద్వారా ప్రజల్ని చైతన్య పరుస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తన వంతు కృషి చేశారన్నారు. ఆయన మరువలేని అని అన్నారు. ఈ కార్యక్రమరో జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం మోహన్ రావు, సీఐటీయూ నాయకులు కూకట్ల శంకర్, ఆర్బిజె రాజు, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు తాళ్లూరి పద్మ, నాగరాజు, కోటేశ్వరరావు, ఆవాజ్ నాయకులు ఖాదర్, అబ్బాస్, జాఫర్ అయ్యూబ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలో ప్రెషర్స్ డే

**నవతెలంగాణ- టేకులపల్లి**

టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్‌డే వేడుక ఘనంగా మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ స్థాయి ఎంతో ముఖ్యమైనదిగా ఉంటుందని ఒడిదుడుకులతో కూడినదని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్న సమయాన్ని సద్వినియోగపరుచుకొని వారు ఏర్పరచుకున్న లక్ష్యాన్ని సాధించాలని కోరారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జయశ్రీ కృష్ణమూర్తి, బసవమ్మ సత్యవతి, ముంతాజ్ అలీ శంకర్రావు, వేణుగోపాల్ యాఖుబ్, వరలక్ష్మి ప్రమోద్, కుమార్ నాగేశ్వరరావు, బుల్లారావు రమేష్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం ఎన్నికలలో పోటీ చేస్తా

- బంజారా జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూక్య



**నవతెలంగాణ-జూలూరుపాడు**

త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో వైరా నియోజక వర్గం నుంచి పోటీ చేస్తానని బంజారా జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూక్య దేవిలాల్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... గిరిజన రిజర్వేషన్లను పది శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బంజారా జేఏసీ ఆధ్వర్యంలో గతంలో భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర టేకులపల్లి మండలానికి చేరుకునే సమయంలో ప్రజా స్పందనను చూసి రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో చేసిన బిల్లును నిర్లక్ష్యం చేసాయన్నారు. నన్ను గెలిపిస్తే వైరా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, ఆత్మ గౌరవం కోసం కృషి చేస్తానని దేవిలాల్ నాయక్ అన్నారు.

## ప్రమాదానికి గురైన బాబురావు మృతి

**నవతెలంగాణ-మణుగూరు**

మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గడ్డి కొప్పుల రాములు కుమారుడు గడ్డికొప్పుల బాబురావు పాల్వంచలో యాక్సిడెంట్ జరిగి హైదరాబాద్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంటూ సోమవారం మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, నాయకులు పుల్లారెడ్డి, కార్యదర్శి జంగం మోహన్రావు, దుగ్యాల సుధాకర్, ఎస్కే సర్వర్ అక్కి నరసింహారావు, మంగి వీరయ్య, కనితి సత్యనారాయణ, బి.వీరస్వామి, ఎస్వీ నాయుడు, తోట రమేష్, జక్కుల రాజబాబు, శ్రీకాకుళం, వీరమల్లులు పాల్గొని ఎర్రజెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## అన్నదాన కార్యక్రమం



**నవతెలంగాణ-గుండాల**

గుండాల మండల కేంద్రంలో మంగళవారం దుర్గా దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఎం.రంజిత్-చందన దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు టి.సురేష్, పి.రమేష్, జి.సురేష్, వి.శివ, వి.సాగర్, జి.సాయి, పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అసౌకర్యాల పై కలెక్టర్ ఆగ్రహం

- పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం
- పోలింగ్ కేంద్రాలు, అంతర్రాష్ట చెక్ పోస్ట్ తనిఖీ
- ఎన్నికల నిర్వహణ పై సిబ్బందితో సమీక్ష



**నవతెలంగాణ-అశ్వారావుపేట**

పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి ఆకస్మికంగా మంగళవారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట వచ్చిన కలెక్టర్ ప్రియాంక అలా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (మన ఊరు-మన బడి)ల్లో అసౌకర్యాలు పై సంబంధిత ప్రధానోపాధ్యాయుడు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. కనీసం లైట్‌లు, ఫ్యాన్‌లు కూడా ఏర్పాటు చేయకుండా బిల్లులు ఎలా తీసుకున్నారంటూ ఎంఈఓ క్రిష్ణయ్య పై మండి పడ్డారు. 10 రోజుల్లో మన ఊరు-మన బడుల్లో అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేసి నివేదిక పంపాలని ఆదేశించారు.

జిల్లా పరిషత్ బాల, బాలికలు, మైనార్టీ బాలికల ఉన్నత పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ నుండి అంతర్రాష్ట చెక్ పోస్ట్‌ను వారు తనిఖీ చేసారు. అనంతరం ఆమె తహశీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్లో ఎన్నికల నిర్వహణ పై సిబ్బందితో సుదీర్ఘ సమీక్ష చేసారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అధికారులు సమన్వయంగా పని చేసి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలపై సెక్టోరల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఇప్పటికే ఎటువంటి ఆధారాలు లేని రూ.34 లక్షలను సీజ్ చేశామని, వ్యయ నిర్వహణ జిల్లా కమిటీని ఏర్పాటు చేశామని, పట్టుబడిన నగదుకు సంబంధించిన ఏమైనా ఆధారాలు ఉంటే కమిటీ రిలీజ్ చేస్తుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 9,15,034 మంది ఉన్నారని, వీరి కోసం 129 ప్రాంతాల్లో 1,095 పోలింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సారి 80 ఏళ్ళు నిండిన ఓటర్లు ఇంటి వద్దే ఓటు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందుకు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కొండ రెడ్ల గ్రామాల్లో ఓటు హక్కు విని యోగంపై అవగాహన కల్పించామని, సమస్యాత్మక గ్రామాలపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి ఉంటుందని చెప్పారు.

### కలెక్టర్ సుడిగాలి పర్యటన:

పట్టణంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా స్థానిక ప్రభుత్వ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు.పూర్తి స్థాయిలో వసతులు లేకపోవటంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఎన్నికలు నిబంధనల మేరకు ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాల్సిందే నని, మరో 10 రోజుల్లో అన్ని పనులు పూర్తి చేయాలని స్థానిక అధికారులను అదేశించారు. బాలికల ఉన్నత పాఠశాలలో మౌళిక వసతులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్.ఎం అందుబాటులో లేకపోవటం, పాఠశాల ప్రాంగణం శుభ్రంగా లేకపోవడం పట్ల మండిపడ్డారు. వారి వేతనం నిలిపివేస్తున్నట్లు ప్రకటించాడు. అనంతరం అశ్వారావుపేట శివారు నందమూరి నగర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుకు చేరుకుని పరిసరాలను పరిశీలించారు. రోజు వారీ నమోదు చేస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. ఏ ప్రాంతాల నుండి ప్రయాణికులు వస్తున్నారు. ఏ విధంగా తనిఖీలు చేస్తున్నారో పాల్వంచ డీఎస్పీ వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్రమ నగదు, మద్యం రవాణాపై నిఘాను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఏ ఏ శాఖల అధికారులు విధులు నిర్వహిస్తున్నారు అనే విషయం పై ఆరా తీశారు.

### విధులు పట్ల అలసత్వం వద్దు:

త్వరలో జరగబోవు అసెంబ్లీ ఎన్నికల పట్ల అధికారులు విధులు పట్ల ఎటువంటి అలసత్వం వహించ వద్దని హితవు పలికారు. ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు సక్రమంగా నిర్వహించాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ మండలాల అధికారులతో సమీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్, నియోజక వర్గం ఎన్నికల అధికారి రాంబాబు, డీహెచ్ఎస్ఓ, ఎన్నికల సీపీఓ జినుగు మరియన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఎన్నికల లా అండ్ ఆర్డర్ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ వెంకటేష్, నియోజకవర్గ ఎన్నికల నోడల్ ఆఫీసర్ రామం, నియోజకవర్గ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ సంబరాల్లో ఆటపాట

- ఆడపిల్లలను పుట్టనిద్దాం బతకనిద్దాం
- సీపీఐ(ఎం) నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

పట్టణంలోని జగదీష్ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బతుకమ్మ సంబరాలు ఆటపాట అనే కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య హాజరై మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనిద్దాం బతకనిద్దాం అని మహిళల హక్కుల కోసం పోరాడుదాం అని అన్నారు. మనదేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, అనేక హక్కులు చట్టాలు ఉన్నప్పటికీ ప్రతిరోజు ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. రక్షణ కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.రమేష్, నాయకురాలు సత్య, సౌభాగ్యం, రేణుక, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్ముడు పోయే వాళ్ళని ఓడించండి

- ప్రజల కోసం పనిచేసే సీపీఐ(ఎం)ను గెలిపించండి
- సీపీఐ(ఎం) రాష్ట కమిటీ సభ్యులు మచ్చా



**నవతెలంగాణ-చెర్ల**

పదవుల, డబ్బు కోసం అమ్ముడుపోయే నాయకులను ఓడించాలని, నిరంతరం ప్రజల కోసం పనిచేసే సీపీఐ(ఎం)ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం కుర్నపల్లి, బోధనెల్లి, పంచాయతీలో వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు పర్యటించి గ్రూప్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను సరుకుల్లాగా మార్చుతున్నారని డబ్బు సంచుల తోటి కొనుగోలు చేయాలని తపన తప్ప వారికి ప్రజాసేవ అనే లక్ష్యం లేదని విమర్శించారు. రాజకీయాలను వ్యాపారంగా మార్చిన వ్యాపారస్తులే నేడు భద్రాచలం నియోజకవర్గంలో ప్రజాప్రతినిధిగా గెలవాలని అనేక రకాల వక్రమార్గాలను అనుసరిస్తున్నారని అటువంటి వాటన్నింటినీ ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమం కోసం ప్రజల రోజు వారి కష్టసుఖాల్లో అండగా ఉండే పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. పదేళ్ల పదవులు అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చి అభివృద్ధి చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని పార్టీ విమర్శించింది. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిధులు కేటాయించలేదని ప్రతిపక్షంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం మీద పోరాడి నిధులు సాధించలేకపోయాడని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) ప్రజా ప్రతినిధులు ఉన్న కాలంలో అధికారంలో ఏ పార్టీ ఉన్న భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించడంలో సఫలం అయ్యారని పేర్కొన్నారు. నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచటం అందుకు అనుగుణంగా నిధులు సాధించడంలో పార్టీ ప్రజా ప్రతినిధులు ఆదర్శవంతంగా వ్యవహరించారని అందుకే మళ్ళీ సీపీఐ(ఎం) అభ్యర్థిని నియోజకవర్గంలో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తునికాకు బోనస్సు, పోడు భూముల సమస్య పరిష్కారం చేయడంలో పార్టీ పోరాటాలు కీలకంగా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తున్న సీపీఐ(ఎం)ను గెలిపించాలని కోరారు. పూటకో పార్టీ మారుతూ ఊసరవెల్లి రంగులు మార్చినట్టుగా పార్టీలు మారే నాయకులు డబ్బు కోసం పదవి కోసం అమ్ముడుపోయే నాయకులు వల్ల నియోజకవర్గం ప్రతిష్ట దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఓట్లు వేసిన ప్రజలను నియోజకవర్గ అభివృద్ధిని వారి స్వార్థం కోసం అమ్ముకుంటున్న నాయకులను ఓటమి ఆయుధం ద్వారా ఓడించాలని సీపీఐ(ఎం) గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మచారి, మండల కార్యదర్శి కారం నరేష్, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల నాయకులు, సోడి నాగేశ్వరరావు, కుర్నపల్లి మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు కనితి నరసయ్య, బోధనెల్లి సర్పంచ్ మడివి సంధ్య, నాయకులు సాంబశివరావు, బందెల చంటి, సురేందర్, ఇర్పా సర్వేశ్వరరావు మడివి నాగేష్, వర్ష రాజు తదితరులు పాల్గొన్నారు.



## దసరా లోపే లాభాల వాటా చెల్లింపు

- ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు వూకంటి

**నవతెలంగాణ-మణుగూరు**

టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవతో దసరా లోపే లాభాల బాట చెల్లిస్తామని ఏరియా ఉపాధ్యక్షులు ఊకంటి ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం ఓసి 2 గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. టీబీజీకేఎస్ కేంద్ర నాయకత్వం దసరా పండుగ కంటే వారం రోజుల ముందుగానే లాభాలు చెల్లించే విధంగా యాజమాన్యంతో ఒప్పందం చేసిన దృష్ట్యా ఎలక్షన్ కోడ్‌తో ఈ నెల 16న చెల్లించే లాభాలు నిలుపుదల చేశారన్నారు. అందుకు కార్మికులు నిరుత్సాహానికి గురి కావొద్దని అన్నారు. పండుగ లోపే లాభాల వాటా ఇప్పించే విధంగా కవిత ప్రత్యేక చొరవతో దసరాలోపులే చెల్లిస్తామన్నారు. లాభాల వాటా చెల్లింపు విషయంలో కొన్ని కార్మిక సంఘాలు అవగాహన లేమితో కార్మికులను అయోమయానికి గురి చేస్తున్నాయని అన్నారు. అటువంటి కార్మిక సంఘాల మాటలు నమ్మకుడదని ఎలక్షన్ కోడ్ నెపంతోనే లాభాల వాటా చెల్లింపు తాత్కాలిక నిలుపుదల చేశారన్నారు. సంస్థలో డబ్బులు లేక కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవుఫ్, నాయకులు వీర భద్రయ్య కాపా శివాజీ, ఎస్‌విఎన్ వర్మ, సిహెచ్ వెంకటేశ్వర రెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, కృష్ణ, రమణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుర హాకీ జట్టు కోచ్‌గా నిఖిల్



**నవతెలంగాణ-కొత్తగూడెం**

ఇండియా సబ్ జూనియర్స్ సౌత్ జోన్ 1వ హాకీ జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 17 నుంచి 24 వరకు తమిళనాడులో జరుగుతున్నాయి. తెలంగాణ బాలుర హాకీ జట్టుకు నిఖిల్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు తెలంగాణ హాకీ నుంచి ఆదేశాలు అందాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ క్రీడాకారునిగా చిరపరిచితుడైన నిఖిల్ ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడలో ఎన్ఐఎస్ పూర్తి చేసిన, హాకీ ఇండియా తరుపున లెవల్ 1 పరీక్ష పాస్ అయినా ఏకైక క్రీడాకారునిగా గుర్తింపు సాధించాడు. సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొనే తెలంగాణ బాలుర జట్టుకు కోచ్‌గా నిఖిల్ ఎంపిక కావడం పట్ల జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భట్టు ప్రేమ్ కుమార్, కోచ్ ఇమామ్, సలీంఖాన్, రాజ్ కుమార్, కృష్ణవేణి, సీనియర్ క్రీడాకారులు, తదితరులు అభినందనలు తెలిపారు.

## జిన్నెలగూడెంలో హెల్త్ క్యాంప్

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

జ్వరాల కేసులు ఉన్నాయన్న సమాచారం మేరకు మండల పరిధిలోని మర్కోడు గ్రామ పంచాయతీలో గల జిన్నెలగూడెం గ్రామంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి అర్వపల్లి రేవంత్ మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 30 మంది రోగులను పరీక్షించడం జరిగిందన్నారు. క్యాంప్‌కు వచ్చిన వారికి తగిన మందులు ఇచ్చి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించానన్నారు. వచ్చిన వారిలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాల లక్షణాలు రక్త పరీక్షల నమూనాలలో ఎవరికీ లేవని తేలాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీధర్, ఎల్.టీ, ఆశా వర్కర్, పాల్గొన్నారు.

**IN THE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT KOTHAGUDEM**
**O. S. NO.252 OF 2017**

Between :
Pallapu Bhanu Prakash ..Plaintiff
AND
Mateti Mallesam (died and rep by D 2 to 5) & 4 others ......Defendants

To
**D2.Mateti Prabhakar,** S/o late M. Mallesam, 56 years, employee,
**D3.Mateti Sankar,** S/o late M.Mallesam, 53 years, pvt employee,
**D4.Mateti Ashok,** S/o late M.Mallesam, 46 years, pvt. employee,
**D5.Mateti Eswari,** D/o late M.Mallesam, Adult, pvt. employee,
All R/o H.No.10-1-160,A-Power house basthi, Kothagudem town and Mandal, 507101. Bhadradri KOthagudem Dist.

**SUIT SUMMONS**

Take notice that the above named suit is filed for **SPECIFIC PERFORMANCE OF AGREEMENT OF SALE**, and it is posted for your appearance on **30-10-2023 at 10.30 a.m.** If you fail to appear you will be set exparte and the Hon'ble court will proceed as per law on the material available on record.

(By order of the Hon'ble court)
**PALIVELA GANESH BABU**
**S. RAVI**, ADVOCATES,
Kothagudem
Kothagudem Dt.17-10-2023
Cell : 9848246278

**IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL (PRINCIPAL DISTRICT JUDGE) AT KOTHAGUDEM**
**MATOP No:41 of 2023**

Between:
Chava Subba Rao .....Claim Petitioner
And
Bollam Naveen & Others ....Respondents

To,
**R1. Bollam Naveen,** S/o Rambabu, Age:35Years, Occ: Owner of the crime vehicle,
**R2. Kante Sampath Kumar,** S/o Mallesham, Age:21Years, Occ: Student,
Both are R/o: Q.No: BE-217, B.Colony, KTPS, Paloncha, Bhadradri-Kothagudem Dist.

**NOTICE**

Whereas the above named Claim petitioner filed the case for compensation, the claim petitioner filed the case due to injured in accident dated: On:08-11-2018 at 12-00 hours at Near Gowthami School; Paloncha, Bhadradri-Kothagudem(D). The claim petitioner filed for compensation against the respondents. Respondent No.1&2.-not received any summons from the Hon'ble court, the .Hon'ble courted ordered .published the publication respondent No.1&2 appear before the Hon'ble court on or before **10-11-2023** for your appearance or your appointed an advocate in the above case.
Hence you are hereby directed to appear before the above said court at **10-30A.M. on: 10-11-2023** either in person or through your counsel, failing which matter will be decided in your absence, decided exparty.

(By Order of the Court)
**B.MADHAVA RAO**
**A.APARENDRA PRASAD**
**B.DEVADAS,**
ADVOCATES
KOTHAGUDEM
Kothagudem Dt.17-10-2023

**IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT KOTHAGUDEM**
**I.A.NO. 4 OF 2023 In**
**UN.NO. A.S OF 2023**

Between:
Poloju Satyanarayana Chary ....Appellant / Defendant No.11
AND
Jadala Chandrmouli and others ...Respondents

**NOTICE IN THE DELAY CONDONATION PETITION**

To
R1. Jadala Chandramouli,S/o Lakshmiah Age: 51years, Occ: Business, R/o Kothagudem, presently residing at Sarapaka Village of Burgampahad Mandal Bhadradri Kothagudem District.
R2 Poloju Saraswathi (DIED)
R3 Poloju Lakshminarasimha Chari (DIED)
R4.Poloju Nagarjuna Chari (DIED)
R5.P. Shankara Chari, S/o Late Narasiah, Age: 44 years, R/o H.No 4-61, Lakshmi devipalli, Kothagudem, Bhadradri kothagudem District.
R6 P.Jagadeeshwara Chari, S/o Late Narasaiah, R/o H.No.5-1-33, Coolie line, Kothgudem Khammam District.
R7 Poloju Sudha Rani, W/o. Late Nagarjuna Chari, Age: about 41 years,
R8 T.Lavanya, D/o. Late Nagarjuna Chari, Age: about 23 years,
R9 P.Lakshminarayana Chari, S/o Late Nagarjuna Chari,
R10 Poloju Gayathri, D/o Late Nagarjuna Chari, Age: about 19 years,
R11 Poloju Premalatha, W/o Late Lakshminarasimha Chari,
R12 P. Chandrakala, D/o Late Lakshminarasimha Chari,
R13 S.Yashoda Devi, D/o Late Narasimha Chari, Age: about 28 years,
R14 P.Shakuntala Devi, D/0 Lakshminarayana Chari, Age: about 26 years, (D7 to D14 R/o H.No 4-61, Lakshmi devipalli, B.Kothagudem District)
....Respondents / Defendants

Take notice that the above named Appeal suit which is filed against the Judgment and decree dated 01-04-2021, passed in OS No: 395 of 2007, on the file of Additional Senior Civil Judge at Kothagudem along with the above named I.A.4 OF 2023 to condone the delay of 25 days in filing the said Appeal Suit, and it is posted for your appearance on **09-11-2023 at 10.30 a.m.** If you fail to appear you will be set exparte and the Hon'ble court will proceed as per law on the material available on record.

(By order of the Hon'ble court)
**PALIVELA GANESH BABU**
**S. RAVI**, ADVOCATES,
Kothagudem
Kothagudem Dt.17-10-2023
Cell : 9848246278

## లాభాల వాటా వెంటనే చెల్లించాలి

- ఎలక్షన్ కమిషనర్‌కు వినతి



**నవతెలంగాణ-మణుగూరు**

ఎలక్షన్ కోడ్ పేరుతో ఆపివేసిన సింగరేణి లాభాల వాటా పంపిణీ వెంటనే చేపట్టాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ మంగళవారం హైదరాబాదులోఎన్నికల సంఘం అధికారికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2023 అక్టోబర్ 16న ఎలక్షన్ కోడ్ పేరుతో ఆపివేసిన 32 శాతం సింగరేణి లాభాల వాటా పంపిణీ వెంటనే చేపట్టాలని అన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటన కంటే ముందే లాభాల వాటా ప్రకటన జరిగిపోయిందని అన్నారు. అయినప్పటికీ ఎన్నికల కోడ్ పేరుతో చెల్లించవలసిన లాభాల వాటా చెల్లింపును నిలిపివేయడం వేయడం శోచనీయమని అన్నారు.

## దసరా పండుగకు ముందే లాభాల వాటా

- టీబీజీకేఎస్ సిటిజన్ ఉపాధ్యక్షులు రంగనాథ్



**నవతెలంగాణ-ఇల్లందు**

సీఎం ప్రకటించిన 32శాతం లాభాల వాటా 16నే సింగరేణి కార్మికులకు చెల్లించాల్సి ఉందని, కానీ ఎలక్షన్ కోడ్ కారణంగా సింగరేణి సంస్థ ఈ చెల్లింపుని నిలుపుదల చేసిందని టీబీజీకేఎస్ సిటిజన్ ఉపాధ్యక్షులు రంగనాథ్ అన్నారు. దసరా పండుగకు ముందే లాభాల వాటా రానుందని తెలిపారు. ఈ విషయమై టీబీజీకేఎస్ అధ్యక్షులు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పలు దఫాలుగా యాజమాన్యంతో చర్చించడం ఈసీకి అవసరమైన వివరాలు అందజేసినట్టు తెలిపారు. దసరా లోపే ఈ డబ్బులు కార్మికుల బ్యాంక్ అకౌంట్‌లో జమచేస్తారని రంగనాథ్ పేర్కొన్నారు.



# చెరువు ఆక్రమణ దారుడి పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

## చెరువు హద్దులు చెరిపి మొత్తం ఆక్రమించే ప్రయత్నం

- నిబంధనలను తుంగలో తొక్కి దొడ్డిదారిన పట్టేదారు పాస్‌పుస్తకాలు
- కక్కుర్తిపడి పట్టా ఇచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య డిమాండ్



**నవతెలంగాణ-పాల్వంచ**

పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంట చెరువును ఆక్రమించుకున్న చంద్రా వెంకటేశ్వర్లుపై తక్షణమే కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రగుంటలో పార్టీ పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి చెరువు హద్దులను పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ తెలంగాణ ఉద్యమకారుడి అవతారం ఎత్తిన చంద్రా వెంకటేశ్వర్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టచెప్పి ఏకంగా చెరువునే కబ్జా చేసి అడ్డదారిలో పాస్ పుస్తకం పొంది, గ్రామస్తులనే చెరువులోకి రాకుండా బెదిరింపులకు పాల్పడుతూ అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ చెరువు 75 సంవత్సరాల క్రితం సీతరాం సేట్ జమలాపురం గోపాలరావు అనే వ్యక్తులు వారి వ్యవసాయ అవసరాల నిమిత్తం 16 ఎకరాల్లో చెరువును ఆనాడు ఏర్పాటు చేశారన్నారు. కాలక్రమేనా ఆ చెరువు కింద ఉన్న భూములను సీతరాంసేట్ బంజారు (ఎర్రగుంట రైతులు) కొనుగోలు చేశారని అన్నారు. ఇంటిస్థలాలు కూడా వారి వద్దనే కొనుగోలు చేసి ఊరును ఏర్పాటు చేసుకుని ఊరి పేరును కూడా సీతరాంసేట్ బంజారు కాలక్రమేనా ఆ చెరువు నీటిరంగు ఆధారం చేసుకుని ఎర్రగుంట అని పేరుగాంచిందని అన్నారు. ఈ చెరువు ద్వారా గ్రామంలోని పాడి రైతులు వ్యవసాయం చేస్తూ జీవనాధారం పొందుతున్నారు. అన్నింటికీ ఈ చెరువే ఆధారంగా ఉందని చెప్పారు. ఆలాంటి చెరువును తెలంగాణ ఉద్యమం పేరుమీద ఉద్యమకారుడి అవతారం ఎత్తిన చంద్రా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి సీతరాంసేట్ మనుషులను ఆ భూమి వారసులుగా చూపించి రెవెన్యూ అధికారులను ఆమ్యామ్యాలకు లొంగదీసుకుని ఉద్యమం పేరుతో బెధిరించి పట్టేదారు పాస్ పుస్తకాలు పొందారని అన్నారు. 2015 నుండి ఆ చెరువలో పంట వేయడం ప్రారంభించిన ఆయన దానిని గ్రామస్తులు అడ్డుకోగా నేను మావోయిస్టునని, చంపుతానని బెదిరింపులకు పాల్పడుతూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి తెలుగుదేశం హయాంలో రెండుసారు పనికి ఆహారపథకం కింద పూడిక తీయించడం జరిగిందని, ఇరిగేషన్ రికార్డులో ఉన్నాయని అన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం చెరువుకు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పూడిక తీతకు రూ.20 లక్షలు మంజూరు కాగా అది పట్టా భూమి అని చూపించి ఆనాటి ఎమ్మెల్యేతో వాటిని రద్దు చేయించారని అన్నారు. దుర్మార్గంగా చెరువు కట్టవరకు పెన్సింగ్ వేసి పాడి రైతుల పశువులను కూడా అడ్డుకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెన్సింగ్‌ను కూల్చామని చెప్పారు. చెరువు అలుగు నాశనం చేసి నీరు నిల్వకుండా చేసి దిగువన ఉన్న 150 ఎకరాల పంట ఎండిపోయేటట్లు దుర్మార్గం చేశారని అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో అనేకసార్లు సంబంధిత అధికారులను కలిసి విన్నవించడం జరిగిందని, అప్పటి కలెక్టర్ అనుదీప్ పట్టాలు రద్దు చేయమని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు.

ఇటు ఇరిగేషన్ అధికారులు హద్దులు పెడతామని చెప్పి ఏర్పాటు చేయకపోవడం కబ్జాదారుడికి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. అడ్డుకుంటున్న రైతులను కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కబ్జాదారిపై క్రమినల్ చర్యలు తీసుకుని అక్రమ పట్టాలు రద్దు చేసి వాటిపై పొందిన రైతుబంధు, రోడ్డు విస్తరణ పనుల ద్వారా భూమి కోల్పోయామని పొందిన డబ్బులు మొత్తం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో గ్రామపెద్దలు వై.సాంబశివరావు, జివి కృష్ణారావు, నాగభూషణం, ఎం.సత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, సీపీఐ(ఎం) పట్టన కమిటీ సభ్యులు ఎస్‌కె నిరంజన్, తులసీరాం, ఎస్‌కె రహీం, బి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## పర్ణశాల గ్రామస్తుడికి అరుదైన గౌరవం

- ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ (పీహెచ్‌డీ)



**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

మండలంలోని పర్ణశాల గ్రామానికి చెందిన ముక్కెర రామ్మోహన్ రావుకు అరుదైన గౌరవం దక్కింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అర్థశాస్త్ర విభాగంలో డాక్టరేట్ (పీహెచ్డీ) లభించింది. "వరంగల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్‌డీ) మహిళలలో ఉద్యమిత్వం-ఒక పరిశీలన" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో పీహెచ్డీ చేశారు. రామ్మోహన్ రావు పాఠశాల విద్యను పర్ణశాలలో అభ్యసించగా, ఇంటర్, డిగ్రీ, భద్రాచలం ప్రభుత్వ కళాశాలలో అభ్యసించారు. ఎంఏబీ ఈడి, ఎల్ఎల్‌బీ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో అభ్యసించారు. రామ్మోహన్ రావు ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తికి అరుదైన డాక్టరేట్ లభించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ టికెట్ నాకే

- విలేకరుల సమావేశంలో సీనియర్ నేత స్రవంతి



**నవతెలంగాణ-ఇల్లందు**

నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నేతగా అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని భూక్య స్రవంతి అన్నారు. పట్టణంలో ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తరతరాకులుగా కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు పాటుపడుతూ, ముందుకు సాగుతున్నానని అన్నారు. 2018 అసెంబ్లీ ముందస్తు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తూ అప్లై చేయగా టికెట్ దక్కలేదని అన్నారు. అప్పటినుంచి ఈరోజు వరకు ప్రజలతో మమేకమై వ్యాపార పరంగా, రాజకీయంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి అప్లై చేశానని, తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ నాకే వస్తుందని ఆశాభావం వ్యక్తం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించవలసిందిగా కోరారు.

## దుర్గా దేవిని దర్శించుకున్న హరిప్రియ

- ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



**నవతెలంగాణ-ఇల్లందు**

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు దేశవ్యాప్తంగా నిర్వహించుకునే శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగాలోని స్థానిక జెకె కాలనీ వద్ద యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండవం నందు మంగళవారం ఎమ్మెల్యే హరిప్రియ హాజరై అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ జగన్మాత శ్రీ దుర్గా దేవి ఆశీస్సులు ఇల్లెందు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండి ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దుర్గా మాత అమ్మవారి ప్రతిమ నిమిత్తం శ్రీ దుర్గా దేవి మండపం వారికి రూ.30 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దిండిగల రాజేందర్, కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైతులకు రుణమాఫీ



**నవతెలంగాణ-దమ్మపేట**

విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) నందు మొత్తం 3353 సభ్యులు గాను 591 మంది సభ్యులకు రూ. 16276613 రుణ మాఫీ వచ్చిందని ఎస్ఎస్‌సీఎస్ అధ్యక్షులు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు, ఆయిల్ పామ్ అడ్వైజరీ కమిటీ బోర్డ్ మెంబర్ రావు జోగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా రైతులు తమ భూమి పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ కార్యాలయంలో సమర్పించి రుణమాఫీ తిరిగి పొందగలని తెలిపారు. అలాగే సొసైటీ నందు రైతులకు అవసరమైన ఎరువులు యూరియా, పొటాష్, 2828, కంపోస్ట్ ఎరువు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మ వారు

**నవతెలంగాణ-చంద్రుగొండ**

మండల కేంద్రమైన చంద్రుగొండలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కోదుమూరు సత్యనారాయణ, కృష్ణవేణి దంపతులు పీటల మీద కూర్చొని పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి వస్త్రాలు బహుకరించినారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### శ్రీ షిరిడి సాయిబాబా మందిర 21వ వార్షికోత్సవ వేడుకలు

**నవతెలంగాణ-జూలూరుపాడు**

మండల పరిధిలోని వెంగన్నపాలెం గ్రామం, దత్త నగర్లో మంగళవారం శ్రీ షిరిడి సాయిబాబా మందిరం 21వ వార్షికోత్సవ వేడుకలను ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయినాధునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుండి ప్రజా పంథాలో చేరిక

**నవతెలంగాణ-గుండాల**

గుండాల మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మోకాళ్ళ ఆజాద్ మంగళవారం న్యూ డెమోక్రసీ పార్టీ వీడి సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆజాద్ మాట్లాడుతూ.. ప్రజాపంథా విధానాలు నచ్చి పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి కొమరం శాంతయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈసం శంకర్, అజయ్, మండల నాయకులు ఈసం చంద్రయ్య, రాజు, సనప కుమార్, జగన్, కృష్ణ. పీవైఎల్ రాష్ట్ర నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

### బతుకమ్మ సంబరాలు

**నవతెలంగాణ-చంద్రుగొండ**

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గొడామ్స్‌లో కార్మిక శాఖ నాకు (ఎన్‌పిసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలందరూ కులమ తాలకతీతంగా పూలను సేకరించి బతుకమ్మలను పేర్చారు. అనంతరం మహిళలందరూ బతుకమ్మల వద్ద ఆడి పాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుట్టు మిషన్ శిక్షణ అధికారి బేబీ మాట్లాడారు.

## అంగన్వాడీ సమ్మెతో ప్రభుత్వ మెడలు వంచగలిగాం

**అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి**






**నవతెలంగాణ-కొత్తగూడెం**

రాష్ట వ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగిరాని స్థితిలో అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని, ఈ సమ్మెతో అప్రజాస్వామికంగా ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ మెడలు వంచగలిగామని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు ఈసం వెంకటమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వ విధానమే యూనియన్‌లను గుర్తించకుండా, సమ్మెలో ఉన్న యూనియన్‌లను చర్చలకు పిలవకుండా అప్రజాస్వామికంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత అనేక సంవత్సరాలుగా అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద భీమా, పీయఫ్ ,ఈయస్ఐ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధనకు ప్రభుత్వానికి అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చి, ప్రదర్శనలు చేసినా ప్రభుత్వం స్పందించ లేదని, అనివార్య పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్ళామని తెలిపారు. ప్రభుత్వమే సమ్మెలోకి అంగన్వాడీ ఉద్యోగులను నెట్టిందని జయలక్ష్మి తెలిపారు. అంగన్వాడి సమ్మెలో పెట్టిన డిమాండ్‌లను చర్చలకు పిలిచి పరిష్కారం చేయకపోగా, ప్రభుత్వం, మంత్రులు దేశంలో ఏ రాష్ట్రంలో లేని వేతనాలు తెలంగాణాలో ఉన్నాయని, అనేక సౌకర్యాలను ఇస్తున్నామని, తప్పుడు ప్రచారాలు చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో అంగన్వాడీ సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు లబ్ది దారులు, ప్రజలు అండగా నిలబడటమే కాక, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగల గొట్టే ప్రయత్నం చేసిన అధికారులను అడ్డుకున్నారన్నారు. సమ్మె విచ్ఛిన్నం కోసం ప్రభుత్వం తన మోచేతి నీళ్ళు తాగే సంఘాలను దగ్గరకు తీసి ఎదురుదాడి చేసే ప్రయత్నాలు చేశారన్నారు. మంత్రులు హరీష్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు మంత్రులు కేటీఆర్‌తో సహా అనేక మంది జిల్లాల పర్యటనలకు వెళ్తే అంగన్వాడీ ఉద్యోగులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారని అన్నారు. గత్యంతరం లేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు హరీష్ రావు, సత్యవతి రాథోడ్‌లు యూనియన్‌ని చర్చలకు పిలిచారన్నారు. ఈ చర్చల్లో పీఆర్సీలో వేతనం ఎంత పెంచాలో జరిగే నిర్ణయానికి ముందు మధ్యంతర భృతిని 5 శాతం ఇస్తామని, చర్చల నాటికే టీచర్‌కి ఒక లక్ష, ఆయాకి రూ.50 వేలు జీఓ ఇస్తే, ఆ జీఓని సవరణ చేస్తూ టీచర్‌కి రెండు లక్షలు, ఆయాకి లక్ష అంగీకరించారని తెలిపారు. వేసవి సెలవులు ఇస్తామని, ప్రమాద బీమా రూ.2 లక్షల సౌకర్యం, మినీ టీచర్‌ని మెయిన్ టీచర్‌గా గుర్తిస్తామని, ప్రతి నెలా 14వ తేదీకి వేతనాలు ఇస్తామని, ఖర్చులు రూ.20 వేలు సాధించుకున్నామని జయలక్ష్మి అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని, మ్యానిఫెస్టోలో పెడతామని హామీ ఇచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమ్మె ఒప్పందాలను అమలు చేసి తీరాల్సిందే అన్నారు. సమ్మె ఒప్పందాలు అమలు చేయకపోతే ఎన్నికల అనంతరం మరో పోరాటానికి సిద్ధం కావాలని జయలక్ష్మి పిలపు నిచ్చారు. ఈ సమావేశంలో సీఐటియూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ, జిల్లా కోశాధికారి వెంకటరమణ, సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ జయశీల, వీరభద్రమ్మ, హేమలత, శకుంతల, మరియ, రాధ, రాజ్యలక్ష్మి, కళావతి, సరస్వతి, ఈశ్వరి, ఫాతిమా, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.



## 19న కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం

- మండల అధ్యక్షుడు దారం గోవిందరెడ్డి

**నవతెలంగాణ-చంద్రుగొండ**

ఈ నెల 19వ తేదీన జరగబోయే కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశానికి మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దారం గోవిందరెడ్డి, పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన లాక్ష్మా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 14 గ్రామపంచాయతీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ బాబు, మండల నాయకులు మాలోత్ బోజ్యా నాయక్, తుమ్మలపల్లి సురేష్, పొన్నెబోయిన బిక్షమయ్య, గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్ రావు, నల్లమోతు రమణా, సారేపల్లి శేఖర్, మద్దుకూరు సర్పంచ్ పదం వినోద్, సంకా కృపాకర్, అంతటి రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, రెడ్డిపోగు సురేష్, చాపలమడుగు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

### గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చిన విజయ దుర్గ అమ్మవారు



**నవతెలంగాణ-దమ్మపేట**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడో రోజు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన గణేష్ పాడు శ్రీ విజయ దుర్గ అమ్మవారు. మంగళవారం ఆలయ నిర్మాణ దాతలు, దిశా కమిటీ సభ్యులు శ్రీ గారపాటి సూర్యనారాయణ, అనురాధ దంపతులు భక్తుల సౌకర్యార్థం కుంకుమ పూజలు చేసుకొనుటకు ప్లేట్లు వితరణ చేశారు. ఆలయ పురోహితులు సింహాద్రి నాగేశ్వరరావు, కేతిముక్కల పవన్ శర్మ,తేజ, మారుతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు హెూమాలు నిర్వహించారు. భవాని మాలదారులకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కంగాల వెంకటేష్, యూత్ మండల అధ్యక్షులు కోడి చంటి అన్నారు. మంగళవారం ములకనపల్లి గ్రామం, కొత్త గుంపు గ్రామంలో ఉన్న ఆదివాసీల దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారెంటీ కార్డులను పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంగాల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడి చంటి, నాయకులు సోడి సందేశ్వరరావు, సున్నం భద్రం రాజ్, కోండ్రు దుర్గారావు, మల్లేష్, రామ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

### మనోవేదనతో గిరిజన మహిళ మృతి

**నవతెలంగాణ - ఆళ్ళపల్లి**

కొడుకు చనిపోయాడనే మనోవేదనతో ఓ గిరిజన మహిళ మృతి చెందిన సంఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణగూడెం గ్రామానికి చెందిన బూడిద కోరం విజయ (42) నలుగురి సంతానంలో చిన్నవాడు విష్ణు గత ఏడాది సైకిల్ ప్రమాదానికి గురై హైదరాబాద్ లో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాటి నుండి తల్లి విజయ కొడుకు చనిపోయాడనే మనోవేదనకు గురై అనారోగ్యానికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దాంతో భర్త పెంటయ్య, ముగ్గురు కుమార్తెలు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలి అంత్యక్రియలు చేయడానికి సైతం ఇంట్లో డబ్బులు లేని దీనస్థితిలో ఉన్న ఈ నిరుపేద కుటుంబం ఎవరైనా ఆపన్నహస్తం అందిస్తారని ఆశగా ఎదురుచూస్తోంది.

## కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా బాషా

**నవతెలంగాణ-పెనుబల్లి**

పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ భాషా నియమితులయ్యారని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీమ్ పథకాలను పెనుబల్లి మండలంలోని గడపగడపకు చేరేలా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించేందుకు అలుపెరగని పోరాటం చేస్తానని షేక్ భాషా చెప్పారు. తనపై నమ్మకంతో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కి ధన్యవాదాలు తెలిపారు.

## 22న షటిల్ బ్యాట్మెంటన్ పోటీలు

**నవతెలంగాణ-కల్లూరు**

ఈ నెల 22న మండల స్థాయి షటిల్ బ్యాట్మెంటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పసుపులేటి వీర రాఘవయ్య తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియం నందు జరిగే మండల స్థాయి పోటీలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు షటిల్ బ్యాట్మెంటన్ పోటీలకు అర్హులు కావున తల్లిదండ్రులు అందరూ కూడాను తమ తమ పిల్లల్ని సంసిద్ధులను చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఇతర మండలాల్లో చదువుతున్న వారు కూడా అర్హులే అన్నారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న వారికి మాత్రమే ఈ పోటీలు అన్నారు.

## కార్మికుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**



కార్మికుల డిమాండ్లను అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో కార్మికుల సత్తా చూపెడతామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ళపల్లి మోహన్ రావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం స్కీం వర్కర్ల జనరల్ బాడీ సమావేశం జలగం నగర్ లో జానమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మోహన్ రావు మాట్లాడుతూ 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ జీవోలను సవరించడం, విడుదలైన ఐదు జీవోలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం నెలకు 26 వేలు అమలు చేయడం లాంటి విషయాలను అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖలు,సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పర్మనెంట్ పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో కార్మికులు తగు రీతిలో బుద్ధి చెప్తారన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీలక్ష్మి, భాగ్య, గాదెమ్మ జయమ్మకరుణ, రాధమ్మ,అరుణ, స్వరూప, రమాదేవి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న

**నవతెలంగాణ-మధిర**

మధిర మెయిన్ రోడ్ లోని వినాయక గుడి వద్ద అన్నదాన దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మదిర వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాలలో కల్లా అన్నదానం మిన్న అని అన్నదాతలను అభినందించారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు, గృహప్రవేశం సందర్భంగా వినాయకుని గుడి వద్ద అన్నదాన కార్యక్రమంనకు ఆర్థిక సహకారం అందించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, ఎర్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

## గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు

**నవతెలంగాణ-భద్రాచలం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం తరలి వచ్చిన భక్తులు, స్థానిక భక్తులు గజలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్స్ పంపిణీ

**- స్వచ్ఛమైన నీటిని అందించడమే సాక్ష్యం లక్ష్యం**

**నవతెలంగాణ-చండ్రుగొండ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాక్ష్యం అంగన్వాడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసిడిఎస్ చండ్రుగొండ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉత్తమ అంగన్వాడీ కేంద్రాలుగా గుర్తింపు పొందిన 31 అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్స్ ను అంగన్వాడీ టీచర్లకు సీడీపీఓ నిర్మల జ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలు పౌష్టికాహార కేంద్రాలుగా తయారయ్యాయని, వాటితోపాటు గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, సుద్దమైన నీటిని అందించాలనే లక్ష్యంతో సాక్ష్యం అంగన్వాడీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్స్ ను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు గంగాజలం, జి అరుణ, కే రాణి, ఎం.లక్ష్మి, డి.శకుంతల, నాగమణి, అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

## ప్రవళిక ఆత్మహత్యకు గత రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**నవతెలంగాణ - గుండాల**

రాష్ట్ర రాజధానిలో ఇటీవల జరిగిన ప్రవళిక ఆత్మహత్యకు గత రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని గుండాల మండల ప్రగతిశీల యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సనప కుమార్, పూనెం మంగయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుటుంబానికి గత పాలకులు వెంటనే రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేసిన అధికారులు


**నవతెలంగాణ-బోనకల్**

మండల కేంద్రంలో స్థానిక శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర సరిహద్దు ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్ పోస్టును తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఎంపీడీవో బయారపు అశోక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆంధ్ర తెలంగాణ సరిహద్దు కావటంతో ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వారు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసిన తర్వాతనే విడిచి పెట్టాలని చెక్ పోస్ట్ సిబ్బందికి వారు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి నగదును ఎవరు తీసుకెళ్లిన తప్పనిసరిగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి మండల పరిషత్ ఏఈ మొండితోక నవీన్ కుమార్, బోనకల్ పంచాయతీ కార్యదర్శి దామల్ల కిరణ్, ఏఎస్ఐ దారెల్లి బాలస్వామి, చెక్ పోస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మద్దేడు అడవుల్లో ఎన్‌కౌంటర్

- 8 లక్షల రివార్డు గల మావోయిస్టు మృతి

**నవతెలంగాణ-చర్ల**



మద్దెడు అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 లక్షల రివార్డు గల మావోయిస్టు డీవీసీఎం నగేష్ మృతి చెందాడు. నగేష్ మద్దెడు ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిస్తున్నారు. కాల్పులు జరిగిన అటవీ ప్రాంతం నుండి పోలీసులు మృతదేహంతో సహా ఏకే47 స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలకు ముందు పోలీసులు పెద్ద విజయం సాధించారు. ఎన్నికల సమయంలో నక్సలైట్ కమాండర్ భారీ ఏర్పాట్లు ప్లాన్ చేశారు. డిఆర్ బస్తర్ ఫైటర్, ఎస్‌టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ 170 బెటాలియన్ సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు.

## పెళ్లిళ్ల పేరుతో యువకులను మోసగిస్తున్న మహిళలు అరెస్ట్

**నవతెలంగాణ-చండ్రుగొండ**

పెళ్లిళ్ల పేరుతో యువకులను మోసగిస్తున్న మహిళలను అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు మంగళవారం ఎస్ఐ మాచినేని రవి చెప్పారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఏలూరు జిల్లా పెద్దపాడు మండలం తాళ్లముడి గ్రామానికి చెందిన లక్ష్మీ శ్రావణి, తిరువూరు మండలం తంగెళ్లబీడుకు చెందిన రేణుకలు కలిసి పెళ్లిళ్ల పేరుతో యువకులను మోసగిస్తు రూ.లక్షలు దోచుకుంటున్న ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. రేణుకా మ్యారేజిబ్యూరో, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది. లక్ష్మీ శ్రావణికి 2020లో వివాహం జరిగి భర్తను వదిలేసి చెడు వ్యసనాలకు అలవాటు పడింది. ఇరువురు కల్సి పెళ్లి కాని యువకులను మోసం చేయటానికి అలవాటు పడ్డారు. రేణుకా పెళ్లి కాని యువకులకు లక్ష్మీ శ్రావణిని పెళ్లికాని యువతిలా చూపిస్తుంది. కల్లూరులో యువకునికి పెళ్లి చేస్తామని లక్ష్మీశ్రావణిని చూపించి రూ. 3లక్షలు, కొత్తూరులో రూ.2లక్షలు, చండ్రుగొండ మండలం గానుగపాడులో రూ. ఐదు లక్షలకు వివాహం చేస్తామని వారి వద్ద నుంచి రూ. 4లక్షలు తీసుకొని గత నెల 7న వివాహం చేశారు. ప్లాన్ ప్రకారం.. కుటుంబసభ్యులను కొట్టి పారిపోయారు. మంగళవారం వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనబడగా పట్టుకొని విచారించగా విషయాలు బయటపడ్డాయన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు తెలిపారు.

# అంతరాష్ట్ర చెక్ పోస్ట్‌తో సామాన్యుల ఇబ్బందులు

- పట్టుబడుతున్న సామాన్యుల డబ్బు
- వివరిస్తున్న ఇస్తున్న పట్టించుకొని పోలీసులు

**నవతెలంగాణ - బోనకల్**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంగా ఉన్న బోనకల్లు వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర సరిహద్దు ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్ పోస్ట్ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర సరిహద్దు ఇంటిగ్రేటెడ్ పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేకంగా పోలీస్ బృందాలు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ వాహనాల తనిఖీ సందర్భంగా రాజకీయ పార్టీలకు సంబంధించి ఎటువంటి నగదు మాత్రం నేటి వరకు దొరకలేదు. కాని సామాన్య ప్రజలకు సంబంధించిన నగదు మాత్రం సుమారు రూ. 6 లక్షల వరకు చెక్ పోస్ట్ అధికారులు నేటి వరకు పట్టుకున్నారు. మొదటి రోజు మూడు లక్షలు సోమవారం సుమారు రూ. 2.88 లక్షలు చెక్ పోస్ట్ అధికారులు పట్టుకున్నారు. మొదటిరోజు పట్టుకున్న 3 లక్షల రూపాయలలో ముష్టికుంట్ల సర్పంచ్ భర్త షేక్ హుస్సేన్ సాహెబ్ గ్రామపంచాయతీ గుమ్మస్తా బోయినపల్లి సతీష్ కు ఇవ్వవలసిన డబ్బులకు సంబంధించి చెక్ ఇచ్చాడు. దాంతోపాటు తనకు కావలసిన కొంత నగదు ను కూడా కలిపి రాశాడు. బోయనపల్లి సతీష్ బ్యాంకు నుంచి 3 లక్షల రూపాయలు తీసుకొని ముష్టికుంట్ల మోటార్ సైకిల్ పై బయలుదేరాడు. అదే రాష్ట్ర ప్రభుత్వం బీసీ బందు కింద చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన దశరథకు లక్ష రూపాయలు చెక్కు ఇచ్చింది. ఆ చెక్కుకు సంబంధించి ఎస్బిఐ బ్యాంకులో నగదు తీసుకొని మోటార్ సైకిల్ మీద బయలుదేరాడు. అదే సమయంలో చెక్ పోస్ట్ వద్ద పోలీసు బృందం వాహనాలను తనిఖీ చేస్తుంది. ఈ తనిఖీలలో పోలీసులు వారి నగదును పట్టుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలు చెబుతున్న పోలీసు బృందం మాత్రం పట్టించుకోలేదని, ఇన్కమ్ టాక్స్ అధికారులకు అప్పగిస్తామని అక్కడ ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించి నగదు తెచ్చుకోవాలని తనకు సూచించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా సోమవారం కవిత పిల్లింగ్ స్టేషన్ యజమాని చేబ్రోలు రవికుమార్ పెట్రోల్ అమ్మకాలకు సంబంధించిన నగదును తీసుకొని చెక్ పోస్ట్ సమీపంలో గల ఎస్బిఐ బ్యాంకుకు తన మోటార్ సైకిల్ పై వెళ్తున్నాడు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు వాహనాల తనిఖీల చేస్తుండగా చేబ్రోలు రవికుమార్ వద్ద రూ 2.88 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించిన బ్యాంకు ఓచర్, చెక్ బుక్, పెట్రోల్ అమ్మకాలకు సంబంధించిన వివరాలను చూపిస్తున్న పోలీస్ అధికారులు పట్టించుకోలేదని రవికుమార్ తెలిపాడు. పట్టుకున్న నగదును ఖమ్మం ఇన్కమ్ టాక్స్ అధికారులకు అప్పగిస్తామని అక్కడకు వెళ్లి ఈ నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించి తెచ్చుకోవాలని సూచించారని తెలిపాడు. దీంతో రవికుమార్ చేసేది ఏమీ లేక వెళ్లిపోయాడు. పట్టుకున్న సుమారు 6 లక్షల రూపాయల కూడా రాజకీయ నాయకులకు సంబంధించిన నగదు కాకపోవటం విశేషం. అంతరాష్ట్ర సరిహద్దు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేసింది ఎన్నికల కోసమేనని, సామాన్య ప్రజల రోజువారి కార్యక్రమాల నగదును పట్టుకోవడం కోసం కాదని మండల ప్రజలు అంటున్నారు.




ఇప్పటికైనా చెక్ పోస్ట్ అధికారులు బ్యాంకు నుంచి తమ సొంత ఎకౌంటు నుంచి నగదు తెచ్చుకునే వారిని, తమ సొంత నగదును బ్యాంకులో వేసుకునే వారి నుంచి ఎన్నికల పేరుతో నగదు స్వాధీనం చేసుకునే ముందు పోలీస్ చెక్ పోస్ట్ అధికారులు వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని బ్యాంకు ఖాతాదారులు కోరుతున్నారు. బ్యాంకు దగ్గరకు వెళ్లి తాము సొంత డబ్బులు కూడా తెచ్చుకునే పరిస్థితి లేకుండా చేయటం వలన ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నమ్మకం లేనప్పుడే గ్యారంటీలు

- రాజ్యసభ సభ్యులు ఎంపీ రవిచంద్ర
- ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను ప్రజలు నమ్మరు
- వెంకట్రావు పగటి కలల్ని కేసీఆర్ భగ్నం చేశారు
- వనమా అంటే కేసీఆర్‌కు అభిమానం
- 5న కేసీఆర్ సభ

**నవతెలంగాణ-పాల్వంచ**

కాంగ్రెస్ పార్టీ హామీలు నమ్మకం లేని గ్యారెంటీలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. పాల్వంచలోని వనమా నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగిస్తూ మనిషి మీద, వస్తువుపై నమ్మకం లేనప్పుడే గ్యారంటీలు, వారంటీలనే మాటలు వినపడతాయని, సందర్భాలు వస్తాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు గ్యారంటీలంటూ దేశాన్ని 50ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఊదరగొడ్తున్నదని,మన భారతీయులు పడుతున్న కష్టాలు,నష్టాలన్నింటికీ ఆ పార్టీనే మూల కారణమన్నారు. బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న ఎంపీ రవిచంద్ర మంగళవారం మధ్యాహ్నం పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాసంలో ముఖ్య కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు.ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు ఇక సాగవని,డబ్బు సంచులతో వచ్చే దొంగలను తెలివైన కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు ఏ మాత్రం విశ్వసించరని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. వనమా చేతిలో ఘోరంగా ఓడిపోయిన జలగం వెంకట్రావు ఢిల్లీ, హైదరాబాద్ లలో కోర్టు చుట్టూ తిరిగి ఏదో సాధించానని గొప్పలకుపోతే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన పగటి కలల్ని వమ్ము చేశారన్నారు. వనమాను కుటుంబంతో సహా ప్రగతిభవన్ కు ఆహ్వానించి కలిసి భోజనం చేయడాన్ని గుర్తు చేస్తూ, బీసీల పట్ల కేసీఆర్ కు ఉన్న ప్రేమాభిమానాలకు ఇదే ప్రబల నిదర్శనమన్నారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన వనమా అంటే కేసీఆర్ చాలా గౌరవం ఉందని, తనకు పెద్దన్న వంటి వెంకటేశ్వరరావును భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించేందుకే ఇక్కడకు వచ్చానన్నారు. వచ్చే నెల 5న ఇక్కడ జరిగే బీఆర్ఎస్ సభకు 80వేల మందికి పైగా హాజరై విజయవంతం చేయడం ద్వారా వనమా గెలుపును ఖాయం చేసుకుందామన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్- ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, కొత్తగూడెం మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, వైస్ ఛైర్మన్ వీ.దామోదర్, బీఆర్ఎస్ ప్రముఖులు సర్దార్ పుటం పురుషోత్తం రావు, కొత్వాల శ్రీనివాస్, రాంబాబు, వాసుదేవరావు, కాసుల వెంకట్, జేవీఎస్ చౌదరి, రాజుగౌడ్, హనుమంతరావు, రజాక్, బత్తుల వీరయ్య, సోమిరెడ్డి తదితరులు ప్రసంగించారు.



## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 4న చలో ఢిల్లీ

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**

రాజ్యాంగ పరిరక్షణ కోసం, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 4న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు అన్నారు.మండలంలోని పల్లెగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టాక దళితులపై,రాజ్యాంగంపై, మైనార్టీలపై,అట్టడుగు వర్గాలపై ఏకకాలంలో దాడులు మొదలుపెట్టిందన్నారు. మనువాద సిద్ధాంతాన్ని మరోసారి ప్రవేశపెట్టడమే బిజెపి ధ్యేయం అన్నారు.అమలు కానీ ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన బీఆర్ఎస్, బిజెపి లను గద్దదించాలని పిలుపునిచ్చారు.కేరళ రాష్ట్రంలో దళితులు గౌరవప్రదంగా జీవిస్తున్నారని దీనికి కారణం సిపిఎం పార్టీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. రాబోయే రోజుల్లో వామపక్షాలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మునగాల లాల్ బాబు, రామకృష్ణ, గడ్డి కొప్పుల ఏసు, సైదమ్మ లక్ష్మయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవి అలంకారంలో అమ్మవారు

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు శ్రీ శోభకృత్ నామ సంవత్సర శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు మంగళవారం అమ్మవారు అ న్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 11.00 గంటలకు గోపూజ, అన్నపూ ర్ణా దేవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు హెూమములు అ ర్చకులు ఘనంగా నిర్వహించారు. యాగశాల నందు ఉ ప్పల మురళీమోహన్ శర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం రాత్రి 8 గంటలకు మహా నివేదన నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ అర్చకులు రాజీవ్ శర్మ వేద పండితులు, ఆలయ పర్యవేక్షకులు విజయ కుమారి, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# ఆచారాన్ని కొనసాగిద్దాం...

- దసరా ఉత్సవాలు జమ్మి, షావాలను మిషనరీ గ్రౌండ్ లేదా ఫారెస్ట్ గ్రౌండ్‌లోనే నిర్వహించాలి
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో దసరా ఉత్సవ కమిటీకి బాధ్యతలు ఇవ్వాలి : ఉత్సవ కమిటీ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మడత వెంకట్ గౌడ్
- తాసిల్దార్ కు వినతి

**నవతెలంగాణ-ఇల్లందు**

దసరా ఉత్సవాలను గత 100 సంవత్సరాల నుండి మిషనరీ గ్రౌండ్లో నిర్వహిస్తున్నామని, అనాదిగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మడత వెంకట్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీతారామ థియేటర్ వెనుక గల వ్యక్త్రా హౌస్ ప్రక్కనగల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దసరా ఉత్సవాలు అంటేనే మైసూర్‌ను తలపించే విధంగా ఉంటాయన్నారు. ఎంతో వైభవంగా ఆచార సాంప్రదాయాలను సేవలను మిషనరీ గ్రౌండ్ వద్ద జమ్మి ఏర్పాటు చేసుకొని తరతరాలుగా దసరా నిర్వహించుకుంటూ వస్తున్నామన్నారు. గత ఏడాది సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ పాలకవర్గం దసరా ఉత్సవాలు నిర్వహించిందన్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని మర్చి వేరేచోట దసరా ఉత్సవాలు నిర్వహిస్తే ఇల్లందుకు అరిష్టమని పెద్దలు తెలియజేస్తున్నారన్నారు. సింగరేణి స్కూల్ గ్రౌండ్ లో నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు తెచ్చి పెట్టవద్దన్నారు.

రావణ వదలాంటి కార్యక్రమాలు ఎక్కడైనా జరుపుకోవచ్చని కానీ జమ్మి పూజలు మాత్రం ఆచార సాంప్రదాయ ప్రకారం మిషనరీ గ్రౌండ్ లోనే నిర్వహించడం శ్రేయస్కరమన్నారు. మిషనరీ గ్రౌండ్లో వీలుకాకపోతే ఫారెస్ట్ గ్రౌండ్లో జమ్మి పూజలతో పాటు రావనవధ కార్యక్రమాలను ఏర్పాటు చేసుకునే వీలుగా మునిసిపల్ పాలకవర్గంతో పాటు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ చొరవ తీసుకొని అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎన్నికల కోడ్ను విస్మరించి దసరా ఉత్సవ స్టేజి ఎక్కినందుకు రాజకీయ నాయకుల పై కేసులు పెట్టిన సంగతిని గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉన్నందున దసరా ఉత్సవ కమిటీలకు దసరా ఉత్సవాలు నిర్వహించుకునే అనుమతిని ఇస్తే రూ 30 లక్షల ఖర్చు అయినా వెనకాడకుండా సంబరాలు నిర్వహించుకుంటామన్నారు. వేడుకలతో ఇల్లందు పేరు రాష్ట్ర మొత్తం మార్మోగుతుందన్నారు. అనంతరం స్థానిక తాసిల్దార్ కోట రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు.



## అనాథలకు అన్నదానం

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**



మండలంలోని కరుణగిరి మధర్ థెరిస్సా ఆశ్రమం నందు మంగళవారం తెలంగాణ నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ షేక్ సయ్యద్ బాషా మాట్లాడుతూ తెలంగాణ నూర్ భాషా ముస్లింలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పలు పార్టీలను కోరారు.త్వరలో దూదేకుల ఆత్మీయ సమ్మేళనం భారీ స్థాయిలో నిర్వహిస్తామని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని సంఘం సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సొందు,జిల్లా నాయకులు డాక్టర్ రహీం, జిల్లా మహిళా అధ్యక్షురాలు సకీనా బీ, రహీం భాషా, సిద్ధ, మొగలా, సైదులు,షేక్ రసూల్, సైదులు,మౌలానాపాల్గొన్నారు.

# విద్యాప్రమాణాలు పెంపునకు కృషి

**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:**

ప్రధానోపాధ్యాయులకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పిలుపు

చాలా కాలం తర్వాత పాఠశాల విద్యా రంగంలో ప్రధానోపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నూతనంగా ప్రమోషన్ పొందిన ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంపు, విద్యా ప్రమాణాల పెంపుకూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగం ప్రజల అభిమానాన్ని పొందేలా కృషి చేయాలని కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రధానోపాధ్యాయుల ఓరియంటేషన్, అభినందన సభలో నర్సిరెడ్డి మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లయితే కోర్టు కేసులు అన్నింటినీ అధిగమించి అన్ని రకాల ప్రమోషన్లు సాధించుకోవడం సాధ్యమయ్యేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్ల ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోవలసి వచ్చిందని అన్నారు. ఎస్జీటీలు, పండిట్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ ఆగిపోవటం విద్యారంగానికి నష్టదాయకమన్నారు. ఎన్ సీటీఈ నుంచి టెట్ కు మినహాయింపు తీసుకొని మిగిలిన ప్రమోషన్లు బదిలీల ప్రక్రియను ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని నర్సిరెడ్డి అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కారణంగా వాయిదా పడిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా అధికార యంత్రాంగం ఎన్నికలు అయిన వెంటనే పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నుండి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన వారికి సర్వీస్ రూల్స్, పాఠశాల నిర్వహణపై టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, కార్యదర్శి ఏ.వెంకట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.



**పాలకుల వైఖరితో ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం: కె.జంగయ్య**

ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి వేతన సవరణ తాత్కాలిక భృతి, హెల్త్ కార్డులు తదితర అంశాలను చర్చిస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించ లేదని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య తెలిపారు. పీఆర్సీ కమిటీ వేసి, ఐదు శాతం ఐఆర్ ప్రకటించి, పెండింగ్లో ఉన్న మూడు డీ.ఎ.లను విడుదల చేయకుండా, జీతాలు ఇతర బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా నష్టం కలిగిందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఎన్నికల ముందే రద్దు చేస్తారని భావించినా దానిమీద కమిటీ వేస్తామని అధికార పార్టీ ప్రకటించడం ఉద్యోగులకు నిరాశ కలిగించిందన్నారు. రాష్ట్రంలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కుబేర్ లో పెండింగ్లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేయాలని, పెండింగ్ డీ.ఎ.లని చెల్లించడంతో పాటు నెల మొదటి తేదీన జీతాలు చెల్లించేందుకు, మెరుగైన ఫిట్మెంట్ ను ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలు, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అచేతనంగా ఉన్న పరిస్థితుల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందని, ఇప్పటికైనా ఆ సంఘాలు పునరాలోచించి ఉద్యోగుల ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ, డి సి ఈ బి సెక్రెటరీ నారాయణ అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకులు చావా దుర్గ భవాని, షేక్ మహబూబ్ అలీ, పారుపల్లి నాగేశ్వరరావు, మురళీకృష్ణ, బుర్రి వెంకన్న, షేక్ షమీ, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, రాజశేఖర్, ఎన్ వీరబాబు, గీత, సుధాకర్, శ్రీకాంత్, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్, సతీష్, రోజా తదితరులు పాల్గొన్నారు.



## మా నోరు మూయించలేరు !

- విమర్శలకు భయపడుతున్న మోడీ ప్రభుత్వం
- ఎక్స్ ఖాతాల సస్పెన్షన్‌పై హెచ్ఎఫ్‌హెచ్ఆర్, ఐఏఎంసీల విమర్శ

**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఉద్యమాలు జరిపే ప్రగతిశీల హిందువుల ఉద్యమానికి, వారి మద్దతుదారులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం భయపడుతోందని హిందూస్ ఫర్ హ్యూమన్‌రైట్స్ (హెచ్ఎఫ్‌హెచ్ఆర్) పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. భారత్‌లో హెచ్ఎఫ్‌హెచ్ఆర్‌కు సంబంధించిన ఎక్స్ ఖాతాను, వారి భాగస్వామి ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ (ఐఏఎంసీ) ఖాతాను శనివారం నుంచి విత్‌హెల్డ్‌లో పెట్టారు. మోడీ ప్రభుత్వం నుండి వచ్చిన లీగల్ డిమాండ్ మేరకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. అమెరికా కేంద్రంగా ఈ రెండు స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. వాస్తవాలు మాట్లాడడం, న్యాయం కోసం నిరంతరంగా పట్టుబట్టడమనేది బీజేపీ ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని హెచ్ఎఫ్‌హెచ్ఆర్ హెచ్చరించింది. విదేశాల్లో ఆసక్తి గల భాగస్వాముల సాయంతో మోడీ ప్రభుత్వం ఇతర దేశాల్లో కూడా అణచివేత చర్యలు చేపట్టగల సమన్వయ ప్రణాళికను కలిగివుందని ఈ చర్యతో స్పష్టమైందని ఆ ప్రకటన పేర్కొంది. 2024 ఎన్నికలకు ముందు భారత్‌లో మోడీ వ్యతిరేక వాణిని అణచివేసేందుకు ఈ చర్యలు ఉద్దేశించబడ్డాయని పేర్కొంది. అయితే తామేమీ దీనిపై నోరు మూసుకుని కూర్చోబోమని, హిందూత్వపై తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

## సైద్ధాంతిక విభేదాల కారణంగానే నాపై పిటిషన్

- హైకోర్టుకు ఉదయనిధి స్టాలిన్ వెల్లడి

**చెన్నై:** సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తాను చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సైద్ధాంతిక విబేధాల కారణంగానే తనకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైందని పిటిషనర్ హిందూ మితవాద సంస్థను ఉటంకిస్తూ డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ మద్రాసు హైకోర్టుకు తెలిపారు. ఉదయనిధి తరపున సీనియర్ న్యాయవాది పి విల్సన్ కూడా మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 మతాన్ని ఆచరించే, ప్రచారం చేసే హక్కుకు హామీ ఇస్తుందనీ, నాస్తికత్వాన్ని ఆచరించే, ప్రచారం చేసే హక్కునూ ప్రజలకు ఇస్తుందని న్యాయమూర్తి జస్టిస్ అనితా సుమంత్‌కు తెలిపారు. గత నెలలో జరిగిన ఒక కార్యక్రమంలో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఉదయనిధి చేసిన ఆరోపించిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకుని ఆయన ప్రభుత్వ పదవిని నిర్వహించడాన్ని సవాలు చేస్తూ హిందూత్వ సంస్థ అయిన మున్నాని పిటిషన్ దాఖలు చేసింది.

## ఆ 25 శాతం నిధులను పొందొచ్చు

- సీపీఆర్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతి

**న్యూఢిల్లీ:** సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్(సీపీఆర్)కు ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 25 శాతం ఉపయోగించని నిధులను పొందడానికి అనుమతించింది. అలాగే సీపీఆర్ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ సస్పెన్షన్ కేసు విచారణను వచ్చే ఏడాది జనవరి 11కు షెడ్యూల్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రరి 27న కేంద్రం ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీపీఆర్ హైకోర్టును ఆశ్రయించింది. ఇది ఏకకాలంలో ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలలోని రూల్ 14 కింద ఒక దరఖాస్తును దాఖలు చేసింది. ఇది ఉపయోగించని నిధుల వినియోగాన్ని అనుమతిస్తుంది. ఈ నియమం కేంద్రం నుంచి ముందస్తు అనుమతితో ప్రకటించిన లక్ష్యాల కోసం ఉపయోగించని నిధులలో 25 శాతం వరకు ఖర్చు చేయడానికి అనుమతిస్తుంది. కాగా ఈ పిటిషన్‌ను జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ అనుమతించారు. మార్చిలో ఈ దరఖాస్తుతో కేంద్రాన్ని సీపీఆర్ సంప్రదించింది. అయితే ఆరు నెలలు దాటినాకేంద్రం నిర్ణయం తీసుకోలేదు. సస్పెన్షన్ తమ కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేసిందనీ, 80 మంది శాస్త్రవేత్తలు, ఉద్యోగులు ఆరు నెలల జీతాలు చెల్లించని కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని సీపీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది అరవింద్ పి దాతర్ కోర్టు తెలిపారు. కేంద్రం తరపున న్యాయవాది అరుణిమా ద్వివేది వాదిస్తూ సీపీఆర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాధారాల ఆధారంగా విచారణ ప్రారంభించామని తెలిపారు.

## ఏడుగురిపై సీబీఐ చార్జిషీట్

- ఇందులో ఒకరు బాలుడు కూడా
- మణిపూర్ మహిళలు నగ్నంగా ఊరేగింపుపై దర్యాప్తు సంస్థ చర్యలు

**ఇంఫాల్ :** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లోని కుకీ కమ్యూనిటీకి చెందిన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగింపు, లైంగిక దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి సీబీఐ గౌహతిలోని ప్రత్యేక కోర్టులో ఆరుగురు వ్యక్తులు, ఒక బాలనేరస్థునిపై చార్జ్ షీట్ దాఖలు చేసింది. జులైలో వైరల్‌గా మారిన ఒక వీడియో దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించిన విషయం తెలిసిందే. మే 18 న దాఖలు చేసిన పోలీసు ఫిర్యాదులో యువతి పట్టపగలు దారుణంగా సామూహిక లైంగికదాడికి గురైందనీ బాధితులు ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తటంతో సీబీఐ రంగంలోకి దిగింది. పార్లమంటులోనూ ప్రతిపక్షాలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. కాగా, నిందితులపై ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపామనీ సీబీఐ వివరించింది.

## బొగ్గు పరిశ్రమ ప్రయివేటీకరణపై నిరసన

**కొల్‌కతా :** బొగ్గు గనుల ప్రయివేటీకరణను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోల్ ఇండియా లిమిటెడ్‌లోని 37% వాటాలను ప్రభుత్వం ప్రైవేటు రంగానికి విక్రయించిందని సీఐటీయూ అనుబంధ కాలరీ మజ్దూర్ సభ ఆఫ్ ఇండియా (సీఎంఎస్ఐ) కార్యదర్శి కలీముద్దీన్ అన్సారీ విమర్శించారు. ఇప్పటికే జార్ఖండ్‌లోని శ్యామ్‌పూర్ బీ కాలనీ గనిని ప్రయివేటీకరించారని, పశ్చిమ బెంగాల్‌లోని చినాకురి-3 బొగ్గు గనిని కూడా ప్రయివేటు సంస్థలకు ధారాదత్తం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఆదాయాన్ని పంచుకునే ప్రాతిపదికన గనులను ప్రయివేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అసన్‌సాల్‌లోని రవీంద్ర భవన్‌లో జరిగిన ప్రయివేటీకరణ వ్యతిరేక సదస్సుకు అన్సారీతో పాటు వేలాది మంది బొగ్గు గని కార్మికులు హాజరయ్యారు.

## ముంబయిలో పడిపోతున్న గాలి నాణ్యత

**ముంబయి :** ముంబయిలో గాలి నాణ్యత స్థాయిలు పడిపోతున్నాయి. గత వారం ప్రారంభంలో గాలి నాణ్యత స్థాయిలు 'గుడ్ కేటగిరి'లో రికార్డయింది. అయితే ఒకవారం పాటు సగటున రోజువారీ ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరగడంతో ముంబయి నగరంలో గాలి నాణ్యతస్థాయిలు పడిపోయాయి. అయితే అక్కడ తీవ్రం కాని స్థాయిలో మోడరేట్ కేటగిరిలో గాలి నాణ్యత రికార్డయింది. కాగా, 101 నుంచి 200 మధ్యలో గాలి నాణ్యత ఉంటే.. మోడరేట్ కేటగిరిగా రికార్డు అవుతుంది. అయితే 200 దాటితే గాలి నాణ్యతాస్థాయిలు పడిపోయినట్టు లెక్క.

## పటాసుల ఫ్యాక్టరీలో పేలుళ్లు..

### 9 మంది మృతి

**చెన్నై:** తమిళనాడులో మరో ఘోర ప్రమాదం జరిగింది. విరుదునగర్ జిల్లాలోని కమ్మపట్టి గ్రామంలోగల ఓ పటాసుల కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. దాంతో ఒక్కసారిగా ఫ్యాక్టరీ నుంచి హాహాకారాలు వినిపించాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఇంతలోనే ఫ్యాక్టరీలో మరో పేలుడు సంభవించింది. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పారు. ఘటనా ప్రాంతం నుంచి ఐదు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టానికి పంపించారు. కాలిన గాయాలైన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారిలో నలుగురు మరణించారు. దాంతో మొత్తం మృతుల సంఖ్య 9కి పెరిగింది. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

# నిధులేవి సారూ...!?




- పట్టణ పేదల కోసం ఘనంగా గృహ పథకం ప్రకటన
- 60 వేల కోట్లకు అనుమతి మంజూరు
- కానీ బడ్జెటరీ కేటాయింపులు సున్నా
- ఎన్నికల ప్రయోజనం కోసమే హడావిడి ప్రకటన

**న్యూఢిల్లీ :** పట్టణ పేదల కోసం అందుబాటు ధరలో గృహ నిర్మాణ పథకాన్ని చేపడుతున్నామని నరేంద్ర మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. ఈ పథకానికి వ్యయ ఫైనాన్స్ కమిటీ (ఈఎఫ్‌సీ) ఆమోదం తెలిపిందంటూ ఈ నెల 4న దినపత్రికలలో వార్తలు ప్రచురితమయ్యాయి కూడా. ఈ పథకం కింద గృహ నిర్మాణాన్ని చేపట్టే పట్టణ పేదలకు వడ్డీ సబ్సిడీ రూపంలో రూ.60 వేల కోట్లు అందజేస్తామని ప్రభుత్వం తెలియజేసింది. ఈ పథకం ఐదు సంవత్సరాల పాటు అందుబాటులో ఉంటుంది. యాభై లక్షల రూపాయల వరకూ గృహ రుణం తీసుకున్న వారికి ఏడాదికి 3-6% వడ్డీ రాయితీ లభిస్తుంది. ఇదంతా వినసొంపుగానే ఉంది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులేవీ జరపలేదు. కాబట్టి మధ్యంతర బడ్జెట్ ఆమోదం పొందిన తర్వాత అంటే వచ్చే సంవత్సరం మార్చిలోనే ఈ పథకం అమలులోకి వస్తుంది. దీనినిబట్టి చూస్తే ఎన్నికల్లో పేదలు, మధ్యతరగతి ప్రజల ఓట్లు దండుకునేందుకే ప్రభుత్వం హడావిడిగా ఈ పథకాన్ని ప్రకటించిందని అర్థమవుతోంది. అసలు మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎన్ని గృహ నిర్మాణ పథకాలు అమలు చేసింది? వాటి పనితీరు ఎలా ఉంది? అనే విషయాలను పరిశీలిస్తే వాస్తవాలు బోధపడతాయి.

2014 జూన్ 9న పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుందాం. 'మన దేశం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి ప్రతి కుటుంబానికీ పక్కా ఇల్లు ఉంటుంది. దానికి నీరు, మరుగుదొడ్డి, 24 గంటల విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తాం'...ఇదీ రాష్ట్రపతి ప్రసంగం ద్వారా ప్రభుత్వం చెప్పిన మాటలు. ప్రజలకు అందుబాటు ధరలో గృహ వసతి కల్పించేందుకు మోడీ ప్రభుత్వం తొలిసారిగా 2015 జూన్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి అయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరిస్తుంది.

**పీఎంఏవైకి కేటాయింపులే లేవు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి (పీఎంఏవై-యు) సంబంధించిన డాష్‌బోర్డులో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రభుత్వం 118.90 లక్షల ఇళ్ల మంజూరు చేసింది. వీటిలో 113.34 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 77.16 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో 25.04 లక్షల ఇళ్లకు వడ్డీ సబ్సిడీ లభించింది. అందుకోసం ప్రభుత్వం రూ.58,868 కోట్లు చెల్లించింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 2023-24 సంవత్సరం బడ్జెట్‌లో వడ్డీ సబ్సిడీ పద్దే కన్పించలేదు.

**వడ్డీ సబ్సిడీని ఎందుకు పెంచారు?**

నూతన పథకం కింద ప్రభుత్వం వడ్డీ సబ్సిడీని పెంచడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. గృహ నిర్మాణ సామగ్రికి అయ్యే వ్యయం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. దానికి అనుగుణంగానే తీసుకునే రుణం కూడా పెరుగుతోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం వడ్డీ సబ్సిడీని కూడా పెంచిందని అర్థమవుతోంది. ప్రభుత్వం నుండి వడ్డీ సబ్సిడీ ఎంత ఎక్కువ వస్తే మధ్య తరగతి ప్రజలకు అంత ఊరట లభిస్తుంది.

**పీఎం కిసాన్ పథకం తరహాలోనా?**

2019లో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం కిసాన్ పథకం గుర్తుందా? 2019-20 మధ్యంతర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించారు. విడతల వారీగా నగదు చెల్లింపులు జరిపారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటరు ఈవీఎంపై బటన్ నొక్కే సమయానికి అతని బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేలా చూశారు. ఇప్పుడు ఈ కొత్త పథకం కింద ఎంపికయ్యే లబ్దిదారులకు కూడా అలాగే ఓటింగ్ సమయానికి బ్యాంక్ ఖాతాలలో సొమ్ము జమ అయ్యేలా చూస్తారేమోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఎన్నికలలోగా అనుమానమే**

అయితే లోక్‌సభ ఎన్నికల నాటికి పథకం లబ్దిదారుల సంఖ్య తక్కువగానే ఉండవచ్చు. ఎందుకంటే లబ్దిదారులు ముందుగా ఇంటి నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. లేదా తనకు నచ్చిన ప్రదేశంలో అపార్ట్‌మెంటును ఎంచుకొని ఓ ఫ్లాటును బుక్ చేసుకోవాలి. వడ్డీ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. రుణం కోసం బ్యాంకును ఆశ్రయించి, అనుమతి పొందాలి. ఈ ప్రక్రియ అంతా ముగిసేసరికి కనీసం మూడు నెలలైనా పడుతుంది. అప్పటికి లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తాయి. కాబట్టి కేవలం కొద్ది మంది లబ్దిదారులు మాత్రమే ఈ నూతన పథకం కింద ఎంపికయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల లోగా ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి.

## నూతన పథకంలో ఏముంది?

పీఎంఏవై-యు పథకం కింద రూ.58,868 కోట్ల వడ్డీ సబ్సిడీ అందించగా నూతన పథకంలో రూ.60 వేల కోట్లకు ఆమోదం లభించింది. వడ్డీ సబ్సిడీ పొందాలంటే కొన్ని నిబంధనలు విధించారు.

కార్పెట్ ఏరియాకు పరిమితి ఉంటుంది. కుటుంబ ఆదాయంపై కూడా పరిమితి విధించారు. గృహ రుణాలు పొందేందుకు కొన్ని అర్హతలు నిర్దేశించారు. కార్పెట్ ఏరియాకు సంబంధించి ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ-1, ఎంఐజీ-2 గృహాలకు వరుసగా 30, 60, 160, 200 చదరపు మీటర్ల పరిమితిని అనుమతించారు. కుటుంబ ఆదాయ పరిమితిని ఈడబ్ల్యూఎస్‌కు రూ.3 లక్షలు, ఎల్ఐజీకి రూ.3-6 లక్షలు, ఎంఐజీ-1కు రూ.6-12 లక్షలు, ఎంఐజీ-2కు రూ.12-18 లక్షలుగా నిర్ణయించారు. వడ్డీ సబ్సిడీ పొందాలంటే గృహ రుణం ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీలకు రూ.6 లక్షలు, ఎంఐజీ-1కు రూ.9 లక్షలు, ఎంఐజీ-2కు రూ.12 లక్షలుగా పరిమితి విధించారు. అయితే లబ్ది దారులు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుండి అధిక రుణాలు పొందవచ్చు. రుణ మొత్తం పెరిగితే దానికి అనుగుణంగా వడ్డీ సబ్సిడీ కూడా పెరుగుతుంది.

# రూ.25 లక్షల ఆరోగ్య బీమా..



- రూ.500కే గ్యాస్ సిలిండర్
- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ మ్యానిఫెస్టో విడుదల

**భోపాల్:** మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్ హామీల వర్షం కురిపించింది. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని పేర్కొంది. ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్, ఐపీఎల్ జట్టు ఏర్పాటు సహా 59 హామీలిచ్చింది. ఈ మేరకు మంగళవారం 106 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ మంగళవారం విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, రైతుల సహా అన్నివర్గాల ప్రజలూ లబ్ధిపొందేలా మ్యానిఫెస్టోను రూపొందించినట్టు ఆయన తెలిపారు.

**రూ. 500కే గ్యాస్ సిలిండర్**

అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతోపాటు రూ.2 లక్షల మేర రైతు రుణాలను మాఫీ చేస్తామనీ, అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.1500 భృతి చెల్లిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. రూ.10 లక్షల మేర ప్రమాద బీమా కూడా కల్పిస్తామని తెలిపింది. పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని, పాఠశాల విద్యను పూర్తి ఉచితంగా అందించడంతోపాటు, నిరుద్యోగ యువతకు వాళ్ల అర్హత ఆధారంగా నెలకు రూ.1,500 నుంచి రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లో తొలివిడతగా 144 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్‌ను ఈసారి కూడా ఛింద్వాడా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దింపాలని పార్టీ నిర్ణయించింది.

## ఇఫీ గోవా వెబ్‌సైట్‌లో వ్యక్తిగత వివరాలు !

**న్యూఢిల్లీ :** గోవాలో జరిగే భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)లో పాల్గొనేందుకు మీ పేరు నమోదు చేసుకున్నారా? అయితే మీ వ్యక్తిగత వివరాలన్నీ బహిర్గతమైనట్లే !. ఎలా అంటారా...రిజిస్టర్ చేసుకున్న వారి వ్యక్తిగత సమాచారం, పత్రాలు అన్నింటినీ ఇఫీ తన వెబ్‌సైటులో ఉంచింది. దీంతో ప్రభుత్వ ఐడీ, ఫోన్ నెంబర్, చిరునామా, పుట్టిన తేదీ వంటి వ్యక్తిగత సమాచారంతో పాటు సినీ కళాకారుల చలనచిత్ర విశేషాలు యావత్తూ బహిర్గతమై పోయాయి. కొంచెం సాంకేతిక పరిజ్ఞానం ఉంటే చాలు...ఈ వెబ్‌సైట్‌లో ప్రవేశించి, రిజిస్టర్ చేసుకున్న వారి సమాచారం సులభంగా పొందవచ్చు. గోవాలో జరిగే ఇఫీలో పాల్గొనేందుకు ప్రజలు, చలనచిత్ర రంగానికి చెందిన వారు, విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ గోవాలో ఇఫీని ఏర్పాటు చేస్తోంది. 1952లో ఈ చలనచిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే పేరెన్నికగన్న చలనచిత్రోత్సవాలలో ఇది ఒకటి. దక్షిణాసియాలో జరిగే ఏకైక చలనచిత్రోత్సవం ఇదే. 1975 నుండి దీనిని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. 2004 నుండీ గోవాలో ఇవి జరుగుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ 20 నుండి 28వ తేదీ వరకూ ఈ చలనచిత్రోత్సవాలు జరుగుతాయి. ఇఫీ సర్వర్‌లో ఉన్న ఫైల్స్‌ను ఎవరైనా చూడవచ్చు. అందుకోసం ప్రత్యేక యూఆర్ఎల్‌లో ప్రవేశించాలి. ఇందులో 16వ తేదీ వరకూ పేర్లు నమోదు చేసుకున్న 550 మంది సమర్పించిన పత్రాలు ఉన్నాయి. వ్యక్తిగత సమాచారం బహిర్గతం కావడంపై న్యూఢిల్లీకి చెందిన న్యాయవాది సౌతిక్ బెనర్జీ వ్యాఖ్యానిస్తూ 2000వ సంవత్సరపు ఐటీ చట్టంలోని సెక్షన్ 43ఏ కింద సంస్థపై చర్య తీసుకోవచ్చునని చెప్పారు.

### ఆర్మీలో ఆత్మహత్యలు 2001 నుంచి ప్రతి ఏడు

## వంద మందికి పైగానే.. : భారత సైన్యం

**న్యూఢిల్లీ :** అత్యంత పటిష్టమైన సైన్యాన్ని కలిగి దేశాల్లో ఒకటిగా చెప్పబడుతున్న భారత ఆర్మీలో ఆత్మహత్యలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఇక్కడ ప్రతి ఏడాదీ వంద మందికి పైగానే సైనికులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని భారత ఆర్మీ వెల్లడించటం గమనార్హం. అయితే, ఆర్మీలో సైనికుల ఆత్మస్థైర్యం దెబ్బ తినటంపై నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత ఆర్మీ సమాచారం ప్రకారం.. 2001 నుంచి ఏటా 100 నుంచి 140 మంది సైనికులు ఆత్మహత్యలు, స్వీయగాయాలతో మరణించారు. అలాంటి సందర్భాలలో సైనిక అంత్యక్రియలు నిర్వహించబడలేదు. అక్టోబరు 11న జమ్మూ కాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్‌లో ఫార్వర్డ్ పొజిషన్ వద్ద ఆత్మహత్య చేసుకున్న అగ్నివీర్ అమృతపాల్ సింగ్‌కు సైనిక గౌరవం ఇవ్వలేదనే ఆరోపణలపై ఆర్మీ స్పందిస్తూ.. ఈ విషయంలో అపార్థం చేసుకుంటున్నారనీ, వాస్తవాలను తప్పుగా చూపిస్తున్నారని వివరించింది. "అగ్నిపథ్ పథకం అమలుకు ముందు లేదా తర్వాత చేరిన సైనికుల మధ్య అర్హత కలిగిన ప్రయోజనాలు, ప్రోటోకాల్‌లకు సంబంధించి సాయుధ దళాలు భేదం చూపవు" అని 'ఎక్స్'లో రాసుకొచ్చింది.

## 66 ఏండ్ల ఉత్సవాల సందర్భంగా సాంస్కతిక సంబురాలు

- కేజీకేఎస్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మిక సంఘం మొదటి రాష్ట్ర మహాసభ జరిగి 66 ఏండ్లయిన సందర్భంగా ఈ నెల 20న సుందరయ్య కళానిలయం లో ఉత్సవాలు, సాంస్కృతిక సంబురాలు నిర్వహించనున్నట్టు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరా, తాటి, ఈత ఉత్పత్తులు, సేఫ్టీ మోకు, సర్దార్ సర్వాయి పాపన్న జీవిత పోరాట చిత్రాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 1957 అక్టోబర్ 19,20 తేదీల్లో మొదటి రాష్ట్ర మహాసభ మహబూబాబాద్ జిల్లా గార్లలో జరిగిందని తెలిపారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఎస్ ఆర్ దాట్ల నాయకత్వంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. అనేక హక్కులు సాధించిందన్నారు. ఆ స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల ఉపాధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఈ నెల 19 న అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేయాలనీ, 21 నుంచి పది రోజులపాటు జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కేజీకేఎస్ ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ యం. కృష్ణ స్వామి గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బోయపల్లి సుధాకర్ గౌడ్, యం.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఈ ఓట్లు చాలా ఖరీదు గురూ..!

- జనరల్ నియోజకవర్గాల్లో రూ.300 కోట్ల పైమాటే..!
- రిజర్వుడ్ నియోజకవర్గాల్లోనూ రూ.150 కోట్లపైనే..!
- ఒక్కో ఓటుకు రూ.3000 పైనే పంచే చాన్స్...
- మునుగోడు ఉప ఎన్నికను తలదన్నేలా ఖర్చులు




నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఓటుకు.. రాజకీయ విలువకన్నా ఆర్థిక విలువ గణనీయంగా పెరుగుతోంది. ఈ సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఒక్కొక్కటి కొన్ని నియోజకవర్గాల్లో రూ.300 నుంచి రూ.500 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యాయి. ప్రత్యర్థి పార్టీల నేతలను కొనడానికే కాకుండా సొంత పార్టీలోని నేతలు చేజారకుండా కూడా భారీ మొత్తాలు ఖర్చు చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో ఖర్చు డబుల్ అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలోనే అత్యంత కాస్ట్లీ ఎన్నికగా రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసిన మునుగోడు ఉప ఎన్నికను తలదన్నేలా ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఖర్చు చేయనున్నాయని సమాచారం. జనరల్ స్థానాల్లో రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేసే ఈ పార్టీలు, రిజర్వుడ్ సీట్లలో రూ.150 కోట్ల వరకు వెచ్చించే అవకాశం ఉందని అంటున్నారు.

రెండు లక్షలకు పైగా ఓట్లున్న నియోజకవర్గాల్లో గతంలో ఒక్కో ఓటుకు గరిష్టంగా రూ.2000 వేల వరకు వెచ్చిస్తే.. ఈసారి మాత్రం రూ.3,000 పైమాటే అని అంచనా వేస్తున్నారు.

**ఎన్నికల కమిషన్ స్పెషల్ ఫోకస్ పెట్టినా అంతే..**

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చులపై ఎన్నికల కమిషన్ స్పెషల్ ఫోకస్ పెట్టినా వ్యయాల విషయంలో ఏమాత్రం తగ్గడం లేదు. సభలు, సమావేశాల నిర్వహణకు అయ్యే ఖర్చులు, కార్యకర్తలకు కాఫీ, టిఫిన్, బిర్యానీల కోసం చేసే ఖర్చులను అభ్యర్థులు గతంలో తక్కువగా చూపించేవారు. కానీ ఈసారి అలాంటి అవకాశం లేకుండా ఎన్నికల అధికారులు ధరల జాబితాను రూపొందించారు. ఆ లిస్టు ప్రకారమే అభ్యర్థుల ఖర్చులను లెక్కకట్టనున్నారు.

వాటర్ ప్యాకెట్ నుంచి సమావేశాల్లో ఏర్పాటు చేసే భారీ బెలూన్లు, ఎల్ఈడీ స్క్రీన్లకు సైతం ధర నిర్ణయించారు. ఒక్కో బెలూన్‌కు రూ.4వేలు, ఎల్ఈడీ స్క్రీన్‌కు రూ.15వేలు రోజువారీ అద్దెగా నిర్ణయించారు. ఫంక్షన్‌హాల్స్‌లో సమావేశం నిర్వహిస్తే పట్టణాల్లో రూ.15వేలు అభ్యర్థి ఖర్చులో నమోదు చేయాలి. ఎన్నికల సంఘానికి అభ్యర్థి సమర్పించే ఎన్నికల వ్యయంలో కుర్చీలు, టేబుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే కళాకారుల పారితోషికంతో సహా ప్రతి వివరాలను నమోదు చేయాలనే నిబంధన ఉంది. ఇలాంటి ఖర్చుల విషయంలోనూ రూ.10 వెచ్చిస్తే రూపాయి కూడా ఖర్చు చూపించని పరిస్థితి ఉంది.

**ఎన్నికల వ్యయాలపై సవాళ్లు.. ప్రతి సవాళ్లు..**

ప్రతిసారీ ఎన్నికలప్పుడు అధికార, విపక్షాలు వ్యయాలపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీ, కర్నాటకల నుంచి డబ్బు సంచులు వస్తున్నాయని కాంగ్రెస్‌పై ఆరోపణలు చేశారు. ఖమ్మంలో గతనెల 30న నిర్వహించిన బహిరంగసభలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేయగా.. రెండు రోజుల క్రితం అభ్యర్థులకు బీఫామ్‌లు ఇచ్చే సందర్భంలోనూ కేసీఆర్.. పక్కరాష్ట్రాల నుంచి డబ్బులు వస్తున్నాయని, ప్రజలకు మందుపోసి మత్తులో ముంచి ఓట్లు కొల్లగొట్టాలని కాంగ్రెస్ చూస్తోందని వ్యాఖ్యానించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. జరగబోయే శాసనసభ ఎన్నికల్లో చుక్క మందు పోయకుండా అణాపైసా పంచకుండా ఈ ఎన్నికల్లో సిద్ధాంతాలు, మ్యానిఫెస్టోల మీద ఓట్లు అడుగుదామని అన్నారు. 17వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అమరవీరుల స్థూపం మీద ఒట్టేసి ప్రమాణం చేద్దామన్నారు. ఈ సవాల్‌కు అనుగుణంగానే ఆయన మంగళవారం హైదరాబాద్‌లో అమరవీరుల స్థూపం వద్దకు వెళ్తుండగా గన్‌పార్క్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. దీన్ని బట్టి ఎన్నికల్లో ధన బలం ప్రాధాన్యతేంటో అర్థం చేసుకోవచ్చు.

## ఎన్నికల వ్యయం పెంచినా.. రెండు, మూడొందల రెట్లు అధికంగానే ఖర్చు..

ఎన్నికల్లో అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నా అత్యధిక మంది ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన పరిమితి లోపే లెక్కలు చూపిస్తున్నారు. ఈ పరిమితిని పెంచితే కొంతైనా అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని భావించిన కేంద్ర ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చును 2022లో సవరించింది. 2014లో ఎంపీ అభ్యర్థి వ్యయ పరిమితి గరిష్టంగా రూ.75లక్షలు ఉంటే 2022లో ఆ మొత్తాన్ని రూ.90లక్షలకు పెంచింది. ఎమ్మెల్యే అభ్యర్థి వ్యయాన్ని రూ.28 లక్షల నుంచి రూ.40 లక్షలకు సవరించింది. 8 ఏండ్ల వ్యవధిలో పెరిగిన ఓటర్ల సంఖ్య, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుని వ్యయ పరిమితిని పెంచింది. ఎన్నికల కమిషన్ పెంచిన వ్యయం కన్నా రెండు, మూడొందల రెట్లు అధికంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారని అంచనా.

## జనబలాన్ని నమ్ముకున్న కమ్యూనిస్టులు..

ధన బలం కన్నా జనబలాన్ని మాత్రమే కమ్యూనిస్టులు నమ్ముకున్నారు. ధనం, మద్యం ప్రవాహంలా సాగుతున్న ప్రస్తుత రాజకీయాలతో కమ్యూనిస్టులు పోటీపడలేని పరిస్థితి నెలకొంది. కేఎల్ నర్సింహారావు, మల్లు స్వరాజ్యం, మంచికంటి కిషన్‌రావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, రజబ్‌అలీ, కుంజా బజ్జి, సున్నం రాజయ్య...వంటి నేతలు పైసా పోగేయకుండా.. పైసా ఖర్చు లేకుండా ఆదర్శ శాసనసభ్యులుగా నిలిచారు. కానీ నేడు ఎన్నికల్లో జన బలం కన్నా ధన బలం ప్రాధాన్యత పెరగటం విచారకరం.

**సున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి**

# ఎక్కువ తాగేస్తున్నారా?



**కాఫీ మీద ఎన్నో రకాల అపోహలు ఉన్నాయి. కొందరు కాఫీ ఆరోగ్యానికి మంచిది అని చెబితే మరికొందరు కాఫీ అలవాటు చేసుకోవద్దని చెబుతారు. అయితే కాఫీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయనేది ఎక్కువ మంది అభిప్రాయం. అందుకే.. కొందరు ఉదయాన్నే కప్పు కాఫీ తాగందే వారి దినచర్యను ప్రారంభించరు. ఇది రోగ నిరోధక శక్తిని మెరుగుపర్చడానికి, రోజును ఉత్సాహంగా ప్రారంభించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, కాఫీని ఎక్కువగా తాగడం, సమయపాలన లేకుండా తీసుకోవడం కూడా మంచిది కాదని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల ప్రయోజనాలకు బదులుగా దుష్ప్రభావాలే ఎక్కువగా ఉన్నాయని తేలింది.**

బ్రిటీష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్‌లో ప్రచురించిన ఓ అధ్యయనంలో ఖాళీ కడుపుతో ఉదయాన్నే కప్పు బ్లాక్ కాఫీని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ప్రమాదకరంగా పెరుగుతాయని పేర్కొంది. క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల నిద్రలేమి, డయాబెటిస్‌తో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల, అల్పాహారం తీసుకున్న తర్వాతే మొదటి కప్పు కాఫీ తీసుకోవటం మంచిదని పరిశోధకులు సిఫార్సు చేస్తున్నారు. అధికంగా కాఫీ తాగడం వల్ల కలిగే ఐదు దుష్ప్రభావాలు ఇలా ఉన్నాయి.

**నిద్ర సమస్యలు :** నిద్రపోయే ముందు కాఫీ తాగకూడదని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. నిద్ర రాకుండా చేయడానికి కాఫీ బాగా పని చేస్తుందన్న విషయం తెలిసిందే. అయితే, దీన్ని నిద్రపోయే ముందు తీసుకుంటే నిద్ర ఆలస్యమవడమే కాకుండా, నిద్రలేమిని ఎదుర్కొంటారు. దీన్ని నివారించడానికి చివరి కప్పు కాఫీని నిద్రపోవడానికి రెండు నుంచి మూడు గంటల ముందు మాత్రమే తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.



**ఆందోళన :** కాఫీ అడ్రినలిన్ విడుదలను ప్రేరేపిస్తుంది. అయితే ఎక్కువ కాఫీ తీసుకోవడం వల్ల, ఆందోళను పెంచుతుంది. ఇప్పటికే కెఫిన్ సెన్సిటివిటీ ఉన్న వారై, అధిక మొత్తంలో కాఫీ తీసుకుంటుంటే అది క్రమంగా ఆందోళన లేదా భయానికి దారి తీస్తుంది. అందువల్ల మీకు మైకం, నాడీ లేదా చేతులు వణుకుతున్నట్లు అనిపిస్తే అది ఎక్కువ కాఫీ తీసుకుంటున్న దానికి సంకేతంగా చెప్పవచ్చు. అందువల్ల ఎక్కువ మొత్తంలో కాఫీని తీసుకోకపోవడమే మంచిది.

**జీర్ణ సమస్యలు :** అధిక మొత్తంలో కాఫీ తీసుకోవడం శరీరంలో పేగు కదలికలను ప్రేరేపిస్తుంది. గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ వంటి సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, ఎక్కువ మొత్తంలో కాఫీ తీసుకుంటే, అది మరిన్ని సమస్యలకు దారి తీస్తుంది. దీని వల్ల అజీర్ణం, విరేచనాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల జీర్ణ సమస్యతో బాధపడుతుంటే కాఫీ తీసుకోవడం తగ్గించాల్సి ఉంటుంది. లేదంటే కాఫీకి బదులుగా టీని ఎంచుకోవచ్చు.

**డిపెండెన్సీ :** కొన్ని డ్రగ్స్ తీసుకోవడం వల్ల మెదడులో కెమికల్ రియాక్షన్ జరిగి అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాని కాఫీలో ఉండే కెఫిన్ వినియోగం మాత్రం ఇలాంటి వ్యసనానికి దారితీయదు. అయినప్పటికీ కాఫీ అధికంగా తీసుకోవడం కాలక్రమేణా మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతుంది. అయితే, కాఫీని అకస్మాత్తుగా మానేస్తే తలనొప్పి, చికాకు, బద్ధకం లేదా అలసట వంటి సమస్యలు రావొచ్చు. అందువల్ల కాఫీని వ్యసనంగా చేసుకోకూడదు.

**హై బీపీ, హార్ట్ రేటు :** కాఫీ నిద్ర నుంచి మేల్కొలిపే ఔషధంగా పని చేస్తుందనే విషయం తెలిసిందే. అయితే, ఎక్కువ మోతాదులో కాఫీ తీసుకోవడం ద్వారా సెన్సిటివిటీ ఉన్నవారిలో బ్లడ్ ప్రెజర్‌తో పాటు హార్ట్ రేటు పెరుగుతుంది. ఇది క్రమంగా గుండె సమస్యలకు దారితీయడమే కాకుండా హృదయ సంబంధ వ్యాధుల తీవ్రతను పెంచుతుంది. ఇటువంటి దుష్ప్రభావాలకు లోనవ్వకుండా ఉండాలంటే తక్కువ మోతాదులో కాఫీ తీసుకోవడం మంచిది.




# పెండ్లి తర్వాత మారాల్సిందేనా..?

**పెండ్లయ్యాక అమ్మాయిల జీవితంలో చాలా మార్పులొస్తాయంటారు. భర్త అత్తింటి వాళ్ల ఒత్తిడితో కొన్ని, గొడవలెందుకన్న ఉద్దేశంతో తమకు తామే కొన్ని త్యాగాలు చేయడం... ఇలాంటి వాటి వల్ల కొంత మంది మహిళలు తమ సొంత గుర్తింపును కోల్పో తుంటారు. అయితే ఇలా ప్రతి విషయంలో సర్దుకుపోవడం, మార్పులు చేసుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం తగ్గే అవకాశాలే ఎక్కువంటున్నారు నిపుణులు. దీనివల్ల శారీరకంగా, మానసికంగా పలు సమస్యలు ఎదురవుతుంటాయి. అందుకే పెండ్లయ్యాక కూడా అమ్మాయిలు కొన్ని విషయాల్లో మార్పులు చేసుకోకపోవడమే మేలంటున్నారు.**



సమాజంలో మనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును ఇచ్చే అంశాల్లో వృత్తి ఉద్యోగాలది కూడా కీలక పాత్ర ఉంటుంది. అయితే పెండ్లయ్యాక అత్తింటి వారి ఒత్తిడితో, ఇతర కారణాల రీత్యా కొంతమంది అమ్మాయిలు తమకు ఇష్టం లేకపోయినా ఉద్యోగాలకు దూరంగా ఉండాల్సి రావొచ్చు. ఇలాంటప్పుడు ఇతరుల ఇష్టాలకు విలువిచ్చి, మన ఇష్టాలను త్యాగం చేయడం ఎంత వరకు సమంజసం అనేది ఆలోచించమంటున్నారు నిపుణులు. అందుకే ఈ విషయంలో మిమ్మల్ని మీరు బాధపెట్టుకునే బదులు... ఉద్యోగం కొనసాగించే విషయంలో మీ భర్త, అత్తింటి వారి అభిప్రాయం పెండ్లికి ముందే తెలుసుకోండి. ఒకవేళ వాళ్లు ఒప్పుకోకపోతే ఆ సంబంధం విషయంలో పునరాలోచన చేయడం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే వృత్తి ఉద్యోగాల విషయంలోనే మీ ఇష్టాలకు విలువివ్వని వారు ఆ తర్వాత ప్రతి విషయంలోనూ మిమ్మల్ని, మీ అభిప్రాయాల్ని గౌరవిస్తారన్న గ్యారంటీ లేదు.

## డ్రెస్సింగ్

తమకు నచ్చిన, నచ్చకపోయినా పెండ్లయ్యాక కొన్ని అభిరుచుల్ని మార్చుకుంటారు. డ్రెస్సింగ్‌తో పాటు ఆహారపు అలవాట్లలోనూ మార్పులు చేసుకుంటుంటారు. నిజానికి దీనివల్ల ఆత్మవిశ్వాసం తగ్గడంతో పాటు మనం ఏదైనా పొరపాటు చేస్తున్నామేమోనన్న భావనే మనల్ని ఎక్కువగా వేధిస్తుంటుంది. కాబట్టి అసభ్యంగా లేనంత వరకు అది ట్రెడిషనల్ అయినా, మోడ్రన్ అయినా చక్కటి డ్రెస్సింగ్ సెన్స్‌ను కొనసాగించడం మంచిదంటున్నారు నిపుణులు.

అంతగా అవసరమనిపిస్తే మీ అభిప్రాయాన్ని మీ భాగస్వామితో పంచుకొని వారిని ఒప్పించవచ్చు. అలాగే ఆయా విషయాల్లో మీ భాగస్వామి అభిప్రాయాలకు కూడా విలువనివ్వడం వల్ల... ఇద్దరి మధ్య అరమరికల్లేకుండా ముందుకెళ్లచ్చు.

## స్నేహితులతో...

పెండ్లికి ముందు మనకంటూ ఓ ఫ్రెండ్ సర్కిల్ ఉంటుంది. వీలు చిక్కినప్పుడల్లా వారితో సమయం గడుపుతూ బోలెడన్ని మధుర జ్ఞాపకాల్ని మూటగట్టుకుంటాం. అయితే పెండ్లి తర్వాత ఒక్కసారిగా దీన్ని మార్చుకోవాలని చెప్పే హక్కు గానీ, అవతలి వారి కోసం మనకు మనమే మన స్నేహాన్ని త్యాగం చేసే అవసరం గానీ లేదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికైనా, శారీరక మానసిక ఉల్లాసానికైనా మనకంటూ కొంత సమయం కేటాయించుకోవడం, నచ్చిన వారితో గడపడం ముఖ్యమంటున్నారు.



## బాధ్యత మారదు

పెండ్లయ్యాక అమ్మాయి పుట్టింటి వారి గురించి పట్టించుకోవక్కర్లేదనే భావన ఇప్పటికీ కొంత మందిలో చూస్తుంటాం. నిజానికి ఇలాంటి ఆంక్షల వల్ల కొడుకులు లేని తల్లిదండ్రుల బాగోగులు చూసే వారే కరువవుతుంటారు. కానీ ఇలా ఆలోచించే సమాజాన్ని పక్కన పెట్టి పెండ్లయినా అమ్మాయిలు తమ పూర్వ బాధ్యతల్ని కొనసాగించడమే మంచిదంటున్నారు నిపుణులు. తల్లిదండ్రుల బాధ్యత చూసుకోవడం, వృద్ధాప్యంలో వారిని చేరదీయడం, ఆర్థికంగా మీకున్న బాధ్యతల్ని కొనసాగించడం మొదలైన విషయాల్లో ఎలాంటి మార్పులు చేసుకోవాల్సిన అవసరం లేదంటున్నారు. ఈ విషయాల్లో పెండ్లయ్యాక తగాదాలు రాకుండా ఉండాలంటే మీ భాగస్వామితో ముందే మాట్లాడి నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

## ఇంటి పేరు విషయంలోనూ...

పెండ్లయ్యాక చాలా మంది అమ్మాయిలకు ఇంటి పేరు మారుతుంటుంది. ఇది చాలా ఏండ్లుగా కొనసాగుతున్న పద్ధతి. అయితే ఇప్పుడు కొంతమంది పెళ్లైనా తమ తల్లిదండ్రుల ఇంటి పేరునే ప్రతి చోటా ఉపయోగిస్తున్నారు. ఇక మరికొందరు తమ పూర్తి పేరు వెనక తమ భర్త పేరు లేదంటే అత్తింటి వారి ఇంటి పేరును చేర్చుకుంటున్నారు. సెలబ్రిటీలే కాదు సామాన్యులు కూడా ఇప్పుడు ఇదే ట్రెండ్ కొనసాగించడం చూస్తూనే ఉన్నాం.



# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఉద్యోగాల భర్తీ ఏది?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇస్తే, సీఎం కేసీఆర్ వాటినే పెంచి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంటూ విడుదల చేశారని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ సంఖ్యను పెంచి రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ సీఎం కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనీ, వారంతా తమ తల్లిదండ్రులతో కలిసి 90 లక్షల మంది ఓట్లు వేస్తే కాంగ్రెస్‌పార్టీకి 90 సీట్లు వస్తాయన్నారు. 'నిరుద్యోగ యువకులారా మీ శక్తిని తక్కువ అంచనా వేయకండి.30 లక్షల నిరుద్యోగ యువకులారా మరో 45 రోజులు ప్రతీ నిరుద్యోగ యువకుడు ముందుకొచ్చి కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలను ఊడగొట్టాలి' అని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉన్న 30 లక్షల మంది నిరుద్యోగులు తలుచుకుంటే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అన్నారు. మీ ఓటు వేసి కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగం ఊడగొడితే చాలన్నారు. కాబట్టి నిరుద్యోగులే కథానాయకులై, మీరు కదనరంగంలోకి దిగి, మీరే ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు జూపల్లి కృష్ణారెడ్డి, మల్లు రవి, అద్దంకి దయాకర్, ఫిరోజ్‌ఖాన్, అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి విలేకర్లతో రేవంత్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడుతుందన్నారు.

**మద్యం, డబ్బు పంచకుండా ఓట్లు అడగడానికి కేసీఆర్ సిద్ధమా?**

కేసీఆర్ ఎన్నికల్లో గెలిచేందుకు డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారని రేవంత్ ఆరోపించారు. మ్యానిఫెస్టో చూపించి ఓట్లు అడిగేందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. మద్యం, డబ్బు పంపిణీ చేయకుండా ఎన్నికలకు వెళ్దామని అమరవీరుల స్తూపం వద్ద ప్రమాణం చేద్దామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు సవాల్ విసిరిన సంగతే తెలిసింది. అందుకు తగ్గట్టుగానే రేవంత్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. అయితే ఎలక్షన్ కోడ్ పేరుతో రేవంత్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. అమరవీరుల స్తూపం వద్దకు అనుమతించకుండా రేవంత్‌రెడ్డిని గాంధీభవన్‌కు తరలించారు.

ఎక్కడ డబ్బులు దొరికినా కాంగ్రెస్‌వేనా?

పక్క రాష్ట్రాల నుంచి కాంగ్రెస్‌కు కోట్లకొద్దీ కరెన్సీ



కట్టలు వస్తున్నాయని తమపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ డబ్బులు దొరికినా కాంగ్రెస్‌వే అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పోటీ పడి ఉప ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు చేశాయన్నారు. హుజూరాబాద్, మునుగోడు ఉపఎన్నికలను దేశ ప్రజలంతా చూశారని, అక్కడ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే, పోటీగా బీజేపీ అలాగే ఖర్చు చేసిందన్నారు. ఇక్కడ కేసీఆర్ ప్రొటెక్షన్ మనీ కింద తమకు ఇచ్చిన మొత్తాన్ని బీజేపీ ఉపయోగించిందన్నారు. తమకు డబ్బులు రాలేదని అక్కడి ప్రజలు ధర్నా చేసేందుకు రోడ్డెక్కిన సందర్భాలు చూశామని చెప్పారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని వైన్స్ దుకాణాల్లో ప్రతినెల రూ.60 కోట్ల మద్యం విక్రయాలు జరిగేవనీ, కానీ మునుగోడు ఉపఎన్నిక సమయంలో 20 రోజుల్లోనే రూ.300 కోట్ల విక్రయాలు జరిగాయని గుర్తు చేశారు.

**అమరవీరుల స్తూపం వద్దకు వెళితే అరెస్టు చేస్తారా?**

చుక్క మందు, డబ్బు పంచకుండా ఎన్నికలు నిర్వహించాలని కేసీఆర్‌కు సవాల్ విసిరానని రేవంత్ తెలిపారు. మంచి సంప్రదాయాన్ని అందిద్దామనే ఉద్దేశ్యంతో ఆయనను అమరవీరుల స్తూపం వద్దకు ఆహ్వానిస్తే ఆయన రాలేదన్నారు. కేసీఆర్ రాకపోగా అమరుల స్తూపం వద్దకు వెళితే నన్ను అరెస్టు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి పేరుతో పోలీసులు నిర్బంధించారన్నారు. కేసీఆర్ మాయ చేసి ఎన్నికల్లో నెగ్గాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో సిద్ధాంతాలు ప్రచారం చేసి ఓట్లు అడుగుదామనీ, మ్యానిఫెస్టో చూపించి ఓట్లు అడిగేందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. నిరుద్యోగ యువతి ప్రవళ్లిక ఆత్మహత్య చేసుకుంటే, ఆ కుటుంబం పరువును మంటగలిపేలా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. ప్రేమ విఫలమై చనిపోయిందని పోలీసు అధికారి ఎలా చెబుతారని ప్రశ్నించారు. ప్రవళ్లికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని చెప్పారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవళ్లిక గురించి తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రవళ్లిక విషయంలో ప్రెస్ మీట్ పెట్టిన డీసీపీపై కేసు పెడతామన్నారు. అమ్మాయి ఫోన్ సీజ్ చేస్తే సమాచారం ఎలా బయటకు వచ్చిందని నిలదీశారు. ఫోన్ ఓపెన్ చేయాలంటే, కోర్టు అనుమతి తీసుకోవాలని అన్నారు. ఫోన్ సమాచారం పై ఫోరెన్సిక్ నివేదిక రాక ముందే...డీసీపీ ప్రెస్ మీట్ ఎలా పెడతారని ప్రశ్నించారు. డీసీపీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువకులారా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలని కోరారు. ప్రవళ్లిక కుటుంబ సభ్యులను రాహుల్‌గాంధీ వద్దకు తీసుకెళ్లాలనుకుంటే...బీఆర్ఎస్ నేతలను పంపి ఆ కుటుంబాన్ని ప్రగతిభవన్‌లో బంధిస్తారనీ, కేసీఆర్ ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

**నేడు వరంగల్‌కు రాహుల్, ప్రియాంక గాంధీ**

కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న బస్సు యాత్రలో రాహుల్, ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటలకు రామప్ప దేవాలయాన్ని దర్శించుకుంటారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను శివుడి ముందుంచి పూజించి, ఆ తర్వాత బస్సు యాత్ర ప్రారంభిస్తారు. మొదటి రోజు ములుగు, భూపాలపల్లిలో మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. రెండో రోజు కరీంనగర్ జిల్లాలో, మూడో రోజు నిజామాబాద్ జిల్లాలో బస్సు యాత్ర కొనసాగనుంది.

**రజినీకి ఉద్యోగం రేవంత్ హామీ**

నాంపల్లికి చెందిన వికలాంగులరాలు రజినీ మంగళవారం గాంధీభవన్‌లో రేవంత్‌ను కలిశారు. పీజీ పూర్తి చేసినా ఉద్యోగం రాలేదనీ, ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగం కూడా ఇవ్వడం లేదంటూ రజినీ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన రేవంత్....డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా కోరారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే అర్హతలకు తగ్గ ఉద్యోగం ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

**రేవంత్‌ను కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాపురావు**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మంగళవారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో ఆయన్ను కలిశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డిని రేవంత్ సోమవారం రాత్రి ఆయన నివాసంలో కలిశారు.

**కాంగ్రెస్‌లో చేరికలు**

జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. పలువురు బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీపీలు రాంరెడ్డి, సాంబయ్య గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు ప్రతాప్, మంజుల, బాల్‌రాజు, గోపాల్, రాములు, యాదయ్య, జహంగీర్, కౌన్సిలర్లు, ఇతర నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలానికి చెందిన పలువురు నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# ప్రతిపక్షాలతో ప్రమాదం

(మొదటిపేజి తరువాయి)

ప్రయత్నమని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో సిరిసిల్ల మంచి విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందుతుందని మాట ఇచ్చారు. సమైక్య పాలనలో అడుగంటిన ఎగువ మానేరు ఇప్పుడు ఏడాదంతా నీటితో ఉంటూ సిరిసిల్ల వరకు సజీవ జలధారగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్నారని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు ఆగం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని చెబుతున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిలాంటి నేతలు అబద్ధాలతో, ఆపద మొక్కులతో వస్తారని, వారిని ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ సభలో మంత్రి కేటీఆర్ సహా రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పార్టీ నేతలు, నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**తెలంగాణకు సిద్దిపేట తలమానికం**

సిద్దిపేటలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడుతూ.. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అన్నట్టుగా జన్మభూమిని మించిన స్వర్గం మరొకటి లేదని, తనను ప్రతి సందర్భంలో విజేతగా నిలిపింది ఈ గడ్డేనని గుర్తు చేసుకున్నారు. దేశానికి తెలంగాణ తలమానికమైతే.. తెలంగాణకు సిద్దిపేట తలమానికమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు గతంలో మంచినీటి కోసం గోసలు పడేవారనీ.. కానీ నేడు మానేరు డ్యామ్ నుంచి నీటిని తీసుకొచ్చి ఇక్కడ జల జాతర చేశామన్నారు. సిద్దిపేటకు సాగు, తాగునీటితో పాటు ఇటీవలే రైలును కూడా తీసుకొచ్చుకున్నామన్నారు. ప్రజలందరి ఆజ్ఞతో మొండి పట్టుదలతో వెళ్లి ప్రాణాలకు తెగించి తెలంగాణను సాధించుకున్నామ న్నారు. అప్పుడు బస్సు గుర్తు వచ్చిందని, సమైక్యవాదులందరూ తనను ఓడించడానికి ఎంత ప్రయత్నించినా.. 60 వేల మెజార్టీతో గెలుపొందాన న్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత ఆరడుగుల బుల్లెట్ హరీశ్‌రావును సిద్దిపేటకు అందించానన్నారు. హరీశ్‌రావు తన నమ్మకాన్ని నిలబెట్టాడని, మీ గౌరవాన్ని కాపాడాడన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నా ఇంత బాగా చేసే వాడిని కాదేమోనంటూ హరీశ్‌రావును మెచ్చుకున్నారు. సిద్దిపేటలో రానిది ఏంది.. లేనిది ఏంది.. ఇక్కడ అన్నింటిని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గాలి మోటర్ ఒక్కటే తక్కువగా ఉందన్నారు. కాగా సిద్దిపేట పట్టణానికి పక్కనే ఉన్న ఇరుకోడు వద్ద మినీ యూనివర్సిటీ రాబోతుందన్నారు. హరీశ్‌రావుకు గతంలో కంటే ఎక్కువ మెజార్టీని తీసుకొచ్చి, ఆ రికార్డును ప్రజలే తిరగరాయాలని సూచించారు. దళితబంధుకు సిద్దిపేట దగ్గర ఉన్న రామంచ ఆడబిడ్డనే ప్రేరణ అని, ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందిస్తానన్నారు. బీసీ వృత్తులను కాపాడుకోవడానికి ప్రతి ఇంటికి లక్ష అందించే వరకు పథకం కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, దామోదర్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, ఏరోల్ల శ్రీనివాస్, మధుసూదనా చారి, నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులది అవకాశవాదం

(మొదటిపేజి తరువాయి)

జరగాలని అన్ని పార్టీలు కోరుతున్నా బీజేపీ ప్రభుత్వం మాత్రం కులగణన చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదని ఆరోపించారు. కులగణన చేయడం వల్ల అట్టడుగు వర్గాలకు ఎంతో ఉపయోగం జరుగుతుందన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందే మహిళా బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీట్ల విషయంలో స్పష్టత రాలేదని, చర్చలు జరుగుతున్నాయని త్వరలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని, అవకాశవాద బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ ఉత్తర తెలంగాణ!

(మొదటిపేజి తరువాయి)

పర్యటించనున్నారు. బస్సుయాత్రలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇస్తూనే...మరోవైపు తాము బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ బలమైన నేతలపై నజర్ పెట్టింది. వ్యూహాత్మకంగా అడుగులేస్తూ ప్రతి అంశాన్ని లోతుగా పరిశీలిస్తున్నది. ఎక్కడెక్కడైతే గ్యాప్ ఉందో అక్కడే ప్రధానంగా దృష్టిసారిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ హంగుఆర్భాటాలు చూసుకున్నారే తప్ప ద్వితీయ శ్రేణి, మండలస్థాయి ముఖ్య నేతలను పట్టించుకోలేదని విమర్శ బలంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయా నియోజకవర్గాల్లో అసంతృప్తితో ఉన్న నేతలెవరున్నారనే దానిపై క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని మరీ వారితో రాష్ట్ర నాయకత్వం చర్చలు జరుపుతున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నేతలు చాలా మంది కాంగ్రెస్‌కు టచ్‌లోకి వచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరులతో సైతం రేవంత్‌రెడ్డి రహస్యంగా చర్చలు జరుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో మైనార్టీ నేతగా ఎదిగిన షబ్బీర్ అలీపై సీఎం కేసీఆర్ పోటీచేయడాన్ని విమర్శనాస్త్రంగా ఎక్కుపెట్టింది.

బీఆర్ఎస్, ఎంఐఎం జత కట్టి మైనార్టీ నేతను ఓడించేందుకు కుట్ర చేస్తున్నాయంటూ ఎదురుదాడి చేస్తున్నది. ఇది బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారింది. కాంగ్రెస్ దెబ్బకు కలవరపాటుకు గురైన కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గంలో ప్రతి కాలనీ నుంచి నివేదికలు తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న అంశాలేంటి? ఏ ఓటరు ఎవరు చెబితే వింటారు? కాంగ్రెస్, బీజేపీ నేతల పనితీరు ఎలా ఉంది? ఇలా ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసే పరిస్థితిని కాంగ్రెస్ కల్పించింది. షబ్బీర్ అలీపై కేసీఆర్ పోటీని తమకు అనుకూలంగా మలుచుకుని ఉత్తర తెలంగాణలోని జిల్లాల్లో ప్రచారం చేయాలని భావిస్తున్నది. కరీంనగర్ జిల్లాలోనూ గులాబీ పువ్వు రెక్కలను రాల్చేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తున్నది.


# మార్పు మొదలైంది!

- తొలిసారి ఎన్నికల బరిలో జిల్లా క్రికెట్ ప్రతినిధి
- శుక్రవారం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికలు





**హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎన్నికల వారంలోకి అడుగు పెట్టింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికలకు జరుగనున్నాయి. సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియగా.. అపెక్స్ కౌన్సిల్‌లోని ఆరు పదవులకు నాలుగు ప్యానల్స్ పోటీపడుతున్నాయి. ఎన్నికలు, బహుముఖ పోటీ హెచ్‌సీఏకు కొత్త కాదు. కానీ, ఈ సారి ఎన్నికల బరిలో నిలిచిన ఓ అభ్యర్థి హెచ్‌సీఏ ఎన్నికలను మరింత ప్రత్యేకం చేశారు. అయనే, కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగమ్ రావు. హైదరాబాద్ క్రికెట్ సంఘం చరిత్రలోనే తొలిసారి జిల్లా క్రికెట్ సంఘాల నుంచి ఓ అభ్యర్థి ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. 1934లో మొదలైన హెచ్‌సీఏకు ఘన చరిత్ర ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి వ్యవస్థాపక సభ్య రాష్ట్ర సంఘంగా బీసీసీఐలోనూ హెచ్‌సీఏకు మంచి గుర్తింపు ఉండేది. అయినప్పటికీ.. ఇన్నేండ్ల హెచ్‌సీఏ చరిత్రలో ఎన్నడూ జిల్లా క్రికెట్ సంఘం తరఫున ఎవరికీ అవకాశం కల్పించలేదు. హైదరాబాద్ క్రికెట్ సంఘం అంటే హైదరాబాద్ పరిధిలోని క్లబ్‌లకు చెందిన వ్యక్తులే పాలించాలనే సంప్రదాయానికి చెక్ పెడుతూ.. కార్యదర్శి పదవికి ఆగమ్ రావు పోటీలో నిలిచారు. నాలుగు ప్యానల్స్ పోటీపడుతున్న హెచ్‌సీఏ ఎన్నికల్లో వి. ఆగమ్ రావు విజయావకాశాలు ఎలాగున్నా.. కీలక కార్యదర్శి పదవికి పోటీపడుతూ జిల్లా క్రికెట్ సంఘాల ఉనికి నిలబెట్టారని టాక్ వినిపిస్తోంది. బహుళ యాజమాన్యంలోని 57 క్లబ్‌లపై వేటు వేయటంతో అందరికీ సమాన అవకాశాలు ఏర్పడినట్టు అయ్యాయి. హెచ్‌సీఏలో మార్పు దీనితోనే మొదలైందని చెప్పవచ్చు.

**ఏడాది పొడవునా క్రికెట్ పోటీలు**



'ఆరేండ్లుగా కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. కోవిడ్ మహమ్మారితోనే సగం కాలం గడిచినా.. మిగతా సమయంలోనే కరీంనగర్ ప్రీమియర్ లీగ్, తెలంగాణ టీ20 లీగ్, అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలను నిర్వహించాను. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్, కాలేజ్, కార్పొరేట్ తేడా లేకుండా అన్ని రకాల, అన్ని స్థాయిల క్రికెట్ కార్యకలాపాలను హెచ్‌సీఏ గొడుగు కిందకు తీసుకురావాలనేది నా ఆలోచన. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ క్రికెట్ అభివద్ధికి మా దగ్గర మంచి ప్రణాళికలు ఉన్నాయి. ఏడాది పొడవునా క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని' ప్యానల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తరఫున కార్యదర్శి పదవికి పోటీచేస్తున్న ఆగమ్ రావు తెలిపారు.



# డచ్ ధనాధన్ షో

**స్కాట్ ఎడ్వర్డ్స్ అజేయ అర్థ సెంచరీ • సఫారీపై నెదర్లాండ్స్ 245/8**

**ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్)**

2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాకు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చిన నెదర్లాండ్స్.. ఏడాది తర్వాత ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లోనూ అదే దూకుడు చూపించింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో మంగళ వారం దక్షిణాఫ్రికాతో ధర్మశాలలో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 43 ఓవర్లలో 8 వికెట్లకు 245 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్ల దెబ్బకు ఓ దశలో 140/7తో కష్టాల్లో కూరుకున్న డచ్ జట్టు.. ఎనిమిదో వికెట్‌కు అద్భుతమే చేసింది. స్కాట్ ఎడ్వర్డ్స్ (78 నాటౌట్, 69 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. ఎడ్వర్డ్స్ మెరుపు ఇన్నింగ్స్‌తో నెదర్లాండ్స్ భారీ స్కోరు నమోదు చేసింది. సఫారీ బౌలర్లలో లుంగిసాని ఎంగిడి, మార్కో జెన్సన్, కగిసో రబాడలు రెండేసి వికెట్లు పడగొట్టారు.

**ఎడ్వర్డ్స్ అదుర్స్ :** టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పేస్‌కు అనుకూలించే పరిస్థితుల్లో నెదర్లాండ్స్‌ను స్వల్ప స్కోరుకు పరిమితం చేయాలనే వ్యూహంతో బవుమా సేన బరిలోకి దిగింది. అందుకు తగినట్టుగానే పేసర్లు చక్కగా రాణించారు. పవర్‌ప్లే నుంచే వికెట్ల వేట మొదలెట్టారు. లుంగిసాని ఎంగిడి, మార్కో జెన్సన్, కగిసో రబాడలు మెరవటంతో డచ్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. విక్రమ్‌జిత్ సింగ్ (2), మాక్స్ ఒడౌడ్ (18), కొలిన్ అకర్‌మాన్ (12), లీడె (2), సైబ్రాండ్ (19), తేజ (20) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. దీంతో 140 పరుగులకే నెదర్లాండ్స్ 7 వికెట్లు చేజార్చుకుంది. 200 పరుగులు చేసినా గొప్పే అనిపించిన స్థితిలో లోయర్ ఆర్డర్‌లో స్కాట్ ఎడ్వర్డ్స్ (78 నాటౌట్) విరుచుకుపడ్డాడు. 53 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన ఎడ్వర్డ్స్ 10 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఎడ్వర్డ్స్‌కు వాన్‌డర్ మెర్వె (29, 19 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) సైతం తోడటంతో నెదర్లాండ్స్ భారీ స్కోరు సాధించింది.

**43 ఓవర్ల మ్యాచ్ :** దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. మంగళవారం సూర్యోదయానికి ముందు నుంచే ఇక్కడ వర్షం కురిసింది. చిరుజల్లులు, శీతల పరిస్థితుల్లో మైదానం అవుట్ ఫీల్డ్‌ను సమయానికి సిద్ధం చేయటం సాధ్యపడలేదు. విరామం ఇస్తూ వర్షం, అవుట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమైంది. అంపైర్లు మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ఇరు జట్ల ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లు కోత విధించారు.

# బంగ్లా సవాల్‌కు సిద్ధం!



పుణెలో రోహిత్‌సేన ప్రాక్టీస్

**పుణె (మహారాష్ట్ర) :** ఐసీసీ 2023 ప్రపంచకప్ గ్రూప్ దశలో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమ్ ఇండియా.. పుణెలోని ఎంసీఏ స్టేడియం వేదికగా మరో సవాల్‌కు సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియా, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లపై మెరుపు విజయాలు సాధించిన రోహిత్‌సేన..గురువారం ఇక్కడ జరిగే నాల్గో గ్రూప్ దశ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. అహ్మదాబాద్ నుంచి ఆదివారం సాయంత్రమే పుణెకు చేరుకున్న టీమ్ ఇండియా మంగళవారం ఎంసీఏ స్టేడియంలో ఫుల్ ప్రాక్టీస్ చేసింది. తొలుత దీన్ని ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌గా భావించినా.. టీమ్ ఇండియా జట్టు సభ్యులు అందరూ మైదానంలో కనిపించారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో టీమ్ ఇండియా క్రికెటర్లు చెమటోడ్చగా.. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మలు స్టేడియంకు చేరుకోగానే పిచ్‌ను చూసేందుకు వెళ్లారు. పిచ్‌ను పరిశీలిస్తూ కొన్ని షాడో షాట్లు ప్రాక్టీస్ చేసిన రోహిత్ శర్మ.. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో మంతనాలు జరిపాడు. నెట్స్‌లో విరాట్ కోహ్లి దూకుడుగా బ్యాటింగ్ సాధన చేయగా.. బౌలర్లలో మహ్మద్ షమి ఫుల్ స్పీడ్‌తో బంతులు వేశాడు. పాకిస్థాన్‌పై విజయం అనంతరం రెండు రోజుల విశ్రాంతి తీసుకున్న టీమ్ ఇండియా మంగళవారమే మైదానంలోకి అడుగుపెట్టింది. మరోవైపు బంగ్లాదేశ్ క్రికెటర్లు సైతం పుణె స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు.

# అవినీతిని అంతం చేస్తాం

**హెచ్‌సీఏ ప్యానల్ ఫర్ గుడ్ గవర్నెన్స్**




**నవతెలంగాణ-హైదరాబాద్**

హైదరాబాద్ క్రికెట్ సంఘంలో అవినీతిని సమూలంగా అంతం చేస్తామని, అధికార వికేంద్రకరణతో సుపరిపాలన అందించి పూర్వ వైభవం తీసుకొస్తామని హెచ్‌సీఏ పోల్ ప్యానల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్యానల్ మ్యానిఫెస్టో విడుదల చేసింది. 'హెచ్‌సీఏలో నెలకొన్న ప్రధాన సమస్య అవినీతి. ఆట అభివృద్ధి, జట్ల ఎంపికలో అవినీతి ఎక్కువైంది. మా ప్యానల్ గెలిస్తే.. అవినీతిని పూర్తిగా అంతం చేస్తాం. అధికార వికేంద్రీకరణతో క్లబ్ కార్యదర్శులతో సబ్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్‌లో క్రికెట్ అభివృద్ధితో పాటు కొత్త జిల్లాల్లోనూ క్లబ్‌లకు సభ్యత్వాలు అందజేస్తాం. ఆర్థిక, క్రికెట్, నిర్వహణ వ్యవహారాలను పూర్తిగా చక్కబెడతాం. తెలంగాణ ప్రీమియర్ క్రికెట్ లీగ్ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని' ప్యానల్ తరఫున అధ్యక్షుడిగా పోటీచేస్తున్న కె. అనిల్‌కుమార్ తెలిపారు. ఈ ప్యానల్ తరఫున ఉపాధ్యక్షుడిగా దల్జీత్ సింగ్, కార్యదర్శిగా వి. ఆగమ్ రావు, సంయుక్త కార్యదర్శిగా టి. బసవరాజు, కోశాధికారిగా పి. మహేంద్ర, కౌన్సిలర్‌గా వినోద్ ఇంగ్లేలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

# సింధు శుభారంభం

- లక్ష్యసేన్, శ్రీకాంత్ పరాజయం
- సాత్విక్, చిరాగ్ జోడీ వాకోవర్

**డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750**



**ఒడెన్సె (డెన్మార్క్) :** భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు డెన్మార్క్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ విభాగంలో సింధు తొలి రౌండ్లో విజయం సాధించింది. స్కాట్లాండ్ అమ్మాయి క్రిస్టీ గిల్మోర్‌పై సింధు మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందింది. 21-14, 18-21, 21-10తో 56 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధుకు రెండో గేమ్‌లో గట్టి పోటీ ఎదురైంది. చివరి వరకూ పోరాడినా మ్యాచ్ నిర్ణయాత్మక మూడో గేమ్‌కు దారితీసింది. మూడో గేమ్‌లో 11-2తో విరామ సమయానికి తిరుగులేని ఆధిక్యం సాధించిన సింధు రెండో రౌండ్లోకి ప్రవేశించింది. మహిళల సింగిల్స్‌లోనే యువ షట్లర్ ఆకర్షి కశ్యప్ 10-21, 22-20, 21-12తో విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. తొలి రౌండ్లో 21-19, 10-21, 16-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ చేతిలో మూడు గేముల మ్యాచ్‌లో నిరాశపరిచాడు. యువ సంచలనం లక్ష్యసేన్‌కు తొలి రౌండ్లో చుక్కెదురైంది. థాయ్‌లాండ్ షట్లర్‌తో పోరులో 21-16, 21-18తో వరుస గేముల్లో పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో వరల్డ్ నం.1 సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు డెన్మార్క్ ఓపెన్ నుంచి తప్పుకున్నారు. మలేషియా జోడీతో తొలి రౌండ్ మ్యాచ్ ముంగిట సాత్విక్, చిరాగ్‌లు వాకోవర్ ఇచ్చారు. ఫిట్‌నెస్ కారణాలతోనే ఆఖరు నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నట్టు తెలుస్తోంది.

# పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతికి స్వర్ణం



**హైదరాబాద్:** డబ్ల్యూపీసీ జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన పవర్‌లిఫ్టర్ జ్యోతి సింగ్ ఓపెన్ కేటగిరీలో పసిడి పతకం సాధించింది. ఇటీవల బెంగళూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మహిళల 67.5 కేజీల డెడ్‌లిఫ్ట్ ఓపెన్ విభాగంలో 120 కేజీల బరువెత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో స్వార్డి కిర్గిస్థాన్‌లో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిందని రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇ.రేఖ తెలిపారు.

# 19న.. తెలుగులోనూ లియో విడుదల



సూర్యదేవర నాగవంశీ

విజయ్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'లియో'. సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై లలిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమాలో త్రిష, సంజయ్ దత్, అర్జున్ సర్జా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈనెల 19న ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్ర తెలుగు హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తెలుగులో 'లియో' రిలీజ్‌కి సంబంధించి నిర్మాత సూర్యదేవర నాగవంశీ మీడియాతో మాట్లాడారు.

- ఈనెల 19న ఉదయం 7 గంటల షోలతో 'లియో' విడుదలవుతుంది. దసరా సెలవుల్లో ఈ సినిమా అందరినీ అలరిస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా బాగుంటుంది అనే నమ్మకంతోనే తెలుగు హక్కులు తీసుకున్నాం. దర్శకుడు లోకేష్ నిరాశపరచరు అని అనుకుంటున్నాను.
- తెలుగులో టైటిల్ విషయంలో చిన్న సమస్య వచ్చింది. తెలుగులో 'లియో' టైటిల్‌ని ఒకరు రిజిస్టర్ చేసుకున్నారు. వారు మమ్మల్ని సంప్రదించకుండా నేరుగా కోర్టుని ఆశ్రయించారు. ఈ విషయం నాకు కూడా మీడియా ద్వారానే తెలిసింది. టైటిల్ రిజిస్టర్ చేసుకున్న వారితో మాట్లాడుతున్నాం. సమస్య పరిష్కారం అవుతుంది. విడుదలలో ఎలాంటి మార్పు ఉండదు. ఈనెల 19నే తెలుగులో కూడా లియో విడుదల అవుతుంది.
- ఈ దసరాకి థియేటర్ల సమస్య లేదు. ఏ సినిమాకి తగ్గట్టుగా ఆ సినిమా విడుదలవుతుంది. 'లియో, భగవంత్ కేసరి, టైగర్ నాగేశ్వరరావు' సినిమాలకు ఎటువంటి సమస్య లేకుండా ఏ సినిమాకి కావాల్సినన్ని థియేటర్లు ఆ సినిమాకి కేటాయించారు. భగవంత్ కేసరి, టైగర్ నాగేశ్వరరావు కూడా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. 'భగవంత్ కేసరి' ఘన విజయం సాధించాలని, అంతకంటే పెద్ద హిట్ సినిమా బాలకృష్ణతో మేము తీయాలని కోరుకుంటున్నాను.
- మేము నిర్మించిన వాతి(సార్) చిత్రాన్ని తమిళ్‌లో లలిత్ కుమార్ విడుదల చేశారు. ఆ సమయంలో ఏర్పడిన అనుబంధంతో ఇప్పుడు తెలుగులో మేము 'లియో' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ ఆదివారంలోపు హైదరాబాద్‌లో 'లియో' వేడుక నిర్వహిస్తాం.

మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో రాబోతున్న 'గుంటూరు కారం' మొదటి పాట విడుదల ఎప్పుడనేది దసరా టైమ్‌లో తెలియజేస్తాం.

# నవచిత్రం

## వైభవంగా 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానం



జాతీయ ఉత్తమ నటీనటులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు స్వీకరిస్తున్న కృతిసనన్, అల్లుఅర్జున్, అలియాభట్



దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారంతో వహీదా రెహ్మాన్

69వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకలో జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటీమణులుగా అలియాభట్, కృతిసనన్‌తో పాటు ఈ అవార్డుల కోసం ఎంపికైన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కార ప్రదానం చేశారు. 2021 ఏడాదికి గాను కేంద్రప్రభుత్వం ఇటీవల ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

ఉత్తమ నటుడిగా 'పుష్ప' సినిమాకు హీరో అల్లుఅర్జున్ అవార్డు అందుకున్నారు. ఇన్నేండ్ల జాతీయ చలన పురస్కారాల చరిత్రలో ఉత్తమ నటుడిగా ఎంపికైన తెలుగు నటుడిగా అల్లుఅర్జున్ చరిత్ర సృష్టించారు. ఈ అవార్డుల వేడుకలో 10 అవార్డులతో తెలుగు సినిమా విజయ కేతనం ఎగురవేయటం ఓ విశేషమైతే, ఇందులో ఆరు అవార్డులను 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం కైవసం చేసుకోవడం మరో విశేషం. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకి సంబంధించి బెస్ట్ యాక్షన్ డైరెక్టర్‌గా కింగ్ సోలోమాన్, ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ప్రేమ్ రక్షిత్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా ఎం.ఎం. కీరవాణి, ఉత్తమ సింగర్‌గా కాల భైరవ, ఉత్తమ వీఎఫ్ఎక్స్‌కు శ్రీనివాస్ మోహన్, అన్ని వర్గాలను అలరించిన వినోదాత్మక చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్ ఎంపిక కావడంతో దర్శకుడు రాజమౌళి అవార్డులను స్వీకరించారు. అలాగే ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా, నిర్మాతలు నవీన యెర్నేని, యలమంచిలి రవిశంకర్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ (పుష్ప), నిర్మాత అభిషేక్ అగర్వాల్ (కశ్మీర్ ఫైల్స్), బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ పురుషోత్తమాచార్యులు అవార్డులను అందుకున్నారు.

ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారాన్ని అలనాటి మేటి బాలీవుడ్ నటి వహీదా రెహ్మాన్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ వేడుకకు విచ్చేసిన ఆహూతులందరూ స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడంతో ఆమె భావోద్వేగంతో కంట తడి పెట్టారు.



అవార్డుల స్వీకరణకి ముందు .. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన విజేతలందరూ కలసిన తరుణంలో క్లిక్‌మన్న ఫొటో..
(కింగ్ సోలోమాన్, నవీన్ యెర్నేని, బుచ్చిబాబుసానా, అల్లు అర్జున్, ప్రేమ్‌రక్షిత్, దేవిశ్రీ ప్రసాద్, చంద్రబోస్, వై.రవిశంకర్)

'నాకు గొప్ప ఆనందంగా ఉంది. నేను ఈ స్థాయికి రావడానికి నటీనటులు, సాంకేతికనిపుణులు, దర్శకులు, నిర్మాతలు.. ఇలా పరిశ్రమకి చెందిన చాలా మంది ఉన్నారు. అందుకే ఈ అవార్డును వారందరికీ అంకితం ఇస్తున్నాను'.

**- వహీదా రెహ్మాన్**

'ఈ క్షణం మాటల్లో చెప్పలేనిది. ఈ సందర్భాన్ని ఎంతో వినయ పూర్వక మైనదిగా.. గౌరవప్రదంగా భావిస్తున్నా. 'పుష్ప' లాంటి కమర్షియల్ సినిమాకు ఈ అవార్డు రావడం నాకు డబుల్ అచీవ్‌మెంట్.

**- అల్లు అర్జున్**

# మౌత్ టాక్‌తో థియేటర్లు, కలెక్షన్లు పెరుగుతున్నాయి



అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన 'రాక్షస కావ్యం' సినిమాను గరుడ ప్రొడక్షన్స్, పింగో పిక్చర్స్, సినీ వ్యాలీ మూవీస్ బ్యానర్స్‌లో దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించారు. శ్రీమాన్ కీర్తి దర్శకుడు.

ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి రెస్పాన్స్ బాగుండటంతో రోజు రోజుకూ థియేటర్స్, కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత దామురెడ్డి మాట్లాడుతూ, 'మా సినిమాకు ప్రేక్షకుల నుంచి రెస్పాన్స్ బాగుంది. రోజు రోజుకూ కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ఈ రెస్పాన్స్ చూసి డిస్ట్రిబ్యూటర్స్ కూడా మరో 30 థియేటర్స్ పెంచారు. దీంతో మా సినిమా 130 థియేటర్స్‌లో అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాతో నటీనటులకు, సాంకేతిక నిపుణులకు మంచి పేరు రావడం ఖాయం. కంటెంట్ బాగుంటే తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరిస్తారని మా సినిమా ప్రూవ్ చేసింది' అని తెలిపారు.

# టైగర్..ఎమోషన్‌కి అందరూ కనెక్ట్ అవుతారు



వంశీ కృష్ణ

రవితేజ, దర్శకుడు వంశీ కృష్ణ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ క్రేజీ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ సినిమా ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న సందర్భంగా దర్శకుడు వంశీ కృష్ణ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'టైగర్ నాగేశ్వరరావు గురించి రెండేళ్ళు రీసెర్చ్ చేశాం. మనకి తెలిసినంతవరకూ ఆయన ఒక దొంగే. అయితే ఆయన ఇన్నర్ సోల్ ఎవరికీ తెలీదు. అది సినిమాలో చూపించాలనిపించింది. టైగర్ నాగేశ్వరరావు అంటే ఒక ఎమోషన్. ఆయనకి మించిన ఎమోషన్ నేను చూడలేదు. ఆయనలో రెండు షేడ్స్ ఉన్నాయి. ఒక షేడ్‌లో చాలా భయంకరమైన వ్యక్తి. మరో కోణంలో చాలా మనసున్న మనిషి. ఈ రెండూ కోణాలు ఆయనలో తీవ్రంగా ఉంటాయి. టైగర్ నాగేశ్వరరావు బ్యూటీ అదే. అయితే దీన్ని తెరపై చూస్తున్నపుడు ఎమోషనల్ కనెక్ట్ చేస్తూ ఆసక్తిగా మలచడం ఒక సవాల్‌గా అనిపించింది. దొంగతనాలు చేసిన బంగారాన్ని అమ్మడానికి ఒక చోటు కావాలి. ఆ బెల్ట్‌లో చాలా మంది మార్వాడీలు వచ్చారు. అలా ఓ మార్వాడీ అమ్మాయితో టైగర్ నాగేశ్వర రావుకి అనుబంధం ఏర్పడుతుంది. అదే నుపూర్ పాత్ర. ఇది కల్పితం కాదు. టైగర్ నిజ జీవిత కథలో ఉంది. ఆ పాత్రని నుపూర్ చాలా చక్కగా చేసింది. హేమలత లవణం గురించి అందరికీ తెలుసు. అలాంటి పాత్రకు రేణు దేశాయ్ అయితే బావుంటుదని పించింది. ట్రైన్ సీక్వెన్స్. గోదావరి బ్రిడ్జ్‌ని రిక్రియేట్ చేయడం మామూలు విషయం కాదు. చెన్నైలో పోర్ట్ సీక్వెన్స్, జైలు నుంచి తప్పించుకునే సీక్వెన్స్.. ఇలా చాలా వండర్ ఫుల్ సీక్వెన్స్ ఉన్నాయి. అవినాష్ కొల్లా బ్రిలియంట్. తను స్టువర్ట్ పురం క్రియేట్ చేశాడు. జీవీ ప్రకాష్ స్క్రిప్ట్‌ని ఫాలో అయ్యే కంపోజర్. తను కథ సోల్‌ని పట్టుకోగలడు. అదే సమయంలో దాన్ని కమర్షియల్‌గా ఎలా చేయాలో తెలిసిన కంపోజర్. అభిషేక్ నిర్మాతలా కాకుండా ఒక ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు. ఆయన సపోర్ట్ వలనే ఇంత గ్రాండ్‌గా వచ్చింది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886